Crime Mirror QR Code

https://epaper.crimemirror.com/

# క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption

హైదరాబాద్
19-1-2025
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:14
సంచిక: 68

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD



## 1.65 కోట్ల ఎకరాల్లో డ్రోన్ల సర్వే పూర్తి


'స్వమిత్వ' కింద పూర్తి చేసిన మోదీ సర్కారు

65 లక్షలమందికి శాశ్వత భూహక్కు దఖలు

వారికి స్వమిత్వ కార్డులు పంపిణీ చేసిన ప్రధాని

న్యూఢిల్లీ, జనవరి 18: డ్రోన్లను ఉపయోగించి భూముల సర్వేలో మోదీ ప్రభుత్వం అద్భుతం చేసింది. రికార్డుస్థాయిలో గ్రామీణ ప్రాంతంలో 67 వేల చదరపు కిలోమీటర్ల (1.65 కోట్ల ఎకరాలు) భూముల సర్వేను పూర్తిచేసింది. దాదాపు రూ.132 లక్షల కోట్ల విలువైన భూసంబంధ వివాదాలను ఐదేళ్లలో పరిష్కరించింది. భూసర్వేను పూర్తిచేసుకున్న చోట 65 లక్షల మందికి శాశ్వత భూయాజమాన్య

2లో



## ఉగాదికి గద్దర్ అవార్డుల ప్రదానం

సినీ రంగంలో ప్రపంచ గమ్యస్థానంగా హైదరాబాద్

గత పదేళ్లలో చిత్ర పరిశ్రమను నిర్లక్ష్యం చేశారు

అవార్డుల కమిటీ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి

హైదరాబాద్, ఈ ఏడాది ఉగాది నుంచి ప్రతి ఏటా గద్దర్ తెలంగాణ చలనచిత్ర అవార్డులను ప్రదానం యాలని ప్రభుత్వం నిర్ణయించిందని, అందుకు తగిన విధంగా ఏర్పాట్లు పూర్తి చేయాలని అవార్డుల కమిటీ సభ్యులు, అధికారులకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సూచించారు. శనివారం సచివాలయంలో గద్దర్ అవార్డుల కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. తెలుగు భాషలో నిర్మించిన ఉత్తమ చిత్రాలను గుర్తించి, ప్రశంసిస్తూ అవార్డులను అందజేయనున్నట్లు తెలిపారు. జాతీయ సమైక్యత పెంపు, సాంస్కృతిక, విద్య, సామాజిక సంబంధిత చిత్రాలు,

2లో



## రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దయనీయం

హైదరాబాద్‌లో వీధి లైట్ల మరమ్మతుకూ పైసలివ్వట్లే..

రాష్ట్రాన్ని బీఆర్ఎస్, కాంగ్రెస్ అప్పుల్లో ముంచాయి

మెట్రో, ఆర్ఆర్ఆర్‌కు కేంద్ర సర్కారు నిధులిస్తోంది

కేటీఆర్ సుప్రీం కోర్టు జడ్జి అయిపోయినట్లుంది: కిషన్‌రెడ్డి

## ప్యాలెస్‌లపై ఆరా తీసిన అమిత్‌షా

విలాసాల భవంతులపై ఆశ్చర్యం

బెంగళూరులో 36 ఎకరాల్లో..

హైదరాబాద్‌లో వంద గదులతో..

రుషికొండపై 500 కోట్ల ప్రజాధనంతో

హరిత ట్రైబ్యునల్ జరిమానా కూడా వేసింది

షాకు వివరించిన బాబు, లోకేశ్ తదితరులు

ఎన్టీఆర్‌కు 'భారత రత్న'పై చర్చ

ఆయన అర్హుడని అమిత్ షా అభిప్రాయం

ఎయిర్‌పోర్టులో అమిత్‌కు ఘన స్వాగతం

భారీ సంఖ్యలో ఎమ్మెల్యేలు, నేతల రాక

పూలవర్షంతో స్వాగతించిన మహిళలు




అమరావతి,: రాష్ట్ర పర్యటనకు వచ్చిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు ఘన స్వాగతం లభించింది. కృష్ణా జిల్లా గన్నవరం మండలం కొండపావులూరులో ఆదివారం జాతీయ విపత్తు సంస్థలను ప్రారంభించడానికి విజయవాడకు అమిత్‌షా చేరుకున్నారు. ఆయన కోసం శనివారం రాత్రి ముఖ్యమంత్రి చంద్రబాబు తన నివాసంలో ప్రత్యేక విందు ఏర్పాటు చేశారు. చంద్రబాబు ఇంటి ఆవరణలో కృష్ణా నది పక్కన నిర్మించిన తాత్కాలిక హాల్‌లో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి తదితరులతో కలిసి అమిత్‌షా విందు ఆరగించారు. కృష్ణా తరంగాల మీదుగా...

- మిగతా 2వ పేజీలో

## ఫోర్త్ సిటీలో.. ఏఐ డేటా సెంటర్

- 100 మెగావాట్ల సామర్థ్యంతో ముచ్చర్లలో ఏర్పాటు
- రూ.3500 కోట్ల పెట్టుబడికి ఎస్టీ టెలీమీడియా సిద్ధం
- సింగపూర్‌లో సీఎం రేవంత్ సమక్షంలో ఒప్పందం
- ఫ్యూచర్ సిటీ, మూసీ ప్రాజెక్టుకు సహకరిస్తామని
- హామీ ఇచ్చిన ఆ దేశ వాణిజ్య మంత్రి గ్రేస్ ఫు హైయిన్
- సెమీ కండక్టర్ల రంగంలో పెట్టుబడులు పెట్టండి
- పారిశ్రామికవేత్తల భేటీలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



హైదరాబాద్, : రాష్ట్రంలో భారీ పెట్టుబడి పెట్టేందుకు.. సింగపూర్ ప్రధాన కేంద్రంగా ప్రపంచవ్యాప్తంగా విస్తరించిన ఎస్టీ టెలీమీడియా సంసిద్ధత వ్యక్తం చేసింది. ఫోర్త్ సిటీ ముచ్చర్ల సమీపంలోని మీరా?న్‌పేటలో డేటా సెంటర్ క్యాంపస్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం (ఎంవోయూ) చేసుకుంది. సింగపూర్ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ నేతృత్వంలోని ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు, ఉన్నతాధికారుల బృందం శనివారం ఎస్టీ టెలీమీడియా ప్రధాన కార్యాలయాన్ని సందర్శించింది. ఎస్టీ టెలీమీడియాగ్రూప్ సీఈవో బ్రూనో లోపెజ్, ఇతర ఉన్నతాధికారులతో చర్చలు జరిపింది. ఈ సందర్భంగానే సంస్థ సీఈవో.. 100 మెగావాట్ల సామర్థ్యంతో కూడిన ఏఐ ఆధారిత డేటా సెంటర్‌ను హైదరాబాద్‌లో రూ.3500 కోట్ల పెట్టుబడితో నిర్మించేందుకు సిద్ధంగా ఉన్నట్టు ప్రకటించారు. ఈమేరకు.

- మిగతా 2వ పేజీలో



## మంచు కుటుంబ వివాదంలో కొత్త మలుపు

ఇల్లు ఖాళీ చేయించాలని జిల్లా మెజిస్ట్రేట్‌కు మోహన్‌బాబు ఫిర్యాదు

మనోజ్‌కు నోటీసులు జారీ..

అదనపు కలెక్టర్ ఎదుట హాజరైన నటుడు

నేను తప్పు చేయలేదు.. మావి ఆస్తి గొడవలు కాదు.. విద్యార్థుల కోసం పోరాటం

న్యాయం దక్కేంతవరకు వెనకుతగ్గను: మంచు మనోజ్

## ఎన్టీఆర్ ఘాట్ ఇలానా?

నిర్వహణపై ఏపీ మంత్రి లోకేశ్ అసంతృప్తి

గోడలు, పైకప్పు పెచ్చులు ఊడిపోవడంపై అసహనం

సొంత నిధులతో మరమ్మతులకు సిబ్బందికి ఆదేశాలు

వర్ధంతి సందర్భంగా టీడీపీ వ్యవస్థాపకుడికి నివాళులు


తరలివచ్చిన కుటుంబసభ్యులు, అభిమానులు, నేతలు



హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ఘాట్ నిర్వహణ లోపంపై టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఏపీ మంత్రి నారా లోకేశ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. తన సొంత నిధులతో మరమ్మతులు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. ఎన్టీఆర్ 29వ వర్ధంతి సందర్భంగా శనివారం ఎన్టీఆర్ ఘాట్‌లో తల్లి భువనేశ్వరితో కలిసి ఆయన నివాళులర్పించారు. ఘాట్ గోడలు, పైకప్పు పెచ్చులు ఊడిపోవడం, గార్డెన్‌లో ఏర్పాటు చేసిన లైట్లు విరిగిపడి ఉండటాన్ని చూసి లోకేశ్ అసహనం వ్యక్తం చేశారు. అవసరమైన అనుమతులు తీసుకొని వీలైనంత తొందరగా ఘాట్ మరమ్మతులు పూర్తి చేయాలని ఆయన తన సిబ్బందిని ఆదేశించారు. 'ఎన్టీఆర్ అంటే కేవలం మూడు అక్షరాలు కాదు.. సినిమాల్లో, రాజకీయాల్లో నంబర్‌వన్‌గా నిలిచిన వ్యక్తి. తెలుగుజాతి చరిత్రలో ఆయన ఓ ప్రభంజనం' అని వ్యాఖ్యానించారు. ఎన్టీఆర్‌కు భారతరత్న ప్రకటించే విషయమై కేంద్రంతో చర్చలు జరుపుతున్నామని.. కచ్చితంగా వస్తుందని ఆశిస్తున్నామన్నారు. తెలంగాణలో టీడీపీని పునర్నిర్మాణం చేయాల్సి ఉందన్నారు. ఇక్కడ ఒక్క ఎమ్మె ల్యే లేకున్నా స్వచ్ఛందంగా ప్రజలే వచ్చి 1.60 లక్షల మంది సభ్యత్వం తీసుకున్నారని వెల్లడించారు. తెలంగాణలో పార్టీ

- మిగతా 2వ పేజీలో

# ప్యాలెస్‌లపై ఆరా తీసిన అమిత్‌షా



ఇంద్రకీలాద్రి పైనున్న కనకదుర్గమ్మ గుడి అలంకరణ కనిపించేలా అమిత్‌షాను కూర్చోబెట్టారు. ఎదురుగా గుడి చూస్తూ... 'నది పక్కన మీ ఇల్లు చాలా బాగుంది' అని అమిత్‌షా అన్నారు. అదే సమయంలో

**ప్యాలెస్‌లపై ఆరా తీసిన అమిత్‌షా**

అనూహ్యంగా మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్యాలెస్‌ల గురించి అమిత్‌షా ఆరా తీసినట్లు తెలిసింది. జగన్‌కు ఎన్ని ప్యాలెస్‌లు ఉన్నాయని అమిత్‌షా అడగ్గా... బెంగళూరులో ఆరు ఎకరాల్లో ఒక పెద్ద ప్యాలెస్ ఉన్నట్లుందని సీఎం చంద్రబాబు చెప్పారు. 'ఆరు కాదు..... మొత్తం 32 ఎకరాలు.అందులో పెద్ద ప్యాలెస్ కట్టుకొన్నారు. హైదరాబాద్‌లో కూడా ఆయన భవనంలో వంద గదులు ఉన్నాయి" అని మంత్రి లోకేశ్ వివరించారు. ముప్పై రెండు ఎకరాలా అని అమిత్ షా ఆశ్చర్యపోయారు. 'ఇవి చాలవని విశాఖపట్నంలో రూ. ఐదు వందల కోట్ల ప్రభుత్వ ధనం ఖర్చు పెట్టి తాను ఉండటం కోసం భారీ భవనాలు నిర్మించారు. నిబంధనలకు విరుద్ధంగా కట్టారని హరిత ట్రిబ్యునల్ ఆ నిర్మాణాలపై రూ. రెండు వందల కోట్లు జరిమానా విధించింది" అని చంద్రబాబు చెప్పారు. ఆ డబ్బులు జగన్ కట్టారా? అని అమిత్ షా అడిగారు. ఇంకా చెల్లించలేదని చంద్రబాబు బదులిచ్చారు. "హరిత ట్రిబ్యునల్ చాలా శక్తివంతమైంది. మేం గతంలో అండమాన్‌లో పర్యాటకుల కోసం ఒక భవనం కడితే ఇలాగే భారీ జరిమానా వేశారు. దానికోసం అనేకసార్లు మాట్లాడి కొంత తగ్గించగలిగాం. జరిమానా కట్టడం తప్ప వేరే మార్గం లేదు" అని అమిత్ షా తన అనుభవం వివరించారు. జగన్ ఏం చేస్తున్నారు... తిరుగుతున్నారా.. అని అమిత్‌షా అడిగారు. ప్రకటనలు ఇవ్వడం తప్ప ఇంతవరకూ పెద్దగా తిరుగుతోంది లేదని, సుదీర్ఘ యాత్రలు చేయబోతున్నానని లీకులు మాత్రం ఇస్తున్నారని లోకేశ్ వ్యాఖ్యానించారు. టీడీపీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షాను సీఎం చంద్రబాబు కోరారు. ఆయన తప్పనిసరిగా ఇవ్వాల్సిన వ్యక్తి అని అమిత్ షా వ్యాఖ్యానించారు. తాను దానిపై ఒక లేఖను కూడా ఇచ్చానని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ పురందేశ్వరి ఆయనకు చెప్పారు. తెలుగు ప్రధాని పీవీ నర్సింహారావును గుర్తు చేసుకొన్న ఆయన.... పీవీ ఎన్నిసార్లు ముఖ్యమంత్రిగా చేశారు... ఎంత కాలం ఉన్నారని అడిగారు. "ఆయన కేవలం పదిహేను నెలలు మాత్రమే ముఖ్యమంత్రిగా ఉన్నారు. కాంగ్రెస్ అధిష్ఠానం అప్పట్లో పదేపదే ముఖ్యమంత్రులను మార్చేది" అని చంద్రబాబు తెలిపారు. ఆ పార్టీ తరపున ఎక్కువ కాలం ఎవరు ముఖ్యమంత్రిగా చేశారని అమిత్ షా అడిగారు. "వైఎస్ రాజశేఖరరెడ్డి ఆరేళ్లు చేశారు. కాసు బ్రహ్మానంద రెడ్డి ఆయన కంటే కొంత ఎక్కువ కాలం చేసినట్లు గుర్తు" అని చెప్పారు. ఈ ప్రాంతంలో పండుతున్న పంటల గురించి కూడా అమిత్ షా అడిగారు. "ఈ ప్రాంతం రాష్ట్ర ధాన్యాగారంగా ప్రసిద్ధి. రాయలసీమ ప్రాంతంలో ఉద్యానవన పంటలు పెరుగుతున్నాయి. గత కాలంలో ఈ ప్రాంతంలో ఒక ఎకరం అమ్మితే తెలంగాణలో ఐదెకరాల భూమి వచ్చేది. ఇప్పుడు హైదరాబాద్ పక్కన ఒక ఎకరం అమ్మితే ఇక్కడ ఏభై ఎకరాలు వచ్చేలా పరిస్థితులు మారిపోయాయి. హైదరాబాద్ అంత ఎదిగిపోయింది" అని చంద్రబాబు వివరించారు. అమరావతికి కూడా మంచి భవిష్యత్తు ఉంటుందని అమిత్ షా వ్యాఖ్యానించారు. మిర్చి, పొగాకు కూడా ఈ ప్రాంతంలో బాగా పండుతాయని పురందేశ్వరి చెప్పారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ తిరిగి కోలుకోవడానికి కేంద్రం ఉదారంగా సాయం చేయడం పట్ల అమిత్‌షాకు చంద్రబాబు ధన్యవాదాలు తెలిపారు. అమరావతి రాజధాని నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు పురోగతిని ఆయనకు వివరించారు.

# ఉగాదికి గద్దర్ అవార్డుల ప్రదానం

(మొదటి పేజీ తరువాయి)

ఈ ఏడాది ఉగాది నుంచి ప్రతి ఏటా గద్దర్ తెలంగాణ చలనచిత్ర అవార్డులను ప్రదానం యాలని ప్రభుత్వం నిర్ణయించిందని, అందుకు తగిన విధంగా ఏర్పాట్లు పూర్తి చేయాలని అవార్డుల కమిటీ సభ్యులు, అధికారులకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సూచించారు. అత్యున్నత సాంకేతిక నైపుణ్యం, మానవతా విలువలతో కూడిన చిత్రాలను ప్రోత్సహించాలనే లక్ష్యంతో ఈ అవార్డులు ఇవ్వనున్నామని పేర్కొన్నారు. అవార్డుల పంపిణీ కార్యక్రమాన్ని జాతీయ స్థాయి కార్యక్రమాల తరహాలో నిర్వహించాలని సూచించారు. గద్దర్ ప్రతిష్ఠను పెంచేలా అవార్డుల లోగో ఉండాలన్నారు. సినిమా రంగం లో హైదరాబాద్‌ను ప్రపంచ గమ్యస్థానంగా మార్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. గత పదేళ్లుగా రాష్ట్రాన్ని పాలించినవారు చిత్ర పరిశ్రమను నిర్లక్ష్యం చేశారని, అవార్డుల ప్రదానం జరగలేదన్నారు. ఫీచర్ ఫిల్మ్ లు, బాలల చిత్రాలు, తెలుగు సినిమాలపై పుస్తకాలు వంటి వివిధ విభాగాల కింద అవార్డులు ఇవ్వాలని సమావేశంలో నిర్ణయించారు. అవార్డుల్లో నగదు పురస్కారంతో పాటు ప్రశంసాపత్రాలను అందజేస్తారు. ఈ సమావేశంలో టీఎఫ్‌డీసీ చైర్మన్ దిల్‌రాజు, ఎండీ హరీశ్, కమిటీ చైర్మన్ బి.నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# 1.65 కోట్ల ఎకరాల్లో డ్రోన్ల సర్వే పూర్తి

(మొదటి పేజీ తరువాయి)

ధ్రువీకరణ (స్వమిత్వ) కార్డులను శనివారం ప్రధాని మోదీ పంపిణీ చేశారు. అనంతరం కొందరు లబ్ధిదారులతో వీడియోకాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. పల్లె సీమల్లో ఆర్థిక జీవనం మెరుగుపడటానికీ, పేదరికం నుంచి బయటపడటానికి లబ్ధిదారులకు స్వమిత్వ కార్డులు ఉపకరిస్తాయని ఆయన తెలిపారు. సరైన లీగల్ పత్రాలతో సొంత ఆస్తిపై హక్కును కలిగి ఉండటం పేదరిక నిర్మూలనలో చాలా ముఖ్యమైన అంశంగా ఐక్యరాజ్యసమితి కూడా గుర్తించిందని తెలిపారు. గ్రామాల్లో ఉండే ఆస్తి డెడ్ కాపిటల్ అని, దానిని ఎవరూ దేనికోసమూ ఉపయోగించుకోలేరని, ప్రజల ఆదాయ స్థాయిని అది పెంచలేదని ఓ ప్రముఖ ఆర్థిక వేత్త అన్నారని, అది తప్పు అని నిరూపించాల్సిన సమయం వచ్చిందన్నారు. లక్షల కోట్ల విలువైన ఆస్తులను కలిగిఉన్నా, వాటిని ధ్రువీకరించే సరైన పత్రాలు లేకపోవడం గ్రామసీమలు ఎదుర్కొంటున్న పెద్ద సవాల్ అనీ, దానివల్ల రుణం ఇవ్వడానికి బ్యాంకులు ముందుకు రావడం లేదన్నారు. స్వమిత్వ కార్డులను ఉపయోగించి బ్యాంకు నుంచి రుణం తీసుకోవచ్చునని, ఆ డబ్బులతో కొత్తగా వ్యాపారాలు మొదలుపెట్టవచ్చునని మోదీ సూచించారు. కాగా, ఇవే వివరాలతో కేంద్ర పంచాయతీరాజ్ విభాగం ఒక ప్రకటన విడుదల చేసింది. స్వమిత్వ పథకం కింద ఇప్పటివరకు 3.17 లక్షల గ్రామాల (92శాతం) పరిధిలో సర్వే పనులు పూర్తిచేశామని పేర్కొంది. మొత్తం 3.44 లక్షల గ్రామాలను ఈ పథకంలోకి తీసుకురావాలనే లక్ష్యాన్ని 2026నాటికి చేరుకుంటామని పేర్కొంది. పది రాష్ట్రాల పరిధిలో కార్డుల పంపిణీ జరిగినట్టు వివరించింది. కాగా, స్వమిత్వ కార్యక్రమాన్ని కేంద్రప్రభుత్వం 2020 ఏప్రిల్‌లో ప్రారంభించింది.

# రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దయనీయం

హైదరాబాద్,: తెలంగాణను బీఆర్ఎస్ ప్రభు త్వం అప్పుల కుప్పగా మారిస్తే, కాంగ్రెస్ సర్కారు దివాళా తీయిస్తోందని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అన్నారు. విశ్వనగరంగా ప్రచా రం చేస్తున్న హైదరాబాద్‌లో వీధిలైట్ల మరమ్మతులకు కూడా డబ్బులు ఇవ్వలేని దుస్థితి నెలకొందని విమర్శించారు. చివరకు మద్యం ఆదాయాన్ని కూడా ప్రభుత్వం మళ్లించిందంటే పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో అర్థమవుతోందన్నారు. శనివారం, బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో చిట్‌చాట్ చేశారు. సంక్షేమ పథకాలకు బీజేపీ వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. ఉచితాలకు తాము వ్యతిరేకమని ఎప్పుడూ చెప్పలేదన్నారు. ఏ ప్రభుత్వమైనా ఆదాయం, ఖర్చులను బేరీజు వేసుకుని సంక్షేమ పథకాలను అమలు చేయాలని పేర్కొన్నారు. కేంద్రంలో ఆర్థిక పరిస్థితి బాగుందని.. అందుకే దేశవ్యాప్తంగా 83 కోట్ల మంది పేదలకు ఉచితంగా బియ్యం ఇస్తున్నామని చెప్పారు. ఒక పార్టీ నుంచి గెలిచిన సభ్యుడు ఆ పార్టీకి రాజీనామా చేస్తేనే మరో పార్టీలోకి చేర్చుకోవాలన్న షరతు విధిస్తేనే ఫిరాయింపులకు చెక్‌పడుతుందన్నారు. తెలంగాణ అభివృద్ధిలో భాగంగా మెట్రోరైల్ రెండో దశ, రీజినల్ రింగ్‌రోడ్డు, రీజినల్ రింగ్ రైల్ వంటి ప్రాజెక్టులను సాధించేందుకు చొరవ చూపాలని సీఎం రేవంత్ చేసిన విజ్ఞప్తిపై కిషన్‌రెడ్డి స్పందించారు. రీజినల్ రింగ్ రోడ్డుకు కేంద్రమే నిధులు మంజూరు చేసిందని చెప్పారు. మెట్రో రెండో దశకు కేంద్ర క్యాబినెట్ ఆమోదంపై తాను బాధ్యత తీసుకుంటానని తెలిపారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఉన్నతాధికారులతో చర్చిస్తానని చెప్పారు. రీజినల్ రింగ్ రైల్ సర్వేకు కేంద్రం నిధులు ఇచ్చిందని, అయితే, రాష్ట్ర ప్రభుత్వం భూ సేకరణ చేయలేదని ఆయన అన్నారు.

**త్వరలో 6లక్షల మంది కార్మికులకు కోటి బీమా**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. సుప్రీం కోర్టు జడ్జి అయినట్లు ఉన్నారని కిషన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. రాష్ట్రంలోని 10 అసెంబ్లీ నియోజకవర్గాలకు ఉప ఎన్నికలు ఖాయమంటూ కేటీఆర్ చేసిన వ్యాఖ్యపై ఆయన స్పందించారు. పునర్విభజన చట్టం ప్రకారమే, ఏపీకి కేంద్రం నిధులు కేటాయిస్తోందని చెప్పారు. రాజ్యాంగ పుస్తకాన్ని జేబులో పెట్టుకుని తిరగడం తప్ప అందులో ఎన్ని పేజీలున్నాయో కూడా రాహుల్ గాంధీకి తెలియదని విమర్శించారు. చిరంజీవిని పార్టీలో చేర్చుకునేందుకు బీజేపీ అగ్రనాయకత్వం ఆలోచిస్తోందంటూ జరుగుతున్న ప్రచారంపై కిషన్‌రెడ్డి స్పందించారు. చిరంజీవి విశాల దృ కృథం కలిగిన వ్యక్తి అని, ఆయనతో పాటు మిగతా సినీ ప్రముఖులు కూడా వస్తామంటే పిలుస్తామని చెప్పారు. తన శాఖ పరిధిలో 6 లక్షల మంది కార్మికులు పనిచేస్తున్నారని, వారికి త్వరలోనే రూ.కోటి బీమా సౌకర్యాన్ని కల్పిస్తామని వెల్లడించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కావాలంటే పార్టీ సంస్థాగత నియమావళి ప్రకారం, రెండు పర్యాయాలు క్రియాశీల సభ్యత్వం (ఆరేళ్లు) ఉండాలని కిషన్‌రెడ్డి అన్నారు. అయితే, ఎంపీ ఈటల రాజేందర్ కూడా రేసులో ఉన్నందున ఆయన అర్హులవుతారా..? అన్న ప్రశ్నకు కిషన్‌రెడ్డి సమాధానమిచ్చారు. బీజేపీలో చేరిన తర్వాత ఈటల నాలుగు ఎన్నికల్లో(హుజూరాబాద్ ఉప ఎన్నిక.. గజ్వేల్, హుజూరాబాద్ అసెంబ్లీ ఎన్నిక, మల్కాజిగిరి ఎంపీ ఎన్నిక) పోటీ చేశారని, అందువల్ల ఆయనకు ఈ నిబంధన వర్తించదని తె లిపారు. సంఘ్ నేపథ్యం ఉన్నా, లేకున్నా అధ్యక్షులు కావొచ్చని చెప్పారు. వారం తర్వాత రాష్ట్ర పార్టీ అధ్యక్షుడి ఎన్నిక ఉంటుందని కిషన్‌రెడ్డి వివరించారు. రాష్ట్రంలో ఉప ఎన్నికలు రావడం తథ్యమని బీజేపీ మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ అన్నారు. కాంగ్రె స్‌లో చేరిన ఎమ్మెల్యేలు రాజీనామా చేయడంలేదని, వారితో రాజీనామా చేయించి ఉప ఎన్నికలకు వెళ్తే గెలవడం అసాధ్యమని ఆ పార్టీ భావిస్తోందని చె ప్పారు. శనివారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ తప్పిదాలపై దర్యాప్తు సరిగా జరగడం లేదని విమర్శించారు.

# ఫోర్త్ సిటీలో.. ఏఐ డేటా సెంటర్

(మొదటి పేజీ తరువాయి)

సీఎం రేవంత్ సమక్షంలో పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, సంస్థ బ్రూనో లోపెజ్ ఎంవోయూపై సంతకాలు చేశారు. డేటా సెంటర్ల నిర్వహణలో అంతర్జాతీయ ఖ్యాతి గడించిన ఎస్టీ టెలీమీడియాకు ఇప్పటికే చైనా, యుకే, జర్మనీ, జపాన్, దక్షిణ కొరియా, థాయ్‌లాండ్, మలేసియా, ఫిలిప్పీన్స్‌లో డేటా సెంటర్లు ఉన్నాయి. భారత్‌లోనూ హైదరాబాద్‌లోని హైటెక్‌సిటీలో 8 మెగావాట్ల డేటా సెంటర్‌తోపాటు 10 నగరాల్లో డేటా సెంటర్లను కలిగి ఉంది. ముచ్చర్లలో నిర్మించబోయే డేటా సెంటర్ దేశంలోనే అతిపెద్ద సెంటర్లలో ఒకటిగా ఉంటుందని.. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా దాని సామర్థ్యాన్ని పెంచుతామని కంపెనీ వెల్లడించింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. త్వరలోనే హైదరాబాద్ డేటా సెంటర్లకు రాజధానిగా అవతరిస్తుందని అన్నారు. తెలంగాణ ప్రభుత్వంతో కలిసి పని చేయటం గౌరవంగా ఉందని బ్రూనో లోపెజ్ పేర్కొన్నారు. మౌలిక సదుపాయాలతో పాటు తెలంగాణ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రగతిశీల విధానాలు సాంకేతిక ఆవిష్కరణలను ప్రోత్సహించే విధంగా ఉన్నాయని కొనియాడారు. ఇక.. ప్రపంచానికి హైదరాబాద్ డేటా సెంటర్ల హబ్‌గా మారుతుందని ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు ధీమా వ్యక్తం చేశారు. ప్రపంచవ్యాప్తంగా ఏఐ ఆధారిత రంగాల్లో వస్తున్న వినూత్న మార్పుల్లో హైదరాబాద్ ముఖ్యమైన పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు.

**పరస్పర సహకారం..**

సింగపూర్‌లో పర్యటిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రతినిధుల బృందం శనివారం ఆ దేశ వాణిజ్య, పర్యావరణ మంత్రి గ్రేస్ ఫు హైయిన్‌తో భేటీ అయింది. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అపారమైన అవకాశాల గురించి వివరించగా.. ప్రభుత్వానికి సహకారంపై ఆమె సానుకూలంగా స్పందించారు. తెలంగాణ రైజింగ్ లక్ష్య సాధనలో పాలుపంచుకోవాలన్న రాష్ట్ర ప్రభుత్వ ఆహ్వానాన్ని పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. ఫ్యూచర్ సిటీ, మూసీ పునరుజ్జీవన ప్రాజెక్ట్, నీటి వనరుల నిర్వహణ, తెలంగాణ ఎంచుకున్న సుస్థిర వృద్ధి ప్రణాళికలపై ఆమె ఆసక్తి ప్రదర్శించారు. పలు ప్రాజెక్టుల్లో పరస్పరం కలిసి పని చేసేందుకు అంగీకరించారు.

**పారిశ్రామికవేత్తలతో..**

తెలంగాణలో భారీ వ్యాపార అవకాశాలున్న సెమీ కండక్టర్ల రంగంలో పెట్టుబడులు పెట్టాలని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సింగపూర్ పారిశ్రామికవేత్తలను కోరారు. తెలంగాణలో అందుబాటులో ఉన్న ఆధునిక మౌలిక సదుపాయాలు, పారిశ్రామిక అనుకూల విధానాల గురించి తెలిపేందుకు శనివారం ఆయన సెమీకండక్టర్ పరిశ్రమ అసోసియేషన్ (ఎస్ఎస్ఐఏ)తో ప్రత్యేక రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ భేటీలో ఎస్ఎస్ఐఏ చైర్మన్ బ్రియాన్ టాన్, వైస్ చైర్మన్ టాన్ యూ కాంగ్, సెక్రటరీ సి.ఎస్.చుహ తదితర ప్రతినిధులు పాల్గొన్నారు. రాష్ట్రంలో సెమీకండక్టర్ల రంగంలో పెట్టుబడులకు ఆసక్తి ప్రదర్శించారు. ఈ ఏడాది చివర్లో సింగపూర్ నుంచి తమ ప్రతినిధుల బృందం హైదరాబాద్‌ను సందర్శించి, పరిశీలన జరుపుతుందని వారు తెలిపారు.

**రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టండి**

సొంత రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని, రాష్ట్ర అభివృద్ధిలో పాలుపంచుకోవాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సింగపూర్‌లో స్థిరపడ్డ ప్రవాస తెలంగాణ వాసులను కోరారు. సింగపూర్ పర్యటనలో ఉన్న ఆయన.. మంత్రి శ్రీధర్‌బాబు, ఉన్నతాధికారులతో కలిసి తెలంగాణ సాంస్కృతిక సంఘం ఏర్పాటుచేసిన మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమంలో శనివారం పాల్గొన్నారు. సింగపూర్ అభివృద్ధిలో తెలంగాణవాసుల భాగస్వామ్యం ఉండటం సంతోషంగా ఉందని పేర్కొన్న సీఎం.. పారిశ్రామిక అభివృద్ధిలో దేశంలోనే అగ్రస్థానంలో ఉన్న తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని పిలుపునిచ్చారు.

# అబద్ధాల మీదే బీఆర్ఎస్ పుట్టుక

హైదరాబాద్,: "ఇచ్చిన ప్రతి గ్యారెంటీని అమలు చేస్తున్నాం. కానీ అర గ్యారెంటీ అమలు చేశామని విపక్ష నేతలు విమర్శలు చేస్తున్నారు. అబద్ధాల మీదే బీఆర్ఎస్ పుట్టింది. వాళ్ల అధికారంలో ఉన్నంతకాలం అబద్ధపు ప్రచారం చేసుకుని బతికారు. వాళ్ల పరిష్కరించలేని సమస్యలను కూడా మేం పరిష్కరిస్తున్నాం" అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడించారు. సచివాలయం ఎదురుగా ఉన్న రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద ఉత్తర డిస్కమ్(ఎన్పీడీసీఎల్) పరిధిలో ఎంపికైన 92 మంది జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్లకు నియామక పత్రాలను, ట్రాన్స్‌కోలో 20 మందికి కారుణ్య నియామక పత్రాలను ఉప ముఖ్యమంత్రి శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఏడు లక్షల కోట్లు అప్పు చేసి రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని, ప్రస్తుతం తాము ఆ అప్పులనుంచి రాష్ట్రాన్ని బయటకు తీసుకువస్తున్నామని చెప్పారు. లక్షలాది మంది ఉద్యోగులకు 1వ తేదీనే వేతనాలు ఇచ్చే పరిస్థితిని తెచ్చామన్నారు. ఏడాదికాలంలోనే 56 వేల మందికి ఉద్యోగాలిచ్చామని చెప్పారు. "రుణమాఫీ జరిగిందోలేదో?.. రూ. 500కు గ్యాస్ సిలిండర్ వస్తోందో లేదో గ్రామాల్లో తిరిగి పరిశీలించుకోవాలి" అని సూచించారు. వ్యవసాయ యోగ్యమైన భూములకే రైతు భరోసా అమలు చేయాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. ఈనెల 26వ తేదీ నుంచి రైతు భరోసాతో పాటు భూములు లేని వ్యవసాయ కూలీల కుటుంబాలకు సహాయం అందించనున్నామని తెలిపారు. కొత్త రేషన్ కార్డులను జారీ చేస్తామని ఆయన చెప్పారు. తమ ప్రభుత్వం సంక్షేమంతోపాటు మౌలిక సదుపాయాల కల్పనకు కూడా నిధులు కేటాయిస్తోందని భట్టి తెలిపారు. దుబారా ఖర్చులు చేయకుండా సంపదను పెంచి ప్రతి పైసా పేదలకే పంచుతామని చె ప్పారు.

# ఎన్టీఆర్ ఘాట్ ఇలానా?

(మొదటి పేజీ తరువాయి)

పునర్వైభవానికి త్వరలోనే భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. తెల్లవారుజాము నుంచే ఎన్టీఆర్ ఘాట్‌కు కుటుంబసభ్యులు, అభిమానులు, టీడీపీ నేతల రాక మొదలైంది. ఉదయం 5.30 గంటలకే సినీనటులు జూనియర్ ఎన్టీఆర్, కల్యాణ్‌రామ్‌తో కలసి వచ్చి నివాళులర్పించి కాసేపు ఘాట్ వద్ద కూర్చున్నారు. తర్వాత సినీనటుడు, ఎమ్మెల్యే బాలకృష్ణ తన సోదరుడు రామకృష్ణ, ఇతర నేతలతో కలసి వచ్చి ఘాట్ వద్ద నివాళులర్పించారు.



**ఎన్టీఆర్ పథకాలే వేరే పేర్లతో అమలు: బాలకృష్ణ**

ప్రపంచంలోనే ఎన్టీఆర్‌ను మించిన నటనాచార్యులు ఎవరూ లేరని బాలకృష్ణ అన్నారు. కష్టజీవుల కన్నీళ్లు, అన్నార్తుల ఆకలి నుంచి టీడీపీ పుట్టిందన్నారు. ఎన్టీఆర్ పెట్టిన పథకాలు ఇప్పటికీ పేర్లు మార్చి కొనసాగిస్తున్నారని చెప్పారు. రాజకీయాలకు అతీతంగా తెలుగు రాష్ట్రాన్ని అభివృద్ధి చేసిన మహానాయకుడు ఎన్టీఆర్ అని మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు అన్నారు. కులాలకు, మతాలకు అతీతుడైన ఆయన జయంతి, వర్ధంతులను అధికారికంగా నిర్వహించాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కోరారు. ఎన్టీఆర్ ఘాట్‌లో నివాళులర్పించిన వారిలో ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు, టీటీడీ బోర్డు సభ్యుడు నర్సిరెడ్డి, తెలంగాణ టీడీపీ నేతలు బక్కని నర్సింహులు, అరవింద్‌కుమార్ గౌడ్ తదితరులున్నారు. ఇటు ఎన్టీఆర్ ఘాట్ నిర్వహణ బాధ్యతలు చూడాల్సిన హెచ్ఎండీఏ తీరు పట్ల ఎన్టీఆర్ అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్వహణ బాధ్యతలు ఎన్టీఆర్ ట్రస్టుకు అప్పగించాలని డిమాండ్ చేశారు.

**రాష్ట్రవ్యాప్తంగా కార్యక్రమాలు..**

రాష్ట్రవ్యాప్తంగా ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాలను ఆయన అభిమాను లు, టీడీపీ నేతలు ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రక్తదానంతో పాటు రోగులకు పండ్ల పంపిణీ, అన్నదానం వంటి సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఖమ్మంలో ఎన్టీఆర్ విగ్రహానికి కేంద్ర మాజీ మంత్రి, ఎంపీ రేణుకా చౌదరి పూలమాల వేసి నివాళులర్పించారు. దేశ రాజకీయాల్లో ఎన్టీఆర్ చరిత్ర సృష్టించారని.. జాతీయ రాజకీయాల్లో కూటమి ఏర్పాటుకు ఆద్యుడని అన్నారు.

# మంచు కుటుంబ వివాదంలో కొత్త మలుపు

రంగారెడ్డి అర్బన్, జనవరి :సినీ నటుడు మంచు మోహన్‌బాబు కుటుంబ వివాదం రోజుకో కొత్త మలుపు తిరుగుతోంది. కేసులు, పోలీసు విచారణలు, కోర్టులో వాయిదాల తర్వాత కొంత శాంతించినట్లు కనిపించినా మరో వివాదం తెరమీదకు వచ్చింది. హైదరాబాద్ శివారు జల్‌పల్లిలోని తన ఇంట్లో ఉంటున్న చిన్న కుమారుడు మనోజ్‌ను ఖాళీ చేయించాలని కొన్ని రోజుల క్రితం జిల్లా మెజిస్ట్రేట్‌ను మోహన్‌బాబు ఆశ్రయించారు. దీంతో తాజాగా మోహన్‌బాబు నివాసంలో ఉంటున్న మనోజ్‌కు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నోటీసులు పంపించారు. వాటికి వివరణ ఇచ్చేందుకు మనోజ్ శనివారం రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ ఎదుట హాజరయ్యారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. "నాన్నగారిని నేను ఎప్పుడూ వ్యతిరేకించను. కేవలం నా అన్న.. నాన్నను మందుకునెట్టి వెనుకనుంచి ఆడుతున్న నాటకం ఇది" అని ఆరోపించారు. నివాసం ఖాళీ చేయమని కలెక్టర్ ఇచ్చిన నోటీసులపై లిఖితపూర్వకంగా స్పందిస్తానని, దాన్ని మీడియాకు కూడా విడుదల చేస్తానని తెలిపారు. తమవి ఆస్తి గొడవలు కాదని, తమ విద్యాసంస్థలో విద్యార్థులకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నించినదుందుకు ఆస్తి గొడవలుగా ప్రచారం చేస్తున్నారని చెప్పారు. విద్యార్థులకు జరుగుతున్న నష్టంపై తాను మెసేజ్ రూపంలో తెలిపినా పట్టించుకోలేదన్నారు.

## ఇంకా కొలిక్కిరాని మంచు కుటుంబం వివాదాలు

### తాజాగా విష్ణును ఉద్దేశిస్తూ మనోజ్ ఆసక్తికర ట్వీట్



**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** మంచు కుటుంబంలో వివాదాల ఎపిసోడ్ కొనసాగుతూనే ఉంది. ఇప్పటికే కేసుల పరంపరం కొనసాగుతుండగా.. తాజాగా మనోజ్ ఆసక్తికర ట్వీట్ చేశారు. వివాదానికి ఎండ్ కార్డ్ వేసేలా ఈ ట్వీట్ ఉంది. చర్చలకు అన్న విష్ణును ఆహ్వానిస్తూ మనోజ్ ట్వీట్ చేశాడు. 'రండి ఇద్దరు కలిసి కూర్చొని మాట్లాడుకుందాం. నేను ఒక్కడినే వస్తాను. ఏ ప్లేస్‌కైనా వస్తాను. ఎవరినో అడ్డం పెట్టుకుని మాట్లాడాల్సిన అవసరం నాకు లేదు. నాన్నని, మహిళ, సిబ్బందిని అడ్డం పెట్టుకుని మాట్లాడాల్సిన అవసరం లేదు. మన వద్ద ఉన్న సమస్యకు ఒక పరిష్కారం తీసుకొని వద్దాం. ఆరోగ్యకరమైన వాతావరణంలో చర్చలు జరుపుకుందాం.' అంటూ మనోజ్ ట్వీట్ చేశారు. ఇక శుక్రవారం నాడు ఒక ట్వీట్ చేసిన మనోజ్.. అందులో షాకింగ్ కామెంట్స్ చేశాడు. "కన్నప్పలో రెబల్ స్టార్ కృష్ణం రాజు మాదిరిగా సింహం అవ్వాలని ప్రతి ఫ్రాడ్ కుక్కకి ఉంటుంది. ఈ విషయం నువ్వు ఇదే జన్మలో తెలుసుకుంటావ్' అని పోస్ట్ చేసిన మనోజ్.. ఆ పోస్టుకు విష్ణును ట్యాగ్ చేశాడు.

## తెలంగాణలో టీడీపీని బలోపేతం చేస్తాం : నారా లోకేశ్



**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** తెలంగాణలో టీడీపికి ఇంకా ఎనలేని ఆదరణ ఉందని, త్వరలోనే టీడీపీకి పూర్వ వైభవం తేస్తామని ఏపీ మంత్రి నారా లోకేశ్ అన్నారు. తెలంగాణలో తెలుగుదేశం పార్టీని మళ్లీ విస్తరిస్తామని, ఈ దిశగా చర్చలు జరుపుతున్నామన్నారు. త్వరలోనే భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా హైదరాబాద్ ఎన్టీఆర్ ఘాట్ వద్ద నారా లోకేశ్ నివాళి అర్పంచారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలో 1.60 లక్షల మంది టీడీపీ సభ్యత్వం తీసుకున్నారని, పార్టీపై తెలంగాణ ప్రజలకు ప్రేమ, ఆశ ఉందంటూ వ్యాఖ్యానించారు. ఇక్కడ పార్టీని బలోపేతం చేయడమే తమ లక్ష్యమని చెప్పారు. తెలంగాణలో టీడీపీపై ప్రజలకు ఎంతో ప్రేమ ఉన్నదని, స్వచ్ఛందంగా 1.6 లక్షల మంది సభ్యత్వాలు పొందడమే దానికి ఉదాహరణ అని చెప్పారు. తమకు ఇక్కడ ఒక్క ఎమ్మెల్యే కూడా లేకపోయినా ఇంతమంది సభ్యత్వం తీసుకున్నారని వెల్లడించారు. రాబోయే రోజుల్లో ఇక్కడ కూడా పార్టీ కార్యకలాపాలు ప్రారంభిస్తామన్నారు.

## 108లో సీపీఆర్ చేసి శిశువు ప్రాణాలను కాపాడిన సిబ్బంది


**మెదక్,(క్రైమ్ మిర్రర్):** ప్రమాదాలు జరిగినప్పుడు సకాలంలో వైద్యం అందిస్తే ప్రాణాలు కాపాడవచ్చని వైద్యుల సలహాలు అక్షరాల నిజమని నిరూపించారు 108 సిబ్బంది. మెదక్ ప్రభుత్వ ఆసుపత్రిలో అప్పుడే పుట్టిన శిశుకు శ్వాస ఇబ్బందులు తలెత్తాయి. వైద్యుల సూచన మేరకు వెంటనే చిన్నారిని 108 అంబులెన్స్‌లో హైదరాబాద్‌కు తరలిస్తుండగా చిన్నారి గుండె ఆగిపోయింది. వెంటనే స్పందించిన 108 సిబ్బంది ఆ చిన్నారికి సీపీఆర్ చేశారు. పైలట్ నవీన్, ఈఎంటీ రాజు సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడి ఆసుపత్రిలో చేర్చారు. ప్రస్తుతం ఆ చిన్నారి వైద్యుల పర్యవేక్షణలో పూర్తిగా కోలుకుంటుంది. సకాలంలో సీపీఆర్ చేసిన 108 సిబ్బందిని చిన్నారి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, పలువురు ప్రశంసించారు.

## రెండు ప్రైవేటు బస్సులు ఢీ

### ఇద్దరు దుర్మరణం

**సూర్యాపేట,(క్రైమ్ మిర్రర్):** శనివారం తెల్లవారుజామున హైదరాబాద్- విజవాడ జాతీయ రహదారిపై సూర్యాపేటలోని ఎస్వీ కాలేజీ సమీపంలో రెండు ప్రైవేటు బస్సులు ఢీకొన్నాయి. దీంతో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందారు. ప్రమాదంలో ఐదుగురు గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను సూర్యాపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు. రెండు బస్సులు గుంటూరు నుంచి హైదరాబాద్‌కు వస్తుండగా ప్రమాదం జరిగిందని వెల్లడించారు. వెనుక నుంచి వేగంగా దూసుకొచ్చిన బస్సు అదుపుతప్పి ముందున్న మరో బస్సును ఢీకొట్టింది. దీంతో అందులో ఉన్న క్లీనర్ ఎగిరి బయటపడ్డాడని, అతనిపై నుంచి బస్సు వెళ్లడంతో ఘటనా స్థలంలోనే మృతిచెందాడని తెలిపారు. మరో వ్యక్తి గుండెపోటుతో మరణించాడని చెప్పారు. కాగా, అతివేగం, దట్టంగా అలముకున్న పొగమంచుతో ముందు వాహనాలు కనిపించకపోవడంతోనే ప్రమాదం జరిగి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అఫ్జల్‌గంజ్ కాల్పుల ఘటనలో నిందితుడి గుర్తింపు



**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** హైదరాబాద్‌లో కాల్పులకు తెగబడ్డ నిందితుడిని మనీశ్‌గా గుర్తించారు. ఇతడు బీహార్ రాష్ట్రానికి చెందిన వాడుగా పోలీసులు తెలిపారు. మనీష్‌తో బీహార్ రాష్ట్రానికి చెందిన మరో నిందితుడు జతకట్టాడు. వారం రోజుల క్రితం నిందితుల చోరీలు మొదలు పెట్టారు. ఛత్తీస్‌గడ్‌లో వారం రోజుల క్రితం ఏటీఎం సిబ్బందిని బెదిరించి రూ. 70 లక్షల రూపాయలు మనీష్ అండ్ కో కాజేశారు. అనంతరం గురువారం (జనవరి 16) బీదర్‌లో ఏటీఎం సెక్యూరిటీ గార్డ్‌ను హత్య చేసి రూ.93 లక్షలు మనీశ్ ఎత్తుకెళ్లాడు. బీదర్ నుంచి హైదరాబాద్ వచ్చిన మనీశ్.. అఫ్జల్‌గంజ్‌లో కాల్పులు జరిపాడు. ఇప్పటికే మనీశ్‌పై బీహార్ ప్రభుత్వం రివార్డు ప్రకటించింది. గతంలోనూ మనీష్‌పై మర్డర్, దోపిడి కేసులు ఉన్నాయి. గతంలో కేసులు నమోదైనప్పుడు మనీష్ బార్డర్ దాటి నేపాల్ పారిపోయాడు. కేసుల తీవ్రత తగ్గాక ఇండియాకు వచ్చి మళ్లీ దోపిడీలకు పాల్పడుతున్నాడు మనీశ్. మనీశ్‌ను పట్టుకునేందుకు నాలుగు రాష్ట్రాల పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. తెలంగాణ, బీహార్, కర్ణాటక, చత్తీస్‌గడ్‌లో మనీశ్ కోసం పోలీసులు గాలిస్తున్నారు. హైదరాబాద్ అఫ్జల్‌గంజ్ కాల్పుల ఘటనలో పోలీసులు పురోగతి సాధించారు. అఫ్జల్‌గంజ్ నుంచి ఆటోలో సికింద్రాబాద్ వెళ్లిన నిందితులు అక్కడ బట్టలు, బ్యాగులు కొనుగోలు చేశారు. తిరుమలగిరి వద్ద ఓ నిర్మానుశ్య ప్రదేశంలో బట్టలు, బ్యాగులు మార్చుకున్నారు. తిరుమలగిరిలో బ్యాగులను నిందితులు వదిలేశారు. ట్రాలీ బ్యాగ్‌ను అక్కడే వదిలేసి పారిపోయారు. సుచిత్ర వైపు నిందితులు పరారైనట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ట్రాలీబ్యాగులను స్వాధీనం చేసుకున్న పోలీసులు నిందితుల కోసం గాలిస్తున్నారు. దాదాపు పది బృందాలుగా ఏర్పడి నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఖచ్చితంగా కేసును చేధిస్తామని పోలీసులు చెబుతున్నారు.

# రాష్ట్రవ్యాప్తంగా కొత్త రేషన్ కార్డుల జారీ

### జంటనగరాల్లో చురుకుగా వెరిఫికేషన్ ప్రక్రియ

### కొత్త రేషన్ కార్డు కోసం 83వేల మంది దరఖాస్తు



**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా కొత్త రేషన్ కార్డుల జారీ పక్రియను వేగవంతం చేస్తోంది. ఇటీవల కొత్త రేషన్ కార్డుల జారీకి సంబంధించిన మార్గదర్శకాలను ప్రభుత్వం విడుదల చేసిన విషయం తెలిసిందే. ప్రత్యేకంగా హైదరాబాద్ నగరంలో కొత్త రేషన్ కార్డుల పక్రియను మరింత దృష్టిలో పెట్టుకుని, జీహెచ్ఎంసీ అధికారులు రంగంలోకి దిగారు. జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి నేతృత్వంలో 150 డివిజన్లలో దరఖాస్తుదారుల అర్హతల పరిశీలన ప్రారంభమైంది. జీహెచ్ఎంసీ పరిధిలో రేషన్ కార్డుల వెరిఫికేషన్ కొనసాగుతోంది. కొత్త రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న వారి ఇంటికి వెళ్లి ఆదాయం, ఆస్తులు వివరాలు తనిఖీ చేస్తున్నారు. రెవెన్యూ, సివిల్ సప్లై అధికారుల సమన్వయంతో ఫీల్డ్ వెరిఫికేషన్ కొనసాగుతోంది. రెండు లక్షల లోపు ఆదాయం ఉండి, బిలో పావర్టీ లైన్‌కు దిగువన ఉన్న వారు రేషన్ కార్డు అర్హులు అంటున్నారు. సొంత ఇండ్లు, ఆస్తులు ఉండి కూడా రేషన్ కార్డు కోసం అప్లై చేసుకున్న వారి దరఖాస్తులను అధికారులు పరిశీలించడం లేదని అంటున్నారు. గ్రేటర్ వ్యాప్తంగా కొత్త రేషన్ కార్డు కోసం 83 వేల మంది దరఖాస్తు చేసుకున్నట్లు, ఈ నెల 20 వరకు ఫీల్డ్ వెరిఫికేషన్ పూర్తి చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ నెల 24వ తేదీ నాటికి అర్హుల ఎంపిక పక్రియను పూర్తిచేయాలని, 25వ తేదీకి ఆయా జిల్లా కలెక్టర్లకు నివేదికను అందజేయాలని జీహెచ్ఎంసీ నిర్ణయించింది. అర్హులుగా గుర్తించిన దరఖాస్తుదారుల వివరాలను ప్రభుత్వం వద్ద ఉన్న డేటాతో సరిచూసి, చివరగా ఈ నెల 26వ తేదీ నుంచి కొత్త రేషన్ కార్డులను జారీ చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. తెలంగాణ ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన సమగ్ర సర్వేలో, జీహెచ్ఎంసీ పరిధిలో 22 లక్షల కుటుంబాల వివరాలను సేకరించింది. ఈ సర్వే అనంతరం కొత్త రేషన్ కార్డుల కోసం వచ్చిన దరఖాస్తులను అధికారులు పరిశీలించారు. ఇందులో 83,285 మంది కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నట్లు గుర్తించారు. ఇంటింటి సర్వేలో కూడా అనేక మంది కొత్త రేషన్ కార్డుల కోసం తమ వివరాలను నమోదు చేసుకున్నారు. గతంలో కొత్త రేషన్ కార్డుల జారీ లేకపోవడం, కార్డుల్లో మార్పులు చేసుకునే అవకాశాలు లేకపోవడంతో వేలాది మంది ప్రజలు కొత్త కార్డుల కోసం ప్రభుత్వాన్ని ఆశ్రయించారు. జీహెచ్ఎంసీ అధికారులు ప్రాథమికంగా అర్హులుగా గుర్తించిన దరఖాస్తుదారుల వివరాలను పరిశీలిస్తున్నారు. నివేదిక తయారు చేసి, ఈ నెల 26వ తేదీ నాటికి కొత్త రేషన్ కార్డుల జారీ ప్రారంభమయ్యేలా కృషి చేస్తున్నారు. ఈ కొత్త పక్రియ ద్వారా రాష్ట్రంలోని అనేక మంది అర్హులైన పేద కుటుంబాలకు రేషన్ కార్డులు అందుబాటులోకి వస్తాయి. ఇది ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను మరింత సమర్థంగా అమలు చేయడంలో సహాయపడుతుంది.

## 13 కిలోమీటర్లు... 13 నిమిషాలు


### గుండె తరలింపునకు మెట్రో సంస్థ గ్రీన్‌కారిడార్



**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** గుండె ట్రాన్స్‌ప్లాంటేషన్ సర్జరీ కోసం చేపట్టిన ప్రక్రియలో హైదరాబాద్ మెట్రో కీలక పాత్ర పోషించింది. నగరంలోని ఎల్‌బీనగర్‌లో ఉన్న కామినేని ఆస్పత్రి నుంచి దాత గుండెను లక్డీకపూల్‌లో ఉన్న గ్లెనిగేల్స్ గ్లోబల్ ఆస్పత్రికి అత్యంత వేగంగా తరలించారు. దీని కోసం హైదరాబాద్ మెట్రో సంస్థ గ్రీన్‌కారిడార్‌ను ఏర్పాటు చేసింది. ఎటువంటి ఆటంకాలు, ఆలస్య లేకుండా.. అతివేగంగా దాత గుండెను ట్రాన్స్‌పోర్ట్ చేసింది. గ్రీన్ కారిడార్ ద్వారా సుమారు 13 కిలోమీటర్ల దూరాన్ని కేవలం 13 నిమిషాల్లోనే చేరుకున్నారు. ఈ రూట్లో 13 స్టేషన్లు దాటేశారు. హైదరాబాద్‌లో ట్రాఫిక్ రద్దీ మరీ ఎక్కువగా ఉంటుంది. గుండె తరలింపులో ఆలస్యం కావొద్దు అన్న ఉద్దేశంతో మెట్రో రైలులో దాన్ని పంపింపారు. జనవరి 17వ తేదీన రాత్రి 9.30 నిమిషాల సమయంలో మెట్రో రైలు ద్వారా డోనార్ గుండెను తరలించారు. చాలా సునిశితమైన ప్లానింగ్, మెట్రో రైలు.. వైద్యులు, ఆస్పత్రి వర్గాల సహకారంతో ఆ ప్రయత్నం సఫలమైనట్లు తెలుస్తోంది.

## సెమీకండక్టర్ పరిశ్రమలో కీలక అడుగు

### సింగపూర్ పర్యటనలో పారిశ్రామికవేత్తలతో చర్చలు



**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** ృమికండక్టర్ పరిశ్రమలో కీలక పెట్టుబడులను ఆకర్షించడంలో తెలంగాణ మరో ముందడుగు వేసింది. తెలంగాణలో ఉన్న అవకాశాలు, ఆధునిక మౌలిక సదుపాయాలు, అనుకూల మైన విధానాలు సింగపూర్ పారిశ్రామికవేత్తలను ఆకర్షించాయి. ఈ భాగస్వామ్యం తెలుగు రాష్ట్రానికి కొత్త ఉద్యోగాల కల్పనతో పాటు, ఆర్థికాభివృద్ధికి సహాయపడే అవకాశం ఉంది. ÷మికండక్టర్ పరిశ్రమను రాష్ట్రానికి తీసుకురావడానికి తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న ఈ ప్రయత్నాలు భవిష్యత్తులో మరిన్ని పెట్టుబడులను ఆకర్షించేందుకు దోహదపడనున్నాయి. హైదరాబాద్ ను గ్లోబల్ ఇన్నోవేషన్ హబ్‌గా మార్చడంలో ఈ భాగస్వామ్యం కీలక పాత్ర పోషించనుంది ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు సింగపూర్‌లో సెమీకండక్టర్ పరిశ్రమ అసోసియేషన్ (ఎస్ఎస్ఐఏ)తో ప్రత్యేక రౌండ్ టేబుల్ చర్చ నిర్వహించారు. ఈ సమావేశంలో వివిధ సంస్థలు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు. తెలంగాణలో పెట్టుబడి అవకాశాలపై చర్చించారు. ఈ సమావేశంలో ఎస్ఎస్ఐఏ ఛైర్మన్ బ్రియాన్ టాన్, వైస్ ఛైర్మన్ టాన్ యూ కాంగ్, సెక్రటరీ సి.ఎస్.చుహ తదితర ప్రతినిధులు పాల్గొన్నారు. చర్చల్లో రాష్ట్రంలో సెమీకండక్టర్ పరిశ్రమ స్థాపనకు అందుబాటులో ఉన్న అనుకూలమైన పరిస్థితులను మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. రాష్ట్రంలో ఉన్న పారిశ్రామిక వాతావరణం, ప్రపంచ పెట్టుబడిదారులకు ప్రభుత్వం అందించే సహకారం ప్రోత్సాహకాలను వివరించారు. ÷-రపంచ వ్యాప్తంగా సెమీకండక్టర్ పరిశ్రమ వేగంగా విస్తరిస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో, తెలంగాణ రాష్ట్రం కీలకమైన కేంద్రంగా నిలుస్తుందని అన్నారు. తెలంగాణ ప్రభుత్వ ఆహ్వానానికి ఎస్ఐఏ ప్రతినిధులు సానుకూలంగా స్పందించారు. ÷మికండక్టర్ల పరిశ్రమల పెట్టుబడులకు ఆసక్తి ప్రదర్శించారు. ఈ ఏడాది చివర్లో సింగపూర్ నుంచి తమ ప్రతినిధుల బృందం హైదరాబాద్‌ను సందర్శించి, పరిశీలన జరుపుతారని తెలిపారు.

## అమలు కానీ హామీలపై ఢిల్లీలో పచ్చి అబద్ధాలు

### తెలంగాణలా ఢిల్లీ ప్రజలను మోసం చేయాలని కుట్ర : మాజీ మంత్రి హరీశ్‌రావు



**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** ఇచ్చిన హామీలు అమలు చేశామని ఢిల్లీకి వెళ్లి అబద్ధాలు ప్రచారం చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పచ్చి అబద్ధాలు ఆడుతున్నారని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. ఎన్నికల సమయంలో తెలంగాణ ఎలాగైతే మోసం చేశారో అలాగే ఢిల్లీ ప్రజలను కూడా మోసం చేయాలని చూస్తున్నారని అన్నారు. ఒకటో తేదీనే వేతనాలు చెల్లిస్తామని అధికారంలోకి వచ్చిన మీకు చిరు ఉద్యోగుల కష్టాలు కనిపించకపోవడం దురదృష్టకరమని అన్నారు. నాలుగు నెలలుగా పంచాయతీ కార్మికులు, మూడు నెలలుగా ఉద్యోగులు, నెల గడిచినా మున్సిపాలిటీ పారిశుద్ధ్య కార్మికులు వేతనాలు అందక వెతలు పడుతున్నారని హరీశ్‌రావు తెలిపారు. ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్, ఏపీఓలు ఇలా వేల మంది చిరు ఉద్యోగులు జీతాలు ఇవ్వాలని ప్రభుత్వానికి దరఖాస్తులు పెట్టుకున్న దయనీయ పరిస్థితి నెలకొందని అన్నారు. దాదాపు అన్ని జిల్లాల్లో ఇదే పరిస్థితి ఉన్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గమని మండిపడ్డారు. నెలలు గడిచినా వేతనాలు రాకపోవడంతో కుటుంబ పోషణ భారమై, అప్పుల పాలవుతున్నారని తెలిపారు. కండ్లు కాయలు కేసులా జీతాల కోసం ఎదురుచూస్తున్నారని అన్నారు. కుర్చీ కాపాడుకోవడం కోసం ఢిల్లీకి చక్కర్లు కొట్టడం, విదేశాలకు వెళ్లి వేల కోట్ల పెట్టుబడులు తెస్తున్నామనే డబ్బా ప్రచారం చేసుకోవడం మానేసి పాలనపై దృష్టి సారించాలని సూచించారు. ఇప్పటికైనా చిరు ఉద్యోగులందరికీ సకాలంలో వేతనాలు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## తెలంగాణకు కాంగ్రెస్ చేసిన పాపాలు అంతా ఇంత కాదు

### కాలువల తవ్వమంటే గత్వాన్ని తవ్వుతున్నారు : మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్



**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** తెలంగాణకు కాంగ్రెస్ నాయకులు చేసిన పాపాలు అంతా ఇంత కాదని, కాంగ్రెస్ పాలనలో తెలంగాణ కుంటుపడిందని ఒక్కసారి గతాన్ని చూసుకోవాలని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. కాంగ్రెస్ నేతలను కాలువలు తవ్వమంటే గతాన్ని తవ్వుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ తెలంగాణకు సాగునీటి రంగం విషయంలో చేసిన పాపాలు తవ్వితే పుట్టల నుంచి పాములు వచ్చినట్టు వస్తాయని అన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో శ్రీనివాస్ గౌడ్ మీడియాతో మాట్లాడుతూ.. బ్రిజేష్ ట్రిబ్యునల్ తాజా మధ్యంతర ఉత్తర్వులు ముమ్మాటికీ కేసీఆర్ ఘనతే అని ఆయన స్పష్టం చేశారు. పదేళ్ల కేసీఆర్ పాలనలోనే మహబూబ్‌నగర్ అభివృద్ధి జరిగిందని శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. బీఆర్ఎస్ ఏ పనిచేయలేదని అనే మహబూబ్‌నగర్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఎవరైనా సరే తమ పదవులకు రాజీనామా చేసి ఎన్నికల్లో గెలిచి చూపించాలని సవాలు విసిరారు. విభజన చట్టం సెక్షన్ 89 కాంగ్రెస్ తెచ్చింది కాదా.. దాని ప్రకారం కృష్ణా జలాల పంపిణీకి కేసీఆర్ ఒప్పుకుంటే బ్రిజేష్ ట్రిబ్యునల్ తాజా ఉత్తర్వులు వచ్చేవా అని శ్రీనివాస్ గౌడ్ ప్రశ్నించారు. కేసీఆర్ అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోపే సెక్షన్ 3 ప్రకారం నీళ్ల పంపిణీ జరగాలని కేంద్రానికి లేఖ రాశారని గుర్తుచేశారు.

ఎడిటోరియల్



# పాతకార్డులపై అమాత్యుల్లో భయమెందుకు?

**నకిలీ రేషన్ కార్డులను ఎత్తేయడంలోనూ..బియ్యం ధరలు పెంచడంలోనూ కాంగ్రెస్ పూర్తిగా విఫలం అయ్యింది. దుబారా తగ్గించుకుంటే తప్ప అప్పులు కట్టలేని దుస్థితి ఉంది. ఈక్రమంలో ఒక్కో పథకాన్ని సమీక్షించుకుని ముందుకు సాగాల్సి ఉంది. కొత్తగా రేషన్ కార్డులు ఇచ్చే క్రమంలో పాతవి తొలగించడం లేదని పదేపదే ప్రకటనలు చేస్తున్నారు.**

పాతకార్డులు తొలగిస్తే ఎక్కడ తమ ఓటుబ్యాంక్ గల్లంతు అవుతుందో అన్న భయం నేతలను వెన్నాడుతోంది. నిజానికి పాత కార్డుల్లో అనర్హులను తొలగించాల్సిందే. దీనికి ధైర్యంగా ప్రకటన చేయాలి. ఇందులో తప్పులేదు. అలాగే అనర్హులకు కార్డులు ఇచ్చి బియ్యం ఇవ్వడం అన్నది దుబారా కిందకే వస్తుంది. అలాగే 2025లో కూడా ఇంకా రూపాయికే కిలో బియ్యం ఇవ్వాలన్న ఆలోచన కూడా దుర్మార్గమైనదే. ఈ రెంటినీ సమీక్షించకుంటే ఖజానాకు బొక్క పడుతూనే ఉంటుంది. ఇకపోతే చాలామంది అర్హులు కార్డులకోసం గత దశాబ్దకాలంగా ఎదురుచూస్తున్నారు. ప్రజల సుదీర్ఘ ఎదురుచూపులకు తెరపడనుంది. దాదాపు దశాబ్దకాలం తర్వాత తెలంగాణలో కొత్త రేషన్‌కార్డులు రానున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 6.68 లక్షల కుటుంబాలకు కొత్త రేషన్ కార్డులు ఇవ్వనున్నారు. సమగ్ర కుటుంబ సర్వే ఆధారంగా పౌరసరఫరాలశాఖ అనేక వడపోతల అనంతరం జాబితా సిద్ధం చేసినట్లు సమాచారం. ప్రభుత్వం నుంచి ఏ చిన్న పథకం పొందాలన్నా ముందుగా అడిగేది రేషన్‌కార్డే. పేదలకు గుర్తింపు కార్డుగా మారిన రేషన్ కార్డులను దాదాపు దశాబ్దకాలం పాటు కేసీఆర్ సర్కార్ అందజేయలేదు. ఎప్పుడు అడిగినా ఇదిగో, అదిగో అంటూ కాలం వెళ్లదీసారు. తప్ప...తెలంగాణ ఏర్పడిన తర్వాత ఒక్కసారే ఒక్కసారి కూడా పూర్తిస్థాయిలో పేదలకు రేషన్‌కార్డులు అందలేదు. అన్ని అర్హతలు ఉండి కూడా రేషన్‌కార్డు లేక ఎందరో ప్రభుత్వ పథకాలకు దూరమయ్యారు. ఆఖరికి ఆస్పత్రుల్లో చికిత్స పొందడానికి కూడా రేషన్‌కార్డే ప్రమాణికంగా ఉండటంతో పేదప్రజలు రేషన్ కార్డుల కోసం కళ్లు కాయలు కాసేలా ఎదురుచూస్తున్నారు. ఇప్పుడు ఆ పేదల నిరీక్షణ ఫలించింది. కొత్త రేషన్ కార్డుల జారీ పక్రియ కొద్దిరోజుల్లో ప్రారంభం కానుంది. ఎన్నికల హామీల్లో భాగంగా కాంగ్రెస్ సర్కార్ ఇచ్చిన మాట ప్రకారం కొత్త రేషన్ కార్డులను అందజేస్తోంది. రేవంత్‌రెడ్డి సర్కార్ తీసుకురానున్న ఐదు గ్యారెంటీలు అమలు చేయాలంటే ముందుగా అర్హులను గుర్తించాలి. ఆవిధమైన అర్హుల గుర్తింపు కోసమే ముందుగా రేషన్‌కార్డులను ప్రభుత్వం జారీ చేస్తోంది. ఇటీవలే నిర్వహించిన ఇంటింటి సర్వేతోపాటు... ప్రజాపాలన దరఖాస్తుల ఆధారంగా ప్రభుత్వం వివరాలు సేకరించింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా 6.68 లక్షల కుటుంబాలు రేషన్ కార్డులకు అర్హమైనవిగా గుర్తించారు. ఈ జాబితాను రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు పంపించి ఈనెల 20 నుంచి 24 వరకు గ్రామసభలు, బస్తీ సభలు నిర్వహించనున్నారు. అభ్యంతరాల స్వీకరణ తర్వాత తుది జాబితా ఖరారు చేయనున్నారు. జిల్లా కలెక్టర్లు ఖారారు చేసిన జాబితా ప్రకారం పౌరసరఫరాల శాఖ కార్డులను మంజూరు చేయనుంది. జనవరి 26వ తేదీ నుంచి అర్హులైన వారికి కొత్త రేషన్ కార్డులు అందజేయనున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఐదుగ్యారెంటీలైన ఆరోగ్యశ్రీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, సబ్సిడీ గ్యాస్, ఫీజు రియింబర్స్‌మెంట్ వంటి సంక్షేమ పథకాలకు రేషన్‌కార్డే ఆధారం. అందుకే రేషన్‌కార్డులకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. గతంలో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరించగా....ఇప్పుడు మాత్రం ఇటీవల నిర్వహించిన సమగ్ర సర్వే నుంచి వివరాలు సేకరిస్తున్నారు. కొత్త రేషన్ కార్డులు కావాలన్నవారి వివరాలు, కుటుంబ సభ్యుల పేర్లు నమోదు చేయించుకునేవారి వివరాలను వడబోశారు. అన్ని అర్హతలు పరిశీలించిన తర్వాత 6,68,309 కుటుంబాలకు కొత్త కార్డులు అందజేయాలని నిర్ణయించారు. గ్రామసభల అనంతరం కొత్త కార్డులు జారీ చేయనున్నారు. హైదరాబాద్‌లోనే అత్యధికంగా 83 వేల285 మంది అర్హులు ఉండగా...వనపర్తి జిల్లాలో అత్యల్పంగా 6 వేల647 కుటుంబాలు ఉన్నాయి. ప్రస్తుతానికి సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సంతకాలతో కూడిన లేఖలనే కార్డులుగా అందజేస్తారు. కొంతకాలం తర్వాత పాతవారికి, కొత్తవారికి కలిపి కొత్త రేషన్ కార్డులు అందజేయనున్నారు. అయితే ఎప్పటికైనా అర్హులను గుర్తించడం ముఖ్యం. అర్హులకే బియ్యం లేదా ఇతర పథకాలు అందాలి. అలాగే బియ్యం ధరలను కనీసం పది రూపాయలైనా చేయాల్సిందే.

# మంచుగడ్డలా కరిగిపోతున్న విపక్షాల ఐక్యత !

**విపక్షాలు ఉమ్మడిగా ప్రజల సమస్యలపై పోరాడడంలో పూర్తిగా విఫలం అయ్యాయి. పార్లమెంట్ గత శీతాకా సమావేశాల్లో అర్థం లేని చర్చతో అర్థాంతరంగా ముగించేలా చేశారు. రేపటి బడ్జెట్ సమావేశాలు కూడా ఇంతకన్నా గొప్పగా ఉంటాయనుకోవడం భ్రమే. ఎందుకంటే విపక్షాలు ఒక ఎజెండాతో పోతున్నాయి. అధికారపక్షం మరో ఎజెండాతో వస్తోంది.**

ఈ క్రమంలో అసలు ప్రజల సమస్యలు పక్కకు పోతున్నాయి. దేశం అనేకానేక సమస్యలు ఎదుర్కొంటున్న వేళ అధికార పక్షం వాటిని పక్కకు పోయేలా చేస్తోంది. చర్చకు రాకుండా చేస్తోంది. ఈ క్రమంలో అధికార పక్షాన్ని నిలదీసే శక్తియుక్తులు విపక్షాల్లో కనిపించడం లేదు. కేవలం రచ్చ చేయడం, వాకౌట్ చేయడం, పార్లమెంట్ ముందు ధర్నా చేయడమే తమ పోరాటంగా మలచు కుంటున్నారు. అందరి లక్ష్యం అధికారమే తప్ప..దేశం, ప్రజలు అన్న ఎజెండా కనిపించడం లేదు. బహుశా ఇంతటి దౌర్భాగ్య పరిస్థితి భారతదేశంలో మునుపెన్నడూ లేదు. ప్రజలను పట్టించుకోని పాలకులు, ప్రతిపక్షాలను చూస్తున్నాం. ప్రతిపక్షమంటే విమర్శలు చేయడం, పాలకపక్షం అంటే అధికారాన్ని తనివితీరా అనుభవించడం అన్నది రూఢి చేసుకున్నారు. ఎన్టీఆర్ నేషనల్ ఫ్రంట్‌తో విపక్షాలను ఐక్యం చేసినా అది బలంగా ముందుకు సాగలేక పోతోంది. గత పదేళ్లుగా పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్న తీరు చూస్తుంటే ఇది అర్థం చేసుకోవచ్చు. ప్రధాన సమస్యవేవీ చర్చించవడం లేదు. ద్రవ్యోల్బణం, రూపాయి పతనం, ధరల పెరుగుదల, నిరుద్యోగం వంటివి ఎన్నో సమస్యలు దేశాన్ని పట్టిపీడిస్తున్నాయి. నిజానికి పాలకపక్షం గట్టిగా ఉంటే అధికారపక్షం భయంగా ఉంటుంది. నిర్ణయాలు తీసుకునే ముందు జాగ్రత్త వహిస్తుంది. అయితే మోడీ అధికారం చేపట్టాక ఆయనకు అన్నీ కలసి వస్తున్నాయి. గట్టిగా విపక్షం లేకుండా పోయింది. విపక్షం ఉన్నా నిలదీయలేదన్న భరోసా దక్కింది. అసలు పార్లమెంట్‌కు వచ్చి గట్టిగా నిలబడి సమాధానం చెప్పే అవకాశం కూడా మోడీ కల్పించుకోవడం లేదు. పార్లమెంట్ సమావేశాల సమయంలో మోడీ ఎప్పుడూ కనిపించడం లేదు. ఇక ఏదైనా సమస్య లేవనెత్తితే ఎదురుదాడి రాజకీయాలతో సరిపుచ్చు తున్నారు. ఇలా దేశం అంటే పాలకులు,ప్రతిపక్షం అన్న విధంగా మారింది. ప్రజలు, వారి సమస్యలు, దేశం గాలికి ఎగిరిపోయింది. ఈ క్రమంలో విపక్షాల మధ్య ఐక్యత కూడా ఐసుగడ్డలా కరిగిపోతోంది. ఢిల్లీ ఎన్నికల్లో ఇండియా కూటమి కనిపించడం లేదు. పార్లమెంట్ ఎన్నికల వరకే కూటమి అని ప్రధాన పార్టీల నేతలు ఇప్పటికే వ్యాఖ్యానించారు. కాబట్టి ఇకముందు కూటమి అన్నది ఉండదు. మొత్తంగా ఇండియా కూటమి మూడునాళ్ల ముచ్చటే అని తేలిపోయింది. విభిన్న సిద్ధాంతాలు, అభిప్రాయాలు గల దాదాపు 24 పార్టీలు ఏకంకావడమే గొప్ప. జెడి(యు) అధినేత నితీశ్ కుమార్ సూచనతో కేంద్రంలో బిజెపిని 2024 పార్లమెంటు ఎన్నికలలో ఓడించడమే లక్ష్యంగా కూటమి ఏర్పడింది. అనూహ్యంగా నితీశ్ మోడీ చంకలో చేరడంతో కూటమిలో కాంగ్రెస్ పెద్దన్నపాత్ర వహించాల్సి వచ్చింది. కూటమి కన్వీనర్‌గా నితీశ్ కుమార్‌ను ఎన్నుకోవా లన్న భావన అదిలోనే దెబ్బతింది. ఫైర్ బ్రాండ్‌గా పేరుపొందిన మమత బెనర్జీ మొదటినుంచి ఇండియా కూటమిపట్ల పెద్దగా ఆసక్తి చూపలేదు. కాంగ్రెస్ పెత్తనం ఆమెకు అసలే ఇష్టం లేదు. ఇక కమ్యూనిస్టల పాత్ర కూడా అంతంతమాత్రమే. ఏచూరి మరణంతో అదికూఆడా లేకుండా పోయింది. బెంగాల్‌లో అసెంబ్లీ గానీ, పార్లమెంటు ఎన్నికలు గానీ ఏ ఎన్నికల్లో అయినా ఒంటరిపోరే తమ సిద్దాంతంగా లెఫ్ట్ పార్టీల నేతలు ఎంచుకున్నారు. బెంగాల్‌లో 34 ఏళ్లు అధికారంలో ఉన్నా.. నానాటికీ వామపక్షాలు కనుమరుగు అవుతున్నాయి. తెలంగాణలో కాంగ్రెస్ పొత్తులో ఒక్క అసెంబ్లీ సీటు గెలిచారు. ఎపిలో అలాంటి అవకాశం కూడా లేదు. దేశవ్యాప్తంగా కమ్యూనిస్టులకు కాలం చెల్లింది. బెంగాల్‌లో 48ఏళ్లుగా అధికారానికి దూరమై ఏ

ఏటికాయేడు పతనమై.. ప్రస్తుతం నామమాత్రంగా మిగిలిన కాంగ్రెస్, కమ్యూనిస్ట్ లతో కలిసినా కనీసం ఏ ఎన్నికలలోనూ విజయాన్ని అందుకోలేకపోయారు. పార్లమెంటు ఎన్నికల నాటికి కూటమిలో కీలక పార్టీలు బిజెపికి దీటుగా ఒకే ఉమ్మడి అభ్యర్థిని నిలబెట్టాలన్న లక్ష్యం లేకుండా పోయింద. ఆమ్‌ఆద్మీ పార్టీ కేజీవ్రాల్ పరిస్థితి మరోలా ఉంది. ఇష్టం లేకుండానే కూటమిలో చేరినా...లోక్‌సభ ఎన్నికల నాటికి ఢిల్లీలో పొత్తు.. పంజాబ్‌లో లేదు అన్నట్లు వ్యవహరించారు. ఇప్పుడు ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో కూడా ఒంటరి పోరాటానికే సిద్ధమయ్యారు. ఆయనకు సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్, మమతా బెనర్జీలు మద్దతు పలికారు. ఢిల్లీలో కాంగ్రెస్ కన్నా ఆప్ బలంగా ఉందన్న వాదనను వీరు తీసుకునివచ్చారు. కాంగ్రెస్‌తో ఉన్నట్లే ఉన్నా.. ఎప్పటికప్పుడు ఆ పార్టీకి చెక్ పెట్టే ధోరణిలోనే అఖిలేశ్ వ్యవహరించారు. మధ్యప్రదేశ్, హర్యానా, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘోర ఓటమితో ఆ పార్టీపై ప్రతిపక్షాలలో ముఖ్యంగా కూటమి పార్టీలలో పూర్తిగా నమ్మకంపోయింది. కాంగ్రెస్‌కు దాదాపు అన్ని పార్టీలు దూరమవుతున్నాయి. జమ్మూకశ్మీర్÷-లో కాంగ్రెస్ నేషనల్ కాన్ఫరెన్స్ కలిసినా, మహబూబా ముఫ్తీ ఒంటరి పోరుకు దిగారు. వయో భారం, అనారోగ్యం కారణంగా నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ అధినేత శరద్ పవార్ అంత చురుగ్గా రాజకీయాల్లో పాల్గొనడం లేదు. ఎన్‌సిపిను అజిత్ పవార్‌వర్గం చీల్చిన తర్వాత మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత శరద్ పవార్ ఇంటికే పరిమితమయ్యారు. తాజాగా ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలతో ఇండియా కూటమి పూర్తిగా రద్దయి పోయినట్లయింది. ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీ రెండు టర్మ్‌లుగా అధికారంలో ఉంటోంది. పదేళ్లుగా కాంగ్రెస్ ఒక అసెంబ్లీ స్థానం కూడా గెలవలేదు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు బిజెపి, ఆమ్‌ఆద్మీ పార్టీకి మధ్యే అన్నట్లుగా కన్పిస్తున్నాయి. దీంతో కాంగ్రెస్ ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటరి పోటీకి సిద్ధమైంది. ఇదో రకంగా ఆప్‌ను దెబ్బతీసే చర్యగానే చూడాలి. ఢిల్లీలో బిజెపి అధికారంలోకి రాకుండా చూడాలంటే.. ఆమ్‌ఆద్మీ పార్టీకి గంపగుత్తగా మద్దతు ఇవ్వాలని ఇండియా కూటమిలో కీలక పార్టీలు నిర్వహించాయి. దీంతో సమాజ్‌వాదీ పార్టీ, తృణమూల్ కాంగ్రెస్, ఆర్‌జెడి, శివసేన ఉద్ధవ్ పార్టీ ఆమ్‌ఆద్మీ పార్టీకే మద్దతుగా నిలిచాయి. దీంతో కాంగ్రెస్ ఏకాకి అయింది. ఆ పార్టీకి ఆఖరుకు నేషనల్ కాన్ఫరెన్స్ కూడా దూరమైంది. ఇండియా కూటమి అన్నది కేవలం పార్లమెంటు ఎన్నికల కోసం ఏర్పడిం దని ఆయన ప్రకటించారు కూడా. దీంతో ఇండియా కూటమి ముక్కచెక్కలైనట్లు స్పష్టమైంది. అయితే కూటమి కట్టడం వల్ల మొన్నటి పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు లాభించిందనే చెప్పాలి. అవసానదశలో ఉన్న ఆ పార్టీ విపక్ష స్థాయికి ఎదిగింది. ఇప్పుడు కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా అన్ని పార్టీలు కూటమి నుంచి వైదొలిగినా కాంగ్రెస్‌కు వచ్చే నష్టం లేదు. కుటుంబం లోని ముగ్గురు సభ్యులు పార్లమెంటులో ప్రవేశించారు. ఇలా అన్ని పార్టీలు కుటుంబపార్టీలుగా మారాయి. కాబట్టి ప్రజలకన్నా కుటుంబ సమస్యలకే వీరు ప్రాధాన్యం ఇస్తున్నారు. పార్లమెంటులో సమస్యలపై చర్చ కూడా అందుకే మొక్కుబడిగా సాగుతున్నాయి. విపక్షాల అనైక్యతను మోడీ తనకు అనుకూలంగా మలచుకుని మూడోసారి ప్రధానిగా దేశాన్ని ఏలుతున్నారు. ఎన్‌డిఎ భాగస్వామ్య పక్షాలు కూడా మోడీని నిలదీసే విషయంలో ముందుకు రారని తేలిపోయింది. మొత్తంగా అధికార పక్షాన్ని గట్టిగా నిలదీసే విపక్షం దేశం లేకపోవడం ప్రజల దౌర్భాగ్యం కాక మరోటి కాదు.



(ఆధ్యాత్మిక చింతన)

# కుంభమేళాకు పెరుగుతున్న భక్తజన తాకిడి

## దేశవిదేశీ భక్తుల రాకతో ప్రత్యేక ఆకర్శణ

**కుం**భమేళా జరుగుతున్న త్రివేణీ సంగమ తీరం భక్తకోటితో నిండిపోతోంది. కనుచూపుమేర ఎటుచూసినా భక్తుల పుణ్యస్నానాలే కనిపిస్తున్నాయి.రోజూ రెండుకోట్లకు తగ్గకుండా భక్తులు వస్తున్నట్లుగా అంచనా వేస్తున్నారు. మరీ ముఖ్యంగా.. విదేశీయులు సైతం కాషాయ వస్త్రాలు, రుద్రాక్షలు ధరించి పుణ్యస్నానాలు చేస్తున్నారు. ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న ఆధ్యాత్మిక సంగమం ఒక విశ్వ సంబరంగా మారింది. నదీ స్నానం సర్వ పాప హరణం అని హిందూ ధర్మశాస్త్రం చెబుతోంది. అందులోనూ పరమ పవిత్రమైన గంగా నది, తోడుగా యమున, అంతర్వాహినిగా సరస్వతి ఒకేచోట సంగమించే ప్రదేశంలో నదీ స్నానం ఆచరించడం జన్మజన్మల పాపాలను హరిస్తుందనేది హిందువుల విశ్వాసం. పైగా.. 144 ఏళ్లకు ఒకసారి వచ్చే మహా కుంభమేళా ఇది. ఇప్పుడు తప్పితే . మళ్లీ

ఇలాంటి మహా కుంభమేళాలో పాల్గొనడం దాదాపుగా అసాధ్యం. అందుకే.. పుణ్యస్నానాలు చేసేందుకు భక్తులు పోటెత్తుతున్నారు. అందులోనూ, మకర సంక్రాంతి నుంచి ఉత్తరాయణ పుణ్యకాలం రావడంతో.. వివిధ వర్గాలకు చెందిన 13 అఖాడాలు మహాకుంభమేళాకు వచ్చాయి. ఈ అఖాడాలు తెల్లవారుజామున 3 గంటలకు బ్రహ్మముహూర్తంలో అమృత స్నానాలు ప్రారంభించేస్తున్నారు. ఏరోజు కూడా కోటిన్నరకు తగ్గకుండా భక్తులు అమృత స్నానాలు ఆచరించినట్లు మహా కుంభమేళా అధికారులు ప్రకటించారు. దాదాపు 10 వేల ఎకరాల కుంభనగర్‌లో ఎటుచూసినా భక్తగణమే కనిపిస్తున్నారు. సంక్రాంతి తరువాత వచ్చే ఉత్తరాయణ పుణ్య తిథి.. ఫిబ్రవరి 3వ తేదీన వచ్చే వసంత పంచమి. ఆ రోజు కూడా భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. ఇక ప్రత్యేకంగా చెప్పుకోవాల్సింది విదేశీయుల గురించి. సామాన్యులు, సాధువులు, అఖాడాలతో కలిసి పుణ్యస్నానం ఆచరించేందుకు అమెరికా, యూరప్, ఇతర దేశాల నుంచి తరలి వస్తున్నారు. బహుశా తాము గత జన్మలో భారత్‌లో పుట్టి ఉంటామంటూ సగర్వంగా చెప్పుకుంటున్నారు. త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు చేయడం తమకు దక్కిన వరం అని సంబరపడిపోతున్నారు ఫారెనర్స్. పైగా.. ఏర్పాట్లు కూడా అంతే ఘనంగా చేసింది యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం. ఈసారి 40 కోట్ల మంది వస్తారనే అంచనాలతో.. అంతకు తగ్గట్టుగానే ఏర్పాట్లు చేశారు. ఇక సంధ్యాసమయంలో త్రివేణీ సంగమం ఘాట్ వద్ద నదీమతల్లికి ఇచ్చే హారతుల్ని చూసేందుకు రెండు కళ్లూ చాలడం లేదు.

**ఎ**పిలో 150 రకాల పౌరసేవలను వాట్సాప్ ద్వారా అందించడం జరుగుతోంది. ఎలాంటి ఇబ్బంది లేకుండా పలు రకాల సేవలు అందుబాటులోకి వచ్చాయి. మంత్రి లోకేశ్ తీసుకున్న చొరవ కారణంగా, కుల, ఆదాయ ధృవీకరణ వంటి అనేక పత్రాలను నేరుగా పొందే అవకాశం ఏర్పడింది. అయితే డేటా రక్షణ చట్టం లేకుండా కేవలం వాట్సాప్ ద్వారా అందిస్తే పౌరుల ప్రాథమిక హక్కులకు భంగకరమన్న వాదనలు వస్తున్నాయి. ఆందోళన కూడా వ్యక్తం అవుతోంది. రాష్ట్రంలో వాట్సాప్ ద్వారా ఈ గవర్నెన్స్ సేవలు అందించేందుకు కంపెనీలతో ఒప్పందం చేసుకున్నట్లు దాన్ని 18వ తేదీన ప్రారంభించబోతున్నట్లు సిఎం చంద్రబాబు ఇప్పటికే ప్రకటించారు. ఏదైనా ఒక సర్టిఫికెట్ కావాల్సి వస్తే దానికి సంబంధించిన డాక్యుమెంట్లు అప్‌లోడ్ చేయాలని, వాట్సాప్‌లో అవి భద్రంగా ఉంటాయన్న గ్యారంటీ లేదన్న వాదన వస్తోంది. వాటిని దుర్వినియోగం చేయరన్న చట్టబద్ధ హామీ లేదు.

# పౌరసేవల్లో డేటా రక్షణ ముఖ్యం

## సమాచార దుర్వినయోగంపైనా దృష్టి అవసరం

2018 నుండి డేటా ప్రైవసీ చట్టం పెండింగ్‌లోనే ఉందని, అది చట్టం కాకుండా ఇలాంటి ఒప్పందాలు పౌరుల వ్యక్తిగత భద్రతకు ముప్పని అంటున్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు ఊడా ఇదేరకమైన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గతంలో ఆధార్ సహా అనేక రకాల డాక్యుమెంట్లు దుర్వినియోగమైన విషయం విదితమేనని పేర్కొన్నారు. పౌర సేవలు వేగంగా అందుతాయో లేదో గ్యారంటీ లేదని, కానీ రాజకీయ, వ్యాపార ప్రయోజనాలకు డేటా దుర్వినియోగం అయ్యే అవకాశం ఉందని తెలిపారు. ఇప్పటికే మీ సేవ, సచివాలయ వ్యవస్థలున్నాయని, వాట్సాప్‌తో ఒప్పందం చేసుకుని సచివాలయ సిబ్బందిని తగ్గించాలన్న యోచనలో ప్రభుత్వం ఉందని, దీనివల్ల మీ సేవ సిబ్బంది నిరుద్యోగులవుతారని అన్నారు. గోప్యంగా ఉండాల్సిన పౌరుల వ్యక్తిగత సమాచారాన్ని అంబానీ, మెటా వంటి కార్పొరేట్ కంపెనీలపరం చేయడం అభ్యంతరకరమని పేర్కొన్నారు. డేటా ప్రైవసీ రక్షణ చట్టం వచ్చేంత వరకు ఈ ఒప్పందాన్ని అమలు చేయొద్దని, సచివాలయ సిబ్బందిని కుదించొద్దని, మీసేవా కేంద్రాలకు భద్రత కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. నిజానికి సేవలు అందించడంతో పాటు, చట్టబద్ధత కూడా ముఖ్యమని గుర్తించి, డేటా రక్షణ చర్యలు తీసుకోవాల్సి ఉంది.

# ఆయుధాలను, అజ్ఞాతాన్ని వీడండి...జనజీవన స్రవంతిలో కలవండి..

## అరణ్యవాసం వీడండి.. పునరావాసం పొందండి..

## మీ సంక్షేమం....మా భాద్యత...

### జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్




**భద్రాద్రి కొత్తగూడెం జనవరి 18 (క్రైమ్ మిర్రర్ ):** గత సంవత్సర కాలం నుండి లొంగిపోయిన మావోయిస్టు సభ్యుల కుటుంబాలు మరియు జిల్లా నుండి అజ్ఞాతంలో ఉన్న వారి కుటుంబాలతో ఆత్మీయ సమ్మేళనాన్ని చర్ల పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగానే చత్తీస్గడ్ రాష్ట్రం,సుక్మా జిల్లా ఎర్రపల్లి ఆర్ పి సి కి చెందిన 22 మంది మావోయిస్టు పార్టీ మిలీషియా సభ్యులు జిల్లా పోలీసుల ఎదుట లొంగిపోయారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం లొంగిపోయిన వారికి అందిస్తున్న పునరావాస పాలసీకి ఆకర్షితులై ఈ 22 మంది మిలీషియా సభ్యులు లొంగిపోవడం జరిగిందని ఎస్పీ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ తో పాటు అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్ పంకజ్ పరితోష్, భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ లు పాల్గొన్నారు. గత సంవత్సర కాలంలో లొంగిపోయిన 36 మంది మావోయిస్టు పార్టీ సభ్యుల కుటుంబాలకు నిత్యవసర సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ లొంగిపోయిన మావోయిస్టు సభ్యులకు పోలీస్ శాఖ ఎల్లప్పుడు అండగా ఉంటుందని తెలియజేసారు. ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వం లొంగిపోయిన వారికి అందిస్తున్న ప్రతిఫలాలను వెంటనే వారికి అందేలా పోలీస్ శాఖ బాధ్యత తీసుకొని పనిచేస్తుందని తెలిపారు. గత సంవత్సరంలో జిల్లా నుండి మావోయిస్టు పార్టీలో వివిధ కేడర్లలో అజ్ఞాత జీవనాన్ని గడిపి జిల్లా పోలీసులు చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై 36 మంది సభ్యులు లొంగిపోవడం జరిగిందని తెలియజేసారు. ఇంకా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుండి అజ్ఞాత జీవితాన్ని గడుపుతున్న వారు కూడా లొంగిపోయి కుటుంబ సభ్యులతో కలిసి ప్రశాంత జీవనాన్ని గడపాలని విజ్ఞప్తి చేశారు. మారుమూల ఏజెన్సీ ప్రాంతాల్లో నివసించే ఆదివాసి ప్రజలకు జిల్లా పోలీస్ శాఖ ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ విద్య, వైద్యం,రవాణా సౌకర్యాలు కల్పించే విధంగా కృషి చేస్తుందని అన్నారు. జిల్లాలోని మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో నివసిస్తూ అక్కడ చదువుకునే యువత ఉద్యోగాలు సాధించే విధంగా మరియు వారికి అవసరమైన సౌకర్యాలను అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రధానంగా వారు ఎదుర్కొంటున్న కుల ధ్రువీకరణ పత్రాల మంజూరు విషయంలో జిల్లా కలెక్టర్ మరియు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి అట్టి సమస్యను అతిత్వరలోనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో నివసించే ప్రజలకు అన్ని రకాల ప్రభుత్వ పథకాలు అందే విధంగా చేస్తామని అన్నారు. అభివృద్ధి నిరోధకులుగా మారిన నిషేధిత సిపిఐ మావోయిస్టులకు ఎవ్వరూ సహాయ సహకారాలు అందించవద్దని కోరారు. అనంతరం ఈ కార్యక్రమంలో పాల్గొన్న లొంగిపోయిన సభ్యులు మరియు వారి కుటుంబాలకు ఏర్పాటు చేసిన సహపంక్తి విందులో పోలీస్ అధికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఇంత ఘనంగా ఏర్పాటు చేసిన చర్ల సీఐ రాజు వర్మ, దుమ్ముగూడెం సీఐ అశోక్, ఎస్సై నర్సిరెడ్డి మరియు పోలీసు సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

# 52 వ సారి రక్త కణాలను అందించి ఆదుకున్న గాలిపెల్లి కుమార్

## రక్తదానం ఒక ప్రాణాన్నే కాదు కుటుంబాన్ని రక్షిస్తుంది.

### రక్తదానం చేయండి.. ప్రాణదాతలుగా నిలవండి.
### సమాజ సేవకులు రక్తదాత గాలిపెల్లి కుమార్ పిలుపు



**కరీంనగర్, జనవరి 18(క్రైమ్ మిర్రర్):** ప్రమాదకర పరిస్థితుల్లో అత్యంత అరుదైన గ్రూప్ ఏ ప్లస్ రక్తాన్ని గత 15 ఏళ్లుగా దానం చేస్తున్నానని, ఎంతో మంది రోగుల ప్రాణాలు కాపాడడంతో పాటు నేటివరకు 52 సార్లు రక్తదానం చేయడం జరిగిందని తెలిపారు.డెంగ్యూ తో బాధపడుతున్న రోగికి సరైన సమయంలో రక్త కణాలను అందించి గాలిపెల్లి కుమార్ మరొకసారి సామాజిక సంపన్న సేవకుడని నిరూపించుకున్నారు. పూర్తి వివరాల్లోకి వెళితే ధర్మపురి, నక్కలపేట గ్రామానికి చెందిన గంగరాజాం డెంగ్యూ జ్వరంతో గత కొద్దిరోజులుగా కరీంనగర్లోని స్థానిక ప్రతిమ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్నాడు. పేసెంట్ రక్త కణాలు ఒక్కసారిగా పదివేలకు తగ్గడం జరిగింది. అప్పటికప్పుడు ఏమి చేయాలో తూచని పరిస్థితిలో హైదరాబాద్ చెందిన సామాజిక కార్యకర్త నవీన్ విషయాన్ని గాలిపెల్లి కుమార్ కి ఫోన్ చేసి ఫోన్ లో పరిస్థితిని వివరించగా సానుకూల హృదయంతో సామాజిక దృక్పథంతో గాలిపెల్లి కుమార్ మైత్రి బ్లడ్ బ్యాంక్ కి విచ్చేసి తన 52 వ సారి రక్త కణాలను అందించి పేసెంట్ ప్రాణాలను కాపాడాడు. ఈ విషయమై కుటుంబ సభ్యులు డాక్టర్లు గాలిపెలి కుమార్ ని అభినందించారు. ఈ సందర్భంగా గాలిపెల్లి కుమార్ మాట్లాడుతూ ఎదుటి మనిషికి సహకరించాలనే ఆలోచన విధానం ఎంతో గొప్పదని, అందరూ కూడా ఎవరిని కించపరచకుండా ఒకరికొకరు సహాయపడుతూ జీవితాన్ని ఆనందమయం చేసుకోవాలని తెలిపారు.రక్తదానం చేయడం ద్వారా రోగి ప్రాణాలనే కాపాడడంతో పాటు వారి కుటుంబాన్నిరక్షించినవారమవుతామని, అందుకే ఎలాంటి భయాలు లేకుండా ప్రతి ఒక్కరు రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని గాలిపెల్లి కుమార్ ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.



# తెలుగువారి ఆత్మగౌరవాన్ని ఇనుమడింప జేసిన మహానేత ఎన్టీఆర్ చిరస్మరణీయుడు

### పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ

**కూకట్ పల్లి, జనవరి 18 (క్రైమ్ మిర్రర్) :** శేరిలింగంపల్లి నియోజకవర్గం వివేకానంద నగర్ డివిజన్ పరిధిలోని మెయిన్ రోడ్ లో ఎన్టీఆర్ విగ్రహం దగ్గర ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథి శేర్లింగంపల్లి పీఏసీ చైర్మన్ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ పాల్గొని రామారావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ రామారావు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో తెలుగు రాష్ట్రాల ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలు పెట్టి బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ఎంతో మేలు చేశారని, అదేవిధంగా విద్య ఆరోగ్య ఉచిత బియ్యం పథకం పెట్టి ప్రజల సంక్షేమానికి అభివృద్ధికి ఎంతో మేలు చేశారని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమం స్థానిక నాయకులు దేవినేని ప్రసాద్ రామకృష్ణ వెల్ఫేర్ అధ్యక్షులు జనంపల్లి పురంధర్ రెడ్డి, సంజీవరెడ్డి, చంద్రకాంత్ రావు, మేక శివరాం ప్రసాద్, శ్రీనివాసరావు, శ్రీధర్ రావు, కుమార్, సాయి కృష్ణ, రామ్మోహన్ రావు, వెంకటేశ్వరరావు, లింగం తదితరులు పాల్గొని ఎన్ టి రామారావు విగ్రహానికి నివాళులర్పించారు.

# తెలుగు రాష్ట్రాల ప్రజల గుండెల్లో నిలిచిపోయిన ఏకైక వ్యక్తి ఎన్టీ రామారావు

### కూకట్ పల్లి జనసేన పార్టీ నేత ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్



**కూకట్ పల్లి, జనవరి 18 (క్రైమ్ మిర్రర్) :** ఒక రూపాయికి కిలో బియ్యం అందించి, మద్యపానాన్ని నిర్మూలించిన ఏకక నాయకుడు ఎన్టీ రామారావు అని కూకట్ పల్లి నియోజకవర్గ జనసేన పార్టీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే ఉమ్మారెడ్డి ప్రేమ్ కుమార్ అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు 29వ వర్ధంతి సందర్భంగా కూకట్ పల్లి నియోజకవర్గంలోని వసంత నగర్ కాలనీలో గల ఉమ్మడి ఆంధ్ర రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక తారక రామారావు విగ్రహానికి కూకట్ పల్లి జనసేన పార్టీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కూకట్ పల్లి జనసేన పార్టీ నాయకులు కొల్లా శంకర్ ,పాదం సూర్యా, పులగం సుబ్బు, బలిజేపల్లి శంకర్రావు, చాంద్ భాషా , గుమ్మడి ఉపేంద్ర, కిషోర్ మరియు కాలనీ వాసులు నందమూరి తారక రామారావు అభిమానులు పాల్గొన్నారు.

# నేటి సాయంత్రానికి సంక్షేమ పథకాల సర్వే పూర్తి చెయ్యాలి

### జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్



**భద్రాద్రి కొత్తగూడెం జనవరి 18 (క్రైమ్ మిర్రర్ ):** రాష్ట్ర ప్రభుత్వం అందించిన నాలుగు సంక్షేమ పథకాల అమలులో భాగంగా చేపడుతున్న సర్వేను రేపు సాయంత్రం లోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం జిల్లాలోని డి.వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ , జెడ్పి సీఈవో, ఆర్డీవోలు, తాసిల్దార్ లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, హౌసింగ్ డిపార్ట్మెంట్ అధికారులు తో జిల్లా అధికారులు కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించి సర్వే పురోగతిపై అధికారులను వివరాలను అడిగి తెలుసుకున్నారు . ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సంక్షేమ పథకాల లబ్ధిదారుల సర్వే ప్రక్రియను ఆదివారం సాయంత్రం లోగా పూర్తిచేసుకుని గ్రామ సభల నిర్వహణకు సిద్ధమవ్వాలని అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంలో లబ్ధిదారులు కింద మహిళలను నమోదు చేయాలని, కుటుంబంలో మహిళల యొక్క బ్యాంక్ అకౌంట్ ను నమోదు చేయాలని సూచించారు. రేషన్ కార్డ్ లో కుటుంబ సభ్యుల పేర్లు నమోదుకు వివిధ దశల్లో పెండింగ్లో ఉన్న దరఖాస్తులు అన్నిటిని పరిశీలించి వాటిని కూడా గ్రామసభల్లో పొందుపరచాలని సూచించారు. అదేవిధంగా జాబితాలో లేనటువంటి అర్హులను గుర్తించి వారి యొక్క దరఖాస్తులను కూడా స్వీకరించి నిర్దేశిత ఫారంలో పొందుపరచాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు ఎంపిక ను తప్పకుండా పూర్తి చేయాలని, పేదలలో నిరుపేదలకు మాత్రమే లబ్ధి చేకూరేలా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ఎంపిక చేపట్టాలని సూచించారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సర్వే లో ఖచ్చితమైన సమాచారాన్ని నమోదు చేయాలన్నారు.

# కాలనీవాసులతో పార్కును ప్రారంభించిన కార్పొరేటర్ జిల్లెల్ల అరుణ ప్రభాకర్ రెడ్డి

### అభివృద్ధికి సహకరించాల్సిన డిప్యూటీ మేయర్ అడ్డుకోవడం సమంజసమేనా : జిల్లెల్ల ప్రభాకర్ రెడ్డి

బాలాపూర్ (క్రైమ్ మిర్రర్) మీర్పేట్ కార్పొరేషన్ 28వ డివిజన్ లో అర్బన్ ఫారెస్ట్ నిధులతో నిర్మించిన పార్కు మరియు వాకింగ్ ట్రాకులను కాలనీవాసులతో కలిసి ప్రారంభించిన స్థానిక కార్పొరేటర్ జిల్లెల అరుణ ప్రభాకర్ రెడ్డి. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ 28వ డివిజన్ అభివృద్ధి కోసం, ఇచ్చిన వాగ్దానాల అమలు కోసం నిరంతరం కృషి చేస్తూ డివిజన్ అభివృద్ధి చేస్తున్నామని అందులో భాగంగానే అర్బన్ ఫారెస్ట్ అధికారులతో చర్చించి నిధుల మంజూరుతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఇందుకు స్థానిక ఎమ్మెల్యే సబితా రెడ్డి కూడా ఎంతో పూర్తి సహాయ సహకారాలు అందించారని మేము ఎప్పటికీ సబిత ఇంద్ర రెడ్డిని అభిమానిస్తామని తెలుపుతూ పార్కు పనులు పూర్తికావడంతో మేము ఎమ్మెల్యే ను కలిసి ప్రారంభోత్సవం గురించి మాట్లాడడం జరిగిందని అందుకు మేడం ఈనెల 18న పార్కు ప్రారంభోత్సవానికి సూచించడంతో అట్టి విషయాన్ని కమిషనర్ కూడా తెలపడం జరిగిందని అందుకు అన్ని ఏర్పాట్లు చేయడం కూడా జరిగిందని కానీ డిప్యూటీ మేయర్ స్థానిక కార్పొరేటర్ కి, కమిషనర్ కు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా తన అనుచరులతో ఈ నెల 20న ప్రారంభోత్సవ కార్యక్రమం ఉంటుందంటూ వాట్సప్ గ్రూపులలో పోస్టు పెట్టడం ఎంతవరకు సమంజసం అని అదే సమాచారం మాకు తెలిపి ఉంటే అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేసుకునే వాళ్ళమని తెలుపుతూ ఈ విషయంపై కమిషనర్ను మేయర్ ని అడిగితే తమకు ఎటువంటి సమాచారం లేదని తెలిపారని అభివృద్ధికి సహకరించాల్సిన డిప్యూటీ మేయర్ ఇలా అడ్డుకట్ట వేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు.

# ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ వర్ధంతి

### ఘనంగా నివాళులు అర్పించిన కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్



**కూకట్ పల్లి, జనవరి 18 (క్రైమ్ మిర్రర్) :** తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి విశ్వవిఖ్యాత నటసార్వభౌమ డాక్టర్ నందమూరి తారక రామారావు తెలుగు నేలపై నిలిచే ఉంటుందని కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ పేర్కొన్నారు. ఎన్టీఆర్ 29వ వర్ధంతి కార్యక్రమాలు శనివారం కూకట్ పల్లి నియోజకవర్గంలో పార్టీ కార్యకర్తలు ఆయన అభిమానులు వాడ వాడల ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ పరిధి వసంత నగర్ లోని ఎన్టీఆర్ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ బండి రమేష్ స్థానిక నాయకులతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ తెలుగుజాతి కీర్తి పతాక తెలుగుజాతి వెలుగు రేఖ నందమూరి తారక రామారావు అని దేశ దేశాలలో ఆయన తెలుగువారికి ఒంటి చేత్తో ఘన కీర్తిని సాధించి పెట్టారని కొనియాడారు. రాజకీయాలకె రాజకీయాలు నేర్పారని రాజకీయాలను పేద బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి సంక్షేమానికి వినియోగించిన మహానుభావుడన్నారు. అటు నటనలోనూ ఇటు రాజకీయములను రారాజుగా వెలుగొందిన రామారావు జీవితం నేటి యువతకు ఆదర్శప్రాయం అన్నారు. అనంతరం నిజాంపేట్ రోడ్ త్రివేణి నగర్ చౌరస్తాలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు టిడిపి జనార్ధన్, శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి జగదీశ్వర్ గౌడ్ తో తో కలిసి బండి రమేష్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా అభిమానులు రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. రక్తదానం చేసిన వారికి ఎన్టీఆర్ ట్రస్ట్ తరపున సర్టిఫికెట్స్ ప్రధానం చేసి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

# ఆది జాంబవ సంఘం నూతన కమిటీ ఎన్నిక



**మందమర్రి టౌన్ జనవరి 18 క్రైమ్ మిర్రర్:** ఆది జాంబవ సంఘం నూతన కార్యవర్గాన్ని శుక్రవారం సింగరేణి హై స్కూల్ గ్రౌండ్ లో జరిగిన సమావేశంలో ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షులుగా కంబాల రాజనర్సు, వర్కింగ్ ప్రెసిడెంట్ గా బీదునూరి శంకర్ ఉపాధ్యక్షులుగా ఆవునూరి పోశం, బచ్చలి భీమయ్య, తుంగపిండి శ్రీనివాస్, కల్వల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా దాసరి రాజనర్సు, సంయుక్త కార్యదర్శులుగా కల్వల పోషం, రామ్ బాబు, విరుగురాల వెంకటి, దాసరి ఎల్లారం, గసిగంటి మల్లయ్య, నాయిని శ్రీను, అధికార ప్రతినిధిగా ఉప్పులేటి నరేష్, ప్రచార కార్యదర్శులుగా సంఘీ రవి, రేగుంట రాజన్న, నెరువట్ల లక్ష్మణ్, ఏల్పుల దుర్గ ప్రసాద్, కాసిపేట సుధాకర్, గసిగంటి శంకర్, కోశాధికారిగా ఆసం కొమురయ్య, కార్యవర్గ సభ్యులుగా కల్వల సురేష్, కాసిపాక తిరుపతి, హనుమంతు, ఏల్పుల కిరణ్, ఎల్పుల వెంకటి, అంతర్పుల మధు లను ఎన్నుకున్నారు.

క్రైమ్ మిర్రర్®
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
6 ఆదివారం 19-1-2025

# స్టూడెంట్ కౌన్సిలర్ అవుట్సోర్సింగ్ పోస్టుల కొరకు దరఖాస్తుల ఆహ్వానం



**భద్రాద్రి కొత్తగూడెం జనవరి 18 (క్రైమ్ మిర్రర్ ):** ఖమ్మం మరియు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నడపబడుతున్న తెలంగాణ ఏకలవ్య మోడల్ గిరిజన విద్యాలయాల్లో పనిచేయుటకు అర్హులైన తెలంగాణ రాష్ట్రం నుండి మాత్రమే తాత్కాలికంగా స్టూడెంట్ కౌన్సిలర్ అవుట్సోర్సింగ్ పోస్టుల కొరకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థుల విద్యార్హతలు పి జి లో ఏదైనా గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుండి సైకాలజీ లేదా క్లినికల్ సైకాలజీలో విద్యార్హతలో పొందిన మార్కుల ఆధారంగా మరియు ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేయబడునని అన్నారు. అభ్యర్థులు ఈనెల 20 నుండి 23 వ తేదీలోగా తమ దరఖాస్తులను ప్రాంతీయ సమన్వయ అధికారి వారి కార్యాలయము ఐటిడిఏ భద్రాచలం నందు స్వయంగా సమర్పించాలని, దరఖాస్తులను పరిశీలించిన అనంతరం అభ్యర్థుల విద్యార్హతల ఆధారంగా మెరిట్ ప్రాతిపదికన మరియు ఇంటర్వ్యూ ద్వారా ఖాళీ పోస్టుల వారీగా ఎంపిక చేయబడతాయని, వివరాల కోసం ప్రాంతీయ సమన్వయ అధికారి వారి కార్యాలయం భద్రాచలం చరవాణి నెంబర్ 9704178525 ద్వారా తెలుసుకోవాలని ఆయన అన్నారు. అభ్యర్థులు నిర్ణీత దరఖాస్తు నమూనా ద్వారా మాత్రమే దరఖాస్తు చేయాలని, బయోడేటా ఫారం ద్వారా సమర్పించకూడదని, అభ్యర్థులు అసంపూర్తిగా లేదా తప్పుడు సమాచారంతో నింపిన దరఖాస్తులు తిరస్కరించబడతాయని, అభ్యర్థులు ఏ విధమైన అననుకూల మార్గాలను అనుసరించిన లేదా నియమాలను పాటించకపోతే ఆ దరఖాస్తులను తక్షణమే తిరస్కరించబడతాయని, పీవో ఐ టి డి ఏ భద్రాచలం ప్రామాణిక అధికారి అవసరమైనప్పుడు ఖాళీలను పెంచడం లేదా తగ్గించడం మరియు నోటిఫికేషన్ ను ఎప్పుడైనా రద్దు చేసే అధికారం కలిగి ఉంటారని ఆయన అన్నారు. మొత్తం నాలుగు పోస్టులు కలవని, ఎంపిక కాబడిన అభ్యర్థులు చర్ల, దుమ్ముగూడెం, టేకులపల్లి, సింగరేణి ఏకలవ్య మోడల్ గిరిజన విద్యాలయాల్లో పనిచేయవలసి ఉంటుందని అన్నారు. గతంలో స్టూడెంట్ కౌన్సిలర్ ఔట్సోర్సింగ్ నిర్వహించిన ఇంటర్వ్యూలు కొన్ని అనివార్య కారణాలవల్ల రద్దు చేయడం జరిగినదని, ఈ విషయాన్ని దరఖాస్తు చేసిన అభ్యర్థులు గమనించగలరని ప్రాంతీయ సమన్వయ అధికారి ఖమ్మం రీజియన్ ఆర్ సి ఓ నాగార్జున రావు తెలిపారు.



# గూగుల్ మ్యాప్స్ ద్వారా కబ్జాలను గుర్తిస్తాం.. నిందితులపై నాన్ బెయిలబుల్ కేసులు....

## హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్...

**కుత్బుల్లాపూర్,జనవరి 18 (క్రైమ్ మిర్రర్) :** గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో జరిగే భూ కబ్జాలను గూగుల్ మ్యాప్స్ ద్వారా గుర్తిస్తామని.. అక్రమణలకు పాల్పడే వారిపై నాన్ బెయిలబుల్ కేసులు పెడతామని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పష్టం చేశారు.జగద్గిరిగుట్ట వెంకటేశ్వరస్వామి దేవాలయం భూములను కమీషనర్ రంగనాథ్ పరిశీలించారు. దేవాలయ భూములను కబ్జా చేస్తున్నారని స్థానిక రెవెన్యూ అధికారులకు ఎన్ని ఫిర్యాదులు ఇచ్చినా పట్టించుకోవట్లేదని ఈ సందర్భంగా స్థానికులు కమిషనర్?కు ఫిర్యాదు చేశారు. దీంతో కబ్జాలకు పాల్పడుతున్న స్థానిక నేతలపై కేసులు బుక్ చేయాలని పోలీసులను ఆదేశించారు.ఆలయం చుట్టూ ఉన్న భూములు కబ్జా అవుతుంటే ఏం చేస్తున్నారని కుత్బుల్లాపూర్ రెవెన్యూ అధికారులపై కమిషనర్ రంగనాథ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గోవిందరాజుల స్వామి ఆలయం కొలను, గుండం కబ్జా అవుతున్నట్టు పూజారి నరహరి వీడియో చూసి ఇక్కడకు వచ్చామని తెలిపారు. అలాగే ఇక్కడున్న పరికి చెరువు కబ్జాలను కూడా పరిశీలించామని చెప్పారు. కులసంఘాల పేరిట స్థలం కబ్జా చేసి ప్లాట్లు చేసినట్లు కంప్లైయింట్స్ వచ్చాయని.. గూగుల్ మ్యాప్స్ ద్వారా కబ్జాలను గుర్తించి అక్రమణదారులకు నోటీసులు ఇస్తామని తెలిపారు. హైడ్రా పోలీసు స్టేషన్ కూడా 15 రోజుల్లో పని ప్రారంభిస్తుందని.. కబ్జాదారులపై నాన్ బెయిలబుల్ కేసులు పెడతామని హెచ్చరించారు. కబ్జాలపై నిర్లక్ష్యం వహించిన స్థానిక అధికారులపై ప్రభుత్వానికి రిపోర్ట్ ఇస్తామన్నారు. వచ్చే బుధవారం జగద్గిరిగుట్ట ఆలయ భూములతో పాటు పరికి చెరువు కబ్జాలపై స్థానికులతో హైడ్రా కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేస్తామని తెలిపారు. 2024 జూలైలో హైడ్రా ఏర్పాటు అయిందని.. అంతకుముందు నిర్మించిన నివాసాల జోలికి హైడ్రా వెళ్ళదని కమిషనర్ రంగనాథ్ మరోసారి స్పష్టం చేశారు. 2024 జూలై తర్వాత జరిగిన కబ్జాలపై మాత్రమే హైడ్రా యాక్షన్ తీసుకుంటుందని క్లారిటీ ఇచ్చారు.

# ట్రాన్స్ జెండర్స్ వెక్కిలి చేష్టలు చేస్తే చర్యలు తప్పవు

**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్):** రాత్రి సమయంలో రోడ్లపై ప్రయాణం సాగిస్తున్న వారితో ట్రాన్స్ జెండర్స్ వెకిలి చేష్టలతో వేళలో రోడ్ల పక్కన ఆసభ్యకర దుస్తులు ధరించి, వికృత శ్రేష్టలు చేస్తూ, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతూ రోడ్డుపై వెళ్లే వారికి అసౌకర్యం కలిగిస్తున్నారు అనే సమాచారం మరియు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం రాత్రి మీర్పేట్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ చేసి మందమల్లమ్మ చౌరస్తా, టీకేఆర్ కమాన్, గాయత్రి నగర్ వద్ద 16 మంది ట్రాంజెండర్స్ ను పట్టుకొని వారిపై చట్ట పరంగా కేసులు నమోదు చేసి ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ ముందు హాజరు పరిచి బైండోవర్ చేయడంతో పాటు ఇదే విదంగా ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాము అని మీర్పేట్ ఇన్స్పెక్టర్ నాగరాజు ఓ ప్రకటనలో తెలిపారు.

# తెలుగు జాతికి ముల పురుషుడు ఎన్.టీ.ఆర్

## ఉప్పలపాటి శ్రీకాంత్....




మియాపూర్ క్రైమ్ మిర్రర్ : తెలుగుజాతి ఇలవేలుపు, మరణం లేని జననం విశ్వవిఖ్యాత, నటసార్వభౌమ, నటరత్న, పద్మ శ్రీ, మాజీ ముఖ్యమంత్రి డా. నందమూరి తారక రామారావు 29 వ వర్ధంతి సందర్భంగా మియాపూర్ డివిజన్ పరిధిలోని జయప్రకాష్ నారాయణ నగర్ కాలనీలో స్థానికులతో కలిసి ఆ మహానుబావుడి విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించిన మియాపూర్ డివిజన్ కార్పొరేటర్ జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ సభ్యులు ఉప్పలపాటి శ్రీకాంత్ ఈ సందర్భంగా ఉప్పలపాటి శ్రీకాంత్ మాట్లాడుతూ..తెలుగువారి గుండెల్లో చెరగని ముద్ర చిరస్థాయిగా వేసుకున్న నాయకుడు, విశ్వవిఖ్యాత, నటసార్వభౌమ, నటరత్న, పద్మ శ్రీ, మాజీ ముఖ్యమంత్రి డా. నందమూరి తారక రామారావు అని తెలియజేసారు,అన్న అనే పదానికి మారుపేరు, సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్లు అని భావించి ప్రజా సంక్షేమానికి సరికొత్త అర్థం చెప్పిన మహానుభావుడు నందమూరి తారకరామారావు అని,అదేవిదంగా ఎంతో మందికి ఆయన స్ఫూర్తి ప్రదాత అని, రాజకీయాలకు నూతన నిర్వచనం ఇచ్చి కోట్లాది జీవితాలలో వెలుగు నింపిన మహనీయుడు ఎన్టీఆర్ మరణం లేని జననం,తెలుగువాడి కీర్తిని నలుదిశలా ప్రపంచ వ్యాప్తంగా చాటిచెప్పిన యుగపురుషుడు ఎన్టీఆర్ అని కార్పొరేటర్ శ్రీకాంత్ కొనియాడారు. ఈ కార్యక్రమంలో కృష్ణం రాజు, జనార్ధన్ రావు,బలరాం, ఎస్ ఆర్ వెంకటేశ్వరావు, సూర్యదేవర శ్రీనివాస్, చిలుకూరి శ్రీనివాస్, రమేష్ , నరేంద్ర ,కిరణ్, జితేంద్ర, బాబు రెడ్డి, రవి రెడ్డి, జగదీష్ రెడ్డి, రామారావు, నందమూరి అభిమానులు ,శ్రేయభిలాషులు, మిత్రులు,నాయకులు,కార్యకర్తలు ,కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# హిందువులు విగ్రహాలను దేవుళ్ళ సజీవ రూపంగా భావిస్తారు : శ్రీశ్రీశ్రీ ఆదిత్య పరాశ్రీ స్వామి



**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్):** హిందువులు దేవాలయాలలోని విగ్రహాలను కేవలం విగ్రహంగానే కాకుండా సజీవ దేవుళ్ళ సజీవరూపంగా భావిస్తారని శ్రీ శ్రీ అంబాత్రేయ క్షేత్రం పీఠాధిపతి శ్రీశ్రీ ఆదిత్య పరాశ పరాశ్రీ స్వామి అన్నారు. శనివారం బాలాపూర్ మండలం మీర్పేట్ జిల్లెల్ గూడ లో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ కమిటీ సభ్యుల మేరకు ఆయన ఆలయాన్ని సందర్శించారు. అంతకుముందు స్వామివారు ఆలయ ప్రాంగణానికి వెంచేయగానే అర్చకులు వేద మంత్రాలతో పూర్ణకుంభ స్వాగతం పలుకగా, వారికి పుష్పాలు, పాలతో పాదపూజచేసి, పట్టు వస్త్రాలతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు ఆలయ నిర్మాణానికి కావలసిన పలు సూచనలు సలహాలు చేశారు. దేవస్థాన కమిటీ వారు స్వామివారిని అడిగిన సందేహాలను నివృత్తి చేస్తూ, కొన్ని క్రతువులను వేద పండితులు, ఆచార్యుల వారు చేస్తారని, యంత్ర ప్రాణ ప్రతిష్ట మాత్రం సన్యాసులు ఋషులు చేయాల్సి ఉంటుందన్నారు. స్వామివారు మాట్లాడుతూ మన వంశానికి, వారసత్వానికి మనం ఆస్తులు ఇచ్చినట్టుగానే మన ఆచార వ్యవహారాలను, కట్టుబాట్లను కూడా ప్రసాదింపచేయాలని ఆయన సూచించారు. ఆర్యవైశ్య సమాజం పవిత్రంగాను శుచిగాను, శుభ్రతతోను ఉంటారని, సమాజంలో వారి విలువ ఉన్నతంగా ఉంటుందని అన్నారు. యంత్రం యొక్క ప్రాణ ప్రతిష్ట చేసినప్పుడు సనాతన ధర్మం లో మనకు సూచించిన విధంగా యంత్రానికి ప్రాణ ప్రతిష్ట చేస్తే ఆలయ కాంతి, మహత్యం కొన్ని వేల సంవత్సరాల వరకు విరజిల్లుతుందని అన్నారు. ప్రాణ ప్రతిష్టకు ముందు ఆ విగ్రహాన్ని ఉపయోగించరని, ప్రాణ ప్రతిష్ట ద్వారా విగ్రహంలోనికి ప్రాణశక్తిని ప్రవేశపెట్టిన తర్వాతనే పూజా కైంకర్యాలు చేపడతారని అన్నారు. ఎప్పుడైతే విగ్రహం ప్రాణ ప్రతిష్టగా జరుగుతుందో అప్పటినుండి ఆ విగ్రహంలోకి దైవం వస్తుందని హిందూ పురాణాలు, శాస్త్రాలు చెబుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థపతి వెంకటరెడ్డికి, కమిటీ పెద్దలకు ఆలయ నిర్మాణంలో ఆగమ శాస్త్ర పరంగా అనుసరించవలసిన పద్ధతులను వివరించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ తేరటి పల్లి శ్రీనివాస్ గుప్త, పచ్చిపులుసు శ్రీరామచంద్రమూర్తి, అధ్యక్షులు ఇరువెంటి సురేష్, ప్రధాన కార్యదర్శి గందె వెంకటేశ్వర్లు, కోశాధికారి, దేవస్థాన కమిటీతో పాటు ఆర్యవైశ్య మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# బ్యాంకులు అందిస్తున్న సేవల పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలి

## మండల మహిళ సమాఖ్య సభ్యులకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

## మహిళ సాధికారత కేంద్రం స్పెషలిస్ట్ ఇన్ ఫైనాన్షియల్ లిటరసీ సుమ



**వనపర్తి క్రైమ్ మిర్రర్ ప్రతినిధి:** గ్రామీణ ప్రజలందరూ బ్యాంకులు అందిస్తున్న సేవల పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలని మహిళా సాధికార శాఖ కేంద్రం ఫైనాన్షియల్ లిట్రసి సుమ అన్నారు. శనివారం మహిళా శిశు సంక్షేమ శాఖ అధ్వర్యంలో మిషన్ శక్తి లో భాగంగా వనపర్తి జిల్లా ఖిల్లాఘణపూర్ మండల కేంద్రంలోని మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ఆర్థిక అక్షరాస్యత పై మహిళా సమాఖ్య సభ్యులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, సుకన్య సమృద్ధి యోజన మొదలగు పథకాల గురించి వివరించారు. సుకన్య సమృద్ధి యోజన పథకంలో భాగంగా 10 ఏళ్ల లోపు బాలికలకు పొదుపు ఖాతాలను తెరవాలని సూచించారు. ఆర్థిక అక్షరాస్యతను ప్రజల్లో పెంపొందించడానికి ఆర్థిక మోసాలను అరికట్టడానికి, ఆర్థిక మోసాలు జరగకుండా తీసుకోవలసిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని పూర్తి ఆర్థిక అక్షరాస్యతను సాధించాలని కోరారు. సైబర్ క్రైమ్, బాలల చట్టాలు, చైల్డ్ లేబర్, బాల్య వివాహాల నిర్మూలనపై ప్రతి ఒక్కరు కృషి చేయాలని సూచించారు. టోల్ ఫ్రీ నెంబర్స్ బాలలకు 1098, సైబర్ క్రైమ్ సంబంధించి 1930, మహిళలకు గృహహింస 181, పోలీస్ 100, వయోవృద్ధులు 14567 టోల్ ఫ్రీ నెంబర్లు వాటి ఉపయోగాల గురించి మహిళలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మహిళా సాధికారిక కేంద్రం స్పెషలిటీ ఫైనాన్షియల్ లిట్రేసీ సుమ, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు భాగ్యమ్మ, ఏపిఎం రాంబాబు, సఖి కేంద్రం కేస్ వర్కర్ శ్రావణి, మిషన్ పరివర్తన కమ్యూనిటీ ఎడ్యుకేటర్ సాయి లీల, వివోఏలు, ఈసీలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# ఇష్టంగా ఆడితే అన్నింటా విజయాలే

## బీఆర్ఎస్ అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్

## రాష్ట్రస్థాయి చెస్ విజేతకు సన్మానం



**వనపర్తి క్రైమ్ మిర్రర్ ప్రతినిధి:** క్రీడాకారులు తమకు నచ్చిన ఈవెంట్లలో నైపుణ్యాలను పెంచుకోవాలని, ఇష్టంగా ఆడితే అన్ని రంగాల్లో విజయాలు చేకూరుతాయని వాకిటి శ్రీధర్ తెలిపారు. రాష్ట్రస్థాయి చెస్ విజేతను శ్రీధర్ తో పాటు కౌన్సిలర్ భార్గవి ప్రేమ్ నాథ్ రెడ్డి సన్మానించారు. జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు . వనపర్తి జిల్లాలో తెలంగాణ ఓపెన్ చెస్ చాంపియన్షిప్ అండర్- 11 స్థాయి చెస్ పోటీలలను నిర్వహించారు. వనపర్తి మున్సిపాలిటీ పరిధిలోని 29వ వార్డుకు చెందిన డాక్టర్ రవిచంద్ర, శిరీషల కుమారుడు రవీష్ చంద్ర జూనియర్ చెస్- 11 సంవత్సరాల లోపు జరిగిన చెస్ పోటీరాష్ట్రస్థాయిలో ప్రథమ బహుమతి పొందాడు ఈ సందర్భంగా స్థానిక బారాస జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్ మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ స్థానిక కౌన్సిలర్ భార్గవి ప్రేమాత్ రెడ్డి ఘనంగా సన్మానించి అభినందించారు ఈ సందర్భంగా జిల్లా భారత రాష్ట్ర సమితి అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్ మాట్లాడుతూ గత సంవత్సరం రాష్ట్రస్థాయిలో ఛాంపియన్ పొందిన బాబును అధిగమించి విజయం సాధించిన రవిచంద్ర ను ఘనంగా సన్మానించి అభినందించారు ఇంకా ముమ్మందు జాతీయస్థాయిలో ఈ యొక్క ప్రతిభను కనబరిచి తల్లిదండ్రులకు వనపర్తి ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని దీనికి రాష్ట్ర స్థాయి లో విజేత గా నిలిచిన రవీష్ చంద్ర ను తల్లిదండ్రులు ప్రోత్సాహం అందించాలని మీకు కావలసినటువంటి సహాయ సహకారాలు మా వైపు నుండి సంపూర్ణంగా అందజేస్తామని తెలియజేశారు ఈ కార్యక్రమంలో రవిచంద్ర తాతయ్య విశ్వమోహనా చారి సత్యనారాయణ చారి సత్యనారాయణ గౌడ్ మాధవ రావు పల్లి శ్రీనివాసులు ముజ్జు తదితరులు పాల్గొన్నారు.

# గనుల విస్తరణకు ఓకే...ఉపాధి, అభివృద్ధి విస్మరిస్తే పోరాటమే

## అదానీ(పెన్నా) సిమెంట్స్ ప్రజాభిప్రాయ సేకరణలో స్థానికులు

## స్థానికులకు ఉద్యోగాలివ్వాల్సిందే... ఎమ్మెల్యే బీఎల్ఆర్

## భారీ పోలీస్ బందోబస్తు నడుమ ముగిసిన ప్రజాభిప్రాయ సేకరణ





**క్రైమ్ మిర్రర్, మిర్యాలగూడ:** గనుల విస్తరణకు తామంతా మద్దతిస్తామని గతంలో లాగా పరిసర గ్రామాల అభివృద్ధి, ఉపాధి కల్పనలో మాట తప్పితే మాత్రం తామంతా ఉద్యమించేందుకు సిద్ధమంటూ (పెన్నా) అదానీ సిమెంట్ పరిశ్రమ వద్ద శనివారం ఏర్పాటుచేసిన ప్రజాభిప్రాయ సేకరణలో స్థానికులు తమ అభిప్రాయాలను వెల్లడించారు.దామరచర్ల మండలం గణేష్ పహాడ్ వద్ద 2001లో చాణిక్య సిమెంట్ పేరిట ఏర్పాటైన పరిశ్రమను పెన్నా గ్రూప్ కొనుగోలు చేసి పెన్నా సిమెంట్స్ గా మార్పు చేసింది. ఇటీవల ఈ కర్మగారాన్ని ఆదానీ గ్రూప్ కొనుగోలు చేసింది. నల్లగొండ సూర్యపేట జిల్లాలలో విస్తరించి ప్రస్తుతం ఉన్న గనులకు అదనంగా మరో 304 హెక్టార్ల లో సున్నపురాయి వెలికి తీసేందుకు పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆధ్వర్యంలో రెండు జిల్లాల అదనపు కలెక్టర్లు జె.శ్రీనివాస్, పి.రాంబాబు, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్ ల సమక్షంలో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. గణేష్ పహాడ్, శూన్యపహాడ్, మహంకాళిగూడెం, జాన్ పహాడ్, కల్మేటతండా తదితర గ్రామాల నాయకులు ప్రజలు, పర్యావరణ వేత్తలు, స్వచ్ఛంద సంస్థలు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. స్థానికుల తరపున ముందుగా మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి బిఎల్ఆర్ మాట్లాడుతూ పరిశ్రమ యాజమాన్యానికి స్థానిక సమస్యలను ఎకరవు పెట్టారు. అభివృద్ధికి ఉపాధి కల్పనకు కచ్చితంగా సహకరించాల్సిందని అంటూ డిమాండ్ చేశారు. అదానీ సిమెంట్ ఫ్యాక్టరీని టేక్ ఓవర్ చేయటం, గనుల విస్తరణ చేపట్టడం ఆమోదయోగ్యమైనప్పటికీ, మొట్టమొదట కర్మాగారం ఏర్పాటు చేసిన సందర్భంలో ఇచ్చిన హామీలే ఇంతవరకు నెరవేర్చలేదని, స్థానికులకు అరకొర ఉద్యోగాలతో సరిపెట్టారని, సరైన వేతనం, సదుపాయాలు కల్పించడంలో గత యాజమాన్యాలు విఫలమయ్యాయన్నారు. ప్రస్తుతం ఉన్న స్థానిక ఉద్యోగులను కూడా ఇతర ప్రాంతాలకు బదిలీ చేస్తారని సమాచారం ఉందని అలా చేస్తే ఊరుకోబోమని, నిర్ణయాన్ని మార్చుకోవాలన్నారు. ప్రజాభిప్రాయ సేకరణ కోసం ప్రతిసారి కల్లబొల్లి మాటలు చెప్పే యాజమాన్యం, ఆ పైన వాటిని నెరవేర్చకపోగా, కర్మాగార పరిసరాలలోకి ఎవరిని అనుమతించే పరిస్థితి ఉండదని ఆరోపించారు. సిఎస్ఆర్ నిధులు పరిసర గ్రామాల అభివృద్ధికి ఖర్చు చేయకుండా గత ప్రభుత్వం మాటలు విని ఇతర ప్రాంతాలలో నిధులు ఖర్చు చేశారని ఆరోపించారు. గత యాజమాన్యాల్లా కాకుండా పరిసర గ్రామాల అభివృద్ధిలో, స్థానికుల ఉపాధి కల్పనలో అదానీ యజమాన్యమైన చొరవ చూపాలని ఘంటాపథంగా తెలిపారు. గతంలో లాగే మాట తప్పితే ఉద్యమిస్తామని హెచ్చరించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పర్యావరణవేత్తలు, స్వచ్ఛంద సంస్థలలో ఒకరిద్దరు మినహా విస్తరణకు అనుకూలంగా అభిప్రాయం వ్యక్తం చేశారు. అనంతరం దాదాపు 330 లిఖిత పూర్వక ఫిర్యాధులు అందజేశారు. ఫ్యాక్టరీ జనరల్ మేనేజర్ సుబ్బులక్ష్మణన్ మాట్లాడుతూ పరిసర గ్రామాల అభివృద్ధికి పూర్తిస్థాయి లో సహకరిస్తామని హామీ ఇచ్చారు. లగచర్ల సంఘటన దృష్టిలో ఉంచుకొని ఇప్పటికీ రెండు సార్లు వాయిదా పడ్డ ప్రజాభిప్రాయ సేకరణ మరోసారి అలా జరగకుండా రెండు జిల్లాల పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆందోళన చేస్తారన్న అనుమానం ఉన్న వారిని ముందస్తు అరెస్టులు చేశారు. పరిసర గ్రామాలలో భారీగా పోలీసులు మోహరించారు. కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి బోర్డు ఈ ఈ విజయలక్ష్మి, పలు గ్రామాల నాయకులు ప్రజలు పాల్గొన్నారు.

# హైకోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించి అక్రమ నిర్బంధం

### సామాజిక కార్యకర్త నక్క శ్రీనివాస్



**క్రైమ్ మిర్రర్, మిర్యాలగూడ :** హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఉన్నప్పటికీ, పోలీసులు తనను అక్రమంగా నిర్బంధించారని సామాజిక కార్యకర్త నక్క శ్రీనివాస్ ఆరోపించారు. శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడిన ఆయన, పెన్నా సిమెంట్స్ యాజమాన్యం అక్రమాలపై తాను ఏళ్లుగా పోరాటం చేస్తున్నానని తెలిపారు.గణేశ్ పాడు వద్ద పెన్నా సిమెంట్స్ యాజమాన్యం చేపట్టిన గనుల విస్తరణకు సంబంధించి తన అభిప్రాయాలను ప్రజాభిప్రాయ సేకరణలో వినాల్సిందిగా హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ, ఆ ఉత్తర్వులను ఉల్లంఘిస్తూ పోలీసులు తనను శనివారం తెల్లవారుజామునే అదుపులోకి తీసుకుని ప్రజాభిప్రాయ సేకరణ ముగిసిన తర్వాత వదిలేశారని ఆయన తెలిపారు.తనకు ఈ చర్యతో తీవ్ర అన్యాయం జరిగిందని, కోర్టు ఉత్తర్వులను అమలు చేయాల్సిన వారు వాటిని బేఖాతరు చేయడం దారుణమని నక్క శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య విలువలను పరిగణనలోకి తీసుకుని తనకు జరిగిన అన్యాయంపై హైకోర్టును మరోసారి ఆశ్రయించనున్నట్లు ఆయన వెల్లడించారు.పెన్నా సిమెంట్స్ యాజమాన్యాన్ని ఇటీవల ఆదానీ గ్రూప్ కొనుగోలు చేసిన విషయం తెలిసిందే. గనుల విస్తరణపై ప్రజాభిప్రాయ సేకరణలో అనేక ఆరోపణలు వెలువడటంతో ఈ వ్యవహారం వివాదాస్పదమవుతోంది.

# అకస్మాత్తుగా చెత్తలారీలో మంటలు..దగ్ధం

**మేడ్చల్ మల్కాజ్ గిరి,(క్రైమ్ మిర్రర్):** మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లాలో దమ్మాయి గూడలో చెత్త లారీ పూర్తిగా దగ్ధం అయ్యింది. డంపింగ్ యార్డుకు వెళ్తుండగా అహ్మద్ గూడ సాయిబాబా ఆలయం దగ్గరకు రాగానే లారీలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. చెత్త లారీలోనీ సెల్ఫ్ మోటార్ లో మంటలు రావడంతో డ్రైవర్ సతీష్ లారీని పక్కకు ఆపేశారు.మంటలు ఆర్పే ప్రయత్నం చేశాడు కానీ ఒక్కసారిగా మంటలు రావడంతో బయంతో డ్రైవర్ దూరం వెళ్లాడు. ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. సంఘటన స్థలానికి వచ్చిన పోలీసులు,÷ర్ సిబ్బంది మంటలను ఆర్పేశారు. ఈ ఘటనలో లారీ పూర్తిగా దగ్ధమయ్యింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# పదేళ్లుగా గుర్తుకు రాని రైతులపై మొసలి కన్నీరు

### బిఆర్ఎస్ తీరుపై మండిపడ్డ మంత్రి తుమ్మల

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** రైతు సంక్షేమం కోసం పాటుపడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి నిర్మాణాత్మక సలహాలు ఇవ్వకుండా తప్పించుకు తిరుగుతున్న బీఆర్ఎస్ చేయనివి, చేసినట్టు తమప్రభుత్వం ఏమి చేయనట్లు పదేపదే మాట్లాడటం విడ్డూరంగా ఉందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విమర్శించారు. -రైతు బంధు పేరుతో రైతాంగాన్ని దగా చేసిన బీఆర్ఎస్ పార్టీ చేస్తున్న దొంగదీక్షలను తెలంగాణ సమాజం గమనిస్తుందన్నారు. పదేళ్ళు అధికారంలో ఉన్నపుడు గుర్తుకురాని రైతులపై ఈ రోజు బీఆర్ఎస్ నాయకులకు మొసలి కన్నీరు కారుస్తున్నారని తెలిపారు. ప్రతి పంట కాలంలో రైతుబంధు ఎప్పుడు మొదలు పెట్టి ఎప్పటి వరకు ఇచ్చారో గుర్తుచేసుకోవాలని సూచించారు.రైతుబంధు పేరు చెప్పి పంటల భీమా, వ్యవసాయ యాంత్రికరణ పథకాలకు తిలోదకాలు ఇచ్చింది బీఆర్ఎస్ నాయకులు కాదా ? అని ప్రశ్నించారు. గత ప్రభుత్వం సృష్టించిన ఆర్థిక విధ్వంసంతో కుదేలైన ఆర్థిక పరిస్థితులను తాము క్రమంగా చక్కబెట్టుకుంటు రైతులకు ఇచ్చిన మాటలను నిలబెట్టుకుంటు, ఒక్కొక్క పథకాన్ని అమలుచేస్తున్నామని మంత్రి తుమ్మలు వెల్లడించారు. గ్రామీణ ప్రజలు రెండు పర్యాయలు ఎన్నికలలో బిఆర్ఎస్ని తిరస్కరించారని, ఇప్పటికైనా బిఆర్ఎస్ నాయకులు వాస్తవాలను తెలుసుకుని మాట్లాడితే మంచిదని మంత్రి తుమ్మల హితవు పలికారు.

# తిరుమలలో వరుస దుర్ఘటనలపై కేంద్రం దృష్టి

### క్షేత్రస్థాయి పరిశీలనకు హోంశాఖ సెక్రటరీ రాక

**తిరుమల,(క్రైమ్ మిర్రర్):** కొన్ని రోజులుగా తిరుమలలో జరుగుతున్న వరస ఘటనలపై కేంద్ర ప్రభుత్వం సీరియస్‌గా స్పందించింది. ఈనెల 8న తిరుపతి తొక్కిసలాట,13న లడ్డూ కౌంటర్ అగ్నిప్రమాద ఘటనలపై టీటీడీ నుంచి కేంద్ర హోంశాఖ నివేదిక కోరింది. క్షేత్రస్థాయి పరిశీలనకు హోంశాఖ అడిషనల్ సెక్రటరీ సంజీవ్ కుమార్ జిందాల్ ని పంపుతున్నట్లు తెలిపింది. మరో రెండ్రోజుల్లో తిరుమలకు సంజీవ్ కుమార్ జిందాల్ రానున్నారు. అక్కడ పర్యటించి ప్రమాదాలకు గల కారణాలను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించనున్నారు. టీటీడీ చరిత్రలో ఇలాంటి ఘటనలపై మొదటిసారిగా కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుంది. దీంతో ఏం జరుగుతుందోనని టీటీడీ అధికారుల్లో కొంత ఆందోళన కనిపిస్తోంది. కాగా, ఈనెల 8న తిరుమల శ్రీవారి వైకుంఠ ద్వార దర్శనం కోసం భక్తులు పోటెత్తారు. లక్షల్లో భక్తులు రావడంతో టోకెన్లు ముందుగానే ఇవ్వాలని టీటీడీ నిర్ణయించింది. అయితే క్యూలైన్లలో ఒకేసారి భక్తులను వదిలిపెట్టడంతో పెద్దఎత్తున తొక్కిసలాట జరిగింది. దీంతో పెద్దఎత్తున ప్రాణ నష్టం జరిగింది. ఆరుగురు మృతిచెందగా.. పదుల సంఖ్యలో భక్తులు గాయపడ్డారు. ఘటనపై సీఎం చంద్రబాబు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతులు, గాయపడిన వారి కుటుంబాలను ముఖ్యమంత్రి పరామర్శించారు. బాధితులకు పరిహారం ప్రకటించారు. కాగా, ఈ ఘటన దేశవ్యాప్తంగా



# మహేశ్వరం నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలుగా సమతా ప్రకాష్ నియామకం

### గాంధీభవన్లో నియామక పత్రాన్ని అందచేసిన జ్యోతి భీమ్ భారత్

### నియోజకవర్గం లో మహిళా బలోపేతం కోసం కృషి చేస్తా ం సమతా ప్రకాష్

**మహేశ్వరం ప్రతినిధి(క్రైమ్ మిర్రర్ ):** మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలుగా సమతా ప్రకాష్ ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా సమతా ప్రకాష్ మాట్లాడుతూ.నాపై నమ్మకంతో గొప్ప బాధ్యతలు ఇచ్చిన పార్టీ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు పార్టీ బలోపదానికి మహిళా కాంగ్రెస్ బలపడడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సునీతా రావు,రంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు జ్యోతి భీమ్ భారత్ ఆధ్వర్యంలో గాంధీభవన్ లో నియామక పత్రం అందుకోవడం జరిగిందని తెలిపారు నియామక పత్రం అందుకున్న తర్వాత నియోజకవర్గం సీనియర్ నాయకులకు నియోజకవర్గ ఇంచార్జ్ కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి కి దీప భాస్కర్ రెడ్డికి, ఏనుగు జంగారెడ్డి చల్ల నరసింహారెడ్డికి పారిజాత నర్సింహారెడ్డికి తీగల అనిత రెడ్డికి నియోజకవర్గ కాంగ్రెస్ కుటుంబ సభ్యులకు మహిళా నాయకురాళ్లకు సమతా ప్రకాష్ దన్యవాదాలు తెలిపారు

# పంచాయితీ కార్మికులపై మాట్లాడే హక్కు లేదు

### గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క



**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** :పంచాయతీ కార్మికుల వేతనాలపై మాట్లాడే నైతిక హక్కు బిఆర్ఎస్ నేత, శాసనసభ్యుడు హరీష్ రావుకి లేదని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అన్నారు. 2023 మార్చి 13న కలెక్టరేట్ల ముందు వంటా వార్పు చేపట్టి నిరసన తెలిపిన వార్త కథనాలను మరిచారా? అని ప్రశ్నిస్తూ మాజీ మంత్రి హరీష్ రావు వ్యాఖ్యలను మంత్రి ఖండించారు. ఈ మేరకు ఆమె గురువారం ఒక ప్రకటన జారీ చేశారు. ఆయన ఆర్దిక మంత్రిగా ఉన్నప్పుడే నెలల తరబడి జీతాలు రాక పంచాయతీ కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్నారని గుర్తు చేశారు. అధికారంలో ఉన్నప్పుడు జీతాలు ఇవ్వకుండా అవస్థలకు గురి చేసి ఇప్పుడు మొసలి కన్నీరు కార్చడం వల్ల ప్రయోజనం శూన్యమని అన్నారు. పంచాయతీ కార్మికులు, ఎంజిఎన్ఆర్ఈజిఎస్ ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్ల వంటి వేల మంది చిరు ఉద్యోగులను కనీసం మీ ప్రభుత్వం గుర్తించ లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మీ తప్పులను మేము సరిదిద్దుతున్నాం, మీ హయాంలో అన్యాయానికి గురైన వర్గాలను ఆత్మగౌరవంతో తలెత్తుకునేలా చేస్తున్నామని గట్టిగా బదులిచ్చారు. గ్రామ స్థాయిలో చిరు ఉద్యోగులకు సైతం ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే ప్రతి నెలా సకాలంలో జీతాలు చెల్లించే విధానాన్ని రూపొందించి దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నామని మంత్రి సీతక్క తెలిపారు. ఇకపై 92 వేల మంది పంచాయతీ స్థాయి సిబ్బందికి ప్రభుత్వ ఉద్యోగులకు తరహాలోనే జీతాలు చెల్లిస్తోందని తెలిపారు. అవాస్తవాలతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలను మానుకోవాలని ఆమె హితవు పలికారు.

# జమిలి ఎన్నికలు ఫెడరల్ వ్యవస్థకు వ్యతిరేకం కాదు

### ఆనాడు లేని అభ్యంతరం ఇప్పుడే ఎందుకో

### జెపిసి అన్ని విషయాలను చర్చిస్తుందన్న కేంద్రమంత్రి

**న్యూఢిల్లీ, (క్రైమ్ మిర్రర్):** లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలను ఒకేసారి నిర్వహించడం ఫెడరల్ వ్యవస్థకు వ్యతిరేకం కాదని కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ శనివారం స్పష్టం చేశారు. జమిలి ఎన్నికల వల్ల పాలన మెరుగు అవుతుందని ఆయన స్పష్టం చేశారు. 'ఓ జాతీయ సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మేఘ్వాల్ మాట్లాడుతూ, మొదటి కొన్ని లోక్‌సభ, శాసనసభ ఎన్నికలను 1952 నుంచి కలిపే నిర్వహించారని చెప్పారు. అవి ఫెడరల్ వ్యవస్థకు వ్యతిరేకం కాకపోయి ఉంటే 'ఇప్పుడు ఎందుకు చేటు' అని ఆయన ప్రశ్నించారు. సభా కమిటి ముసాయిదా చట్టాలను పరిశీలించాలనే ఆసక్తితో ప్రధాని నరేంద్ర మోడీ కూడా ఉన్నందున జమిలి ఎన్నికల బిల్లులను పార్లమెంట్ సంయుక్త కమిటీ (జెపిసి)కి నివేదించినట్లు మేఘ్వాల్ తెలియజేశారు. సంయుక్త కమిటీ తొలి సమావేశంలో శాసన విభాగం కార్యదర్శి రాజీవ్ మణి జమిలి ఎన్నికలకు సంబంధించిన వివిధ అంశాలను, ఆ ఎన్నికల చరిత్రను సభ్యులకు వివరించారని మంత్రి తెలిపారు. 'ఇప్పుడు వారు (ఒక దేశం ఒకే ఎన్నికలను వ్యతిరేకిస్తున్నవారు) చేస్తున్న అతిపెద్ద ఆరోపణ ఏమిటంటే అవి ఫెడరల్ వ్యవస్థకు వ్యతిరేకం అన్నది.1952 ఎన్నికలను నిర్వహించినప్పుడు అన్ని శాసనసభలకు ఎన్నికలను ఒకేమారు నిర్వహించారని నేను చెప్పదలిచాను. 1957 ఎన్నికలను, 1962 ఎన్నికలను ఒకే మారు నిర్వహించారు. 1967 ఎన్నికలను ఒకే మారు నిర్వహించారు/ అవి ఏవిధంగా (ఫెడరల్ వ్యవస్థకు) చేటు?' అని ఆయన అన్నారు. జమిలి ఎన్నికలు సుపరిపాలనకు, సత్వర అభివృద్ధికి దారి తీస్తాయని మేఘ్వాల్ చెప్పారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి కారణంగా ఎప్పటికప్పుడు తలెత్తుతుండే ఇబ్బందులు పరిహారం అవుతాయని ఆయన స్పష్టం చేశారు. జమిలి ఎన్నికల వ్యవస్థ ఏమిటో జెపిసిలోని ప్రతిపక్ష సభ్యులకు వివరించినట్లు, వారు అర్థం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. 'లోక్‌సభ 'నియుక్త తేదీ' ఏమిటి అనేది కూడా వారితో చెప్పడమైంది, వారు ప్రతిదీ అర్థం చేసుకున్నారు' అని మంత్రి తెలియజేశారు. 'ఎవరో దానిని వ్యతిరేకిస్తుంటే వారు రాజకీయ కారణాలతోనే అలా చేస్తున్నారు' అని మేఘ్వాల్ ఆరోపించారు. వక్ఫ్ సవరణ బిల్లుపై ప్రశ్నకు మంత్రి సమాధానం ఇస్తూ, ఉభయ సభల సంయుక్త కమిటీ ముసాయిదా చట్టాలను పరిశీలిస్తున్నదని, సంప్రదింపులు సాగిస్తున్నదని చెప్పారు. 'ఒక గ్రామంలో ఏదో ఒక ఆస్తి ఉన్నప్పుడు, ఒక రోజు మీరు వచ్చి అది వక్ఫ్ ఆస్తి అని, అది వక్ఫ్ ఆస్తి అవుతుందని అంటే ఎలా' అని మేఘ్వాల్ అన్నారు. ఆక్రమణ విషయంలో ఒక విధానం ఉండాలని ఆయన సూచించారు. కమిటీ నివేదిక సమర్పించిన తరువాత

# దేశవాళీ పోటీల్లో రాణించాల్సిందే

## మళ్ళీ పాత పాటే పాడిన బీసీసీఐ సెలక్టర్లు



ఇటీవల జరిగిన బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ టోర్నమెంట్లో భారత్ 3-1 తేడాతో ఘోర పరాజయం చవిచూసిన నేపథ్యంలో త్వరలో ఇంగ్లాండ్ తో జరగనున్న వన్డే సిరీస్, దుబాయ్-పాకిస్తాన్ లలో జరగనున్న ఛాంపియన్స్ ట్రోఫీ టోర్నమెంట్ కి భారత్ జట్టు ఎంపిక క్రికెట్ అభిమానులలో ఎంతో ఆసక్తిని రేకెత్తించింది. ఆస్ట్రేలియా పర్యటనలో ఘోర పరాభవం తర్వాత భారత్ క్రికెట్ జట్టులో విభేదాలు తలెత్తినట్టు దుమారం చెలరేగడం, విదేశీ పర్యటనలో కొంతమంది స్టార్ క్రికెటర్ల వ్యవహారశైలిపై పెద్ద ఎత్తున చర్చ జరిగింది.ఆస్ట్రేలియా సిరీస్ పరాజయం తర్వాత భారత్ క్రికెట్ కంట్రోల్ బోర్డు జట్టును ప్రక్షాళన చేయబోతున్నట్టు ప్రకటించి ఇందుకోసం పది మార్గదర్శకాలు కూడా విడుదల చేసింది. ఇందులో దేశవాళీ పోటీల్లో అందరూ తప్పనిసరిగా ఆడాలని సిఫార్సు చేసింది. భారత్ జట్టు ఎంపిక దేశవాళీ పోటీలలో క్రికెటర్ల ప్రదర్శన ఆధారంగానే జరుగుతుందని స్పష్టం చేసింది. అయితే ఈ ప్రకటన చేసిన కొద్ది గంటల తర్వాత జరిగిన భారత్ జట్టు ఎంపిక విషయంలో ఈ నిబంధనలేవీ పాటించినట్లు కనిపించలేదు. కంటితుడుపు ప్రకటనలు తప్ప దేశవాళీ పోటీల్లో పరుగుల ప్రవాహం సృష్టిస్తున్న విదర్భ బ్యాట్స్మన్ కరుణ్ నాయర్ కి మరో మరు మొండి చేయి చూపించడమే ఇందుకు చక్కని ఉదాహరణ. మరి దేశవాళీ టోర్నమెంట్లలో అద్భుతంగా ఆడి ప్రయోజనమేంటో అర్థం కాదు.

**కరుణ్ నాయర్‌కు మొండిచేయి**

33 ఏళ్ల కుడిచేతి వాటం బ్యాట్స్‌మన్ కరుణ్ నాయర్ ప్రస్తుతం జరుగుతున్న విజయ్ హజారే ట్రోఫీలో విదర్భ తరపున ఆడుతూ ఎనిమిది మ్యాచ్‌లలో మొత్తం 752 పరుగులు సాధించాడు. ఈ టోర్నమెంట్‌లో నాయర్ బ్యాటింగ్ సగటు 752.00. నాయర్ ఏడు ఇన్నింగ్స్‌లలో ఏకంగా ఐదు సెంచరీలు చేశాడు. విదర్భకు సారథి అయిన నాయర్ జట్టు ఫైనల్ కి చేరడంలో కీలక భూమిక వహించాడు. కాగా విజయ్ హజారే ట్రోఫీ టోర్నమెంట్ దేశవాళీ పోటీల్లో వన్డే ఫార్మాట్ లో జరుగుతుండటం ఇక్కడ గమమనించాల్సిన మరో ముఖ్యాంశం.

**నాయర్ పై సచిన్ ప్రశంసల జల్లు**

జట్టు ఎంపికకు కొద్ది గంటల ముందు ప్రస్తుతం జరుగుతున్న విజయ్ హజారే టోర్నమెంట్ లో నాయర్ ప్రదర్శన పై లిటిల్ మాస్టర్ సచిన్ టెండూల్కర్ సైతం ప్రశంసల జల్లు కురిపించాడు. " 7 ఇన్నింగ్స్‌లలో 5 సెంచరీలతో 752 పరుగులు చేయడం ఆషామాషీ విషయం కాదు. ఈ స్థాయి లో రాణించాలంటే అపారమైన కృషి, పట్టుదల అవసరం. ఇదే రీతిలో ఆడి మరిన్ని ఘన విజయాలు సాధిస్తావని ఆశిస్తున్నా!, అని సచిన్ స్వయంగా కరుణ్ నాయర్ కి ట్వీట్ చేసాడు. అయితే భారత్ జట్టు ఎంపిక సమయంలో ఇవేమి లెక్కలోకి రాలేదు.

**అగార్కర్ కంటి తుడుపు మాటలు**

జట్టు ఎంపిక అనంతరం భారత్ జట్టు సెలక్షన్ కమిటీ చైర్మన్, మాజీ టెస్ట్ క్రికెటర్ అజిత్ అగార్కర్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, నాయర్ ప్రస్తుత అద్భుతమైన ఫామ్ ను, అత్యుత్తమ గణాంకాలను సెలక్షన్ కమిటీ పరిగణలోకి తీసుకుందని చెబుతూనే, జట్టు సెలక్షన్ కమిటీ చాలా కఠినమైన పరీక్షను ఎదుర్కొందని వివరించాడు. " 750-ప్లస్ సగటు తో పరుగులు సాధించడం మామూలు విషయం కాదు. అయితే మేము 15 మందితో కూడిన జట్టు ను మాత్రమే ఎంపిక చేయాలి. అందరికీ న్యాయం చేయడం సాధ్యం కాదు," అని తేల్చి చెప్పాడు. దేశవాళీ క్రికెట్‌లో వ్యక్తిగత ప్రదర్శనలు కీలకమైనప్పటికీ, అయితే జట్టు సమతౌల్యం విషయాన్ని కూడా సెలక్షన్ సమయంలో పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందని, వివరించాడు. అంతర్జాతీయ అనుభవం మరియు ఛాంపియన్స్ ట్రోఫీ వంటి ఎంతో ప్రాధాన్యం ఉన్న టోర్నమెంట్‌లో ఆడే క్రికెటర్ల పై ఎంతో ఒత్తిడి ఉండనుందని. ఈ కారణంగా అనుభవం ఉన్నవారికే ప్రాధాన్యమిచ్చామని వివరించాడు.

**రోహిత్, కోహ్లీలకు ఢోకా లేదు**

ఊహించిన విధంగానే ఆస్ట్రేలియా పర్యటనలో ఘోరంగా విఫలమైన కెప్టెన్ రోహిత్ శర్మ, స్టార్ బ్యాట్స్మన్ విరాట్ కోహ్లీ లను ఇంగ్లాండ్ సిరీస్ కి, ఛాంపియన్స్ ట్రోఫీ టోర్నమెంట్ కి ఎంపిక చేయడం విశేషం. ఆస్ట్రేలియా పిచ్ ల పై ఘోరంగా విఫలమైన ఈ ఇద్దరూ సీనియర్ ఆటగాళ్లు దుబాయ్ లోని బ్యాటింగ్ కి అనుకూలంగా ఉండే పిచ్ ల పై రాణించే అవకాశం ఉండటమే ఇందుకు కారణం. ప్రధానంగా వీరిద్దరి వైఫల్యం కారణంగానే భారత్ జట్టు ఆస్ట్రేలియా తో టెస్ట్ సిరీస్ లో ఘోర పరాజయం చవిచూసింది. అయితే అపార అనుభవం కారణంగా ఎంతో ప్రాధాన్యం ఉన్న ఛాంపియన్స్ ట్రోఫీ టోర్నమెంట్లో వీరిద్దరి కి స్థానం కల్పించారు. అయితే ఆస్ట్రేలియా పర్యటనలో అంతగా రాణించలేకపోయిన ఓపెనర్ శుభమన్ గిల్ మళ్ళీ జట్టులో స్థానము కల్పించడమే కాకా, వైస్ కెప్టెన్ గా నియమించడం ఆశ్చర్యం కలిగించింది. "గిల్ గతంలో శ్రీలంకలో జరిగిన సిరీస్ లో వైస్ కెప్టెన్ గా వ్యవహరించాడు. డ్రెస్సింగ్ రూమ్ లో ఆటగాళ్ల వ్యవహారశైలిని కూడా ఎంపిక సమయంలో పరిగణలోకి తీసుకుంటాం. ఈ రోజుల్లో చాలా మంది ఆటగాళ్లు తమ రాష్ట్ర జట్లకు నాయకత్వం వహిస్తున్నారు. జట్టుకి నాయకత్వం వహించే నైపుణ్యం ఉన్న ఆటగాళ్ల పై ఎప్పుడూ దృష్టి పెట్టాల్సిందే, "అని అగార్కర్ చెప్పాడు. ఫిబ్రవరి 6న ప్రారంభమయ్యే ఇంగ్లాండ్‌తో జరిగే మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌కు, ఫిబ్రవరి 20న ప్రారంభమయ్యే ఛాంపియన్స్ ట్రోఫీ కి భారత్ జట్టు ఎంపిక అయితే పూర్తయింది. ఈ రెండు టోర్నమెంట్లలో భారత్ జట్టు ఎలా రాణిస్తుందో అనేదే ఇప్పుడు ఆసక్తికర అంశం.




## ఫైనల్లో భారత్
## ఖో ఖో ప్రపంచకప్

న్యూఢిల్లీ: అరంగేట్రం ఖోఖో ప్రపంచకప్‌లో ఆతిథ్య భారత్ అదరగొడుతున్నది. గ్రామీణ క్రీడలో తమకు తిరుగులేదని చాటిచెబుతూ మెగాటోర్నీలో భారత పురుషుల, మహిళల జట్లు ఫైనల్లోకి దూసుకెళ్లాయి. శనివారం జరిగిన వేర్వేరు సెమీస్ మ్యాచ్‌లో మన జట్లు దుమ్మురేపాయి. ఆఖరి వరకు ఆసక్తికరంగా సాగిన పురుషుల సెమీస్‌లో భారత్ 62-42తో దక్షిణాఫ్రికాపై విజయం సాధించింది.పాయింట్ల కోసం ఇరు జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. తొలి టర్న్‌లో ప్రతీక్ వైకర్, ఆదిత్య గన్పులెను దక్షిణాఫ్రికాన్లు సమర్థంగా నిలువరించగా, రెండో బ్యాచ్‌లో వచ్చిన అనికేత్ పోతె సఫారీలను రెండున్నర నిమిషాల పాటు అడ్డుకున్నాడు. రెండో టర్న్‌లో నిఖిల్, ఆదిత్య, గౌతమ్ రాణించడంతో భారత్ 24-20 ఆధిక్యం కనబరిచింది.కీలకమైన మూడో టర్న్‌లో రామ్‌జీ కశ్యప్, పబనీ సబర్, సుయాశ్ రాణించడంతో టీమ్ఇండియా గెలుపు ఖరారైంది. మరోవైపు %ఖ%మహిళల సెమీస్‌లో భారత్ 66-16తో దక్షిణాఫ్రికాను చిత్తు చేసింది. ఆదివారం జరిగే ఫైనల్లో నేపాల్‌తో భారత్ తలపడుతుంది.

## స్వియాటెక్ జోరు



మెల్‌బోర్న్: సీజన్ తొలి గ్రాండ్‌స్లామ్ ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో పోలండ్ భామ ఇగా స్వియాటెక్ జోరు దిగ్విజయంగా కొనసాగుతున్నది. శనివారం జరిగిన మహిళల సింగిల్స్ మూడో రౌండ్ పోరులో రెండో సీడ్ స్వియాటెక్ 6-1, 6-0తో ఎమ్మా రదుకాన్(బ్రిటన్)పై అలవోక విజయం సాధించింది. గంటా 10 నిమిషాల పాటు జరిగిన పోరులో స్వియాటెక్ కండ్లు చెదిరే షాట్లతో చెలరేగింది. బలమైన ఫోర్‌హ్యాండ్, బ్యాక్‌హ్యాండ్ షాట్లకు తోడు దీటైన సర్వ్‌లతో ప్రత్యర్థిని ఉక్కిరిబిక్కిరి చేసింది. మ్యాచ్ మొత్తమ్మీద స్వియాటెక్ రెండు ఏస్‌లు, మూడు డబుల్ ఫాల్ట్స్, 24 విన్నర్లు కొట్టింది. 12సార్లు అవనసర తప్పిదాలు చేయగా, 12 బ్రేక్ పాయింట్లలో ఐదింటిని కాపాడుకుంది. మిగతా మ్యాచ్‌ల్లో నవారో 6-4, 3-6, 6-4తో జుబెర్‌పై, రిబకినా 6-3, 6-4తో దయానా యస్ట్రేమస్కాపై, స్వితోలినా2-6, 6-4, 6-0తో పొలినిపై, మాడిసన్ కీస్ 6-4, 6-4తో కొలిన్స్‌పై, కసాట్కినా 7-5, 6-1తో పుతినెత్సెవాపై గెలిచి ముందంజ వేశారు. పురుషుల విభాగంలో టేలర్ ఫ్రిట్జ్ 6-3, 5-7, 6-7(1/7), 4-6తో మోన్‌ఫిల్స్ చేతిలో ఓడిపోయాడు. జానిక్ సినర్‌ర 6-3, 6-4, 6-2తో గిరోన్‌పై గెలిచాడు.




## సాత్విక్ జోడీ నిష్క్రమణ

న్యూఢిల్లీ: ఇండియన్ ఓపెన్ సూపర్-750 టోర్నీలో భారత ప్రస్థానం ముగిసింది. టైటిల్‌పై ఆశలు రేపిన భారత స్టార్ జోడీ సాత్విక్‌సాయిరాజ్, చిరాగ్‌శెట్టి పోరాటానికి సెమీఫైనల్లోనే చుక్కెదురైంది. శనివారం జరిగిన పురుషుల డబుల్స్ సెమీస్‌లో సాత్విక్, చిరాగ్ జోడీ 18-21, 14-21తో గో జి ఫి-నూర్ ఇజుద్దీన్(మలేషియా) ద్వయం చేతిలో ఓటమిపాలైంది. దాదాపు 40 నిమిషాల పాటు సాగిన మ్యాచ్‌లో ఏడో సీడ్ సాత్విక్, చిరాగ్ జంట తొలి గేమ్‌లో మాత్రమే ఒకింత దీటైన పోటీనిచ్చింది. అయితే కీలకమైన రెండో గేమ్‌లో ప్రత్యర్థికి సవాలు విసిరేందుకు ప్రయత్నించినా లాభం లేకపోయింది. మెరుపు లాంటి స్మాష్‌లకు తోడు సుదీర్ఘమైన ర్యాలీలతో మలేషియా జోడీ కీలక పాయింట్లు ఖాతాలో వేసుకుని మ్యాచ్‌ను తమ వశం చేసుకుంది.

GHMC
hmda
Growing Global
TS-bPASS
MAKAM GANGADHAR NETHA
President (GHMC)
Telangana Building Planners Association
E-mail ID : sriswamiplanners@gmail.com

వాస్తుకి బిల్డింగ్ ప్లానింగ్, నక్ష చేయబడును
డిజిటల్ లాండ్స్ సర్వే, లే-అవుట్లు,
నక్ష ప్లానింగ్ చేయబడును,
Auto DCR Online Up Loading, Pre DCR Cad Drawing
భవన నిర్మాణం దరఖాస్తు కొరకు సంప్రదించండి.
SRI SWAMI ASSOCIATES
ARCHITECTS • ENGINEERS • SURVEYORS
We Undertake Building Plans, Lay-Out Plans & Permissons, LRS, BRS, Tax Assesments
GHMC, HMDA, DTCP, TS-bpass, Layout, Building Permissions
H.No. 11-5-565, Bhagya Laxmi Towers,
Opp: GHMC Circle Office,
Saroornagar, Hyderabad - 500035
Mob : 9393929595

# మరోమైలు రాయిని దాటిన ఇస్రో

### వికాస్ లిక్విడ్ ఇంజిన్‌ను విజయవంతంగా పునఃప్రారంభించినట్లు వెల్లడి

**న్యూఢిల్లీ, (క్రైమ్ మిర్రర్):** ఇస్రో మరో మైలురాయిని సాధించింది. మహేంద్రగిరిలోని ప్రొపల్షన్ కాంప్లెక్స్‌లోని పరీక్షా కేంద్రంలో వికాస్ లిక్విడ్ ఇంజిన్‌ను విజయవంతంగా పునఃప్రారంభించినట్లు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ శనివారం తెలిపింది. ఇస్రో ప్రయోగ వాహకనౌకలకు లిక్విడ్ స్టేజ్‌లకు శక్తినిచ్చేదే ఈ వికాస్ ఇంజిన్ అని చెప్పింది. ఈ నెల 17న వికాస్ లిక్విడ్ ఇంజిన్‌ను మళ్లీ మండించినట్లు పేర్కొంది. తొలుత ఇంజిన్‌ను 60 సెకన్ల పాటు.. ఆ తర్వాత 120 సెకన్ల పాటు ఆపివేసి.. మళ్లీ ఏడు సెకన్ల పాటు మండించారు. పరీక్ష సమక్షంలో అన్ని పారామితులు సాధారణంగా ఉన్నట్లు తెలిపింది. ఇంజిన్ పనితీరును మరింత మెరుగుపరిచేందుకు అదనపు పరీక్షలు నిర్వహించేందుకు ప్రణాళికలు జరుగుతున్నాయని తెలిపింది. ఇటీవల ఇస్రో నింగిలో రెండు ఉపగ్రహాలను విజయవంతంగా అనుసంధానించి.. అంతరిక్ష చరిత్రలో భారత్ పేరును లిఖించింది. ఇస్రో ప్రతిష్ఠాత్మకంగా స్పేస్ డాకింగ్ ఎక్స్‌పర్‌మెంట్ (స్పేడెక్స్) చేపట్టింది. స్పేడెక్స్ ప్రయోగం విజయవంతమవడం ద్వారా భారత్ చరిత్ర సృష్టించింది. ఉపగ్రహాల డాకింగ్ సామర్థ్యం కలిగిన నాలుగో దేశంగా మన దేశం అవతరించింది. నింగిలో రెండు ఉపగ్రహాలను అనుసంధానం చేసిన భారత్.. అమెరికా, రష్యా, చైనా దేశాల సరసన సగర్వంగా చేరింది.




# దుండగుడు దొంగతనం చేయలేదు

### సైఫ్‌పై పదేపదే దాడి చేశాడు : కరీనాకపూర్



**ముంబై, (క్రైమ్ మిర్రర్):** సైఫ్ అలీఖాన్‌పై దాడి జరిగిన ఘటన గురించి కరీనా కపూర్ పోలీసులకు వివరించింది. ఇంట్లోకి చొరబడిన వ్యక్తి.. దూకుడుగా దాడి చేసినట్లు ఆమె చెప్పింది. అయితే ఆ దుండగుడు ఇంట్లో ఉన్న ఆభరణాలను టచ్ చేయలేదని తెలిపింది. బాంద్రా అపార్ట్‌మెంట్‌లో జరిగిన అటాక్ గురించి పోలీసులకు ఆమె తెలియజేసింది. సైఫ్‌తో ఘర్షణ జరిగిన సమయంలో ఆ వ్యక్తి చాలా దూకుడుగా వ్యవహరించినట్లు చెప్పింది. పదేపదే సైఫ్‌పై అటాక్ చేయడాన్ని చూశానని కరీనా తెలిపింది. సైఫ్‌ను ఆస్పత్రికి తీసుకెళ్లేందుకే ప్రియార్టీ ఇచ్చినట్లు పేర్కొన్నది. దాడి తర్వాత దుండగుడు పారిపోయాడని, విలువైన వస్తువుల్ని ఏమీ తీసుకెళ్లలేదని కరీనా తెలిపింది. పిల్లలు తైమూర్, జెహంగిర్‌ను రక్షించే ఉద్దేశంతో ఖాన్ ప్రతిదాడి చేసినట్లు ఆమె చెప్పింది. జెహంగిర్ వద్దకు దుండుగడు చేరుకోలేకపోయాడని, ఆ టైంలో ఖాన్‌పై పలుమార్లు అతను అటాక్ చేసినట్లు ఆమె తెలిపింది. దాడి తర్వాత చాలా ఆందోళనకు గురయ్యానని, అందుకే సోదరి కరిశ్మా తనను ఆమె ఇంటికి తీసుకెళ్లినట్లు తెలిపింది.

# సామాజిక మాధ్యమాల్లో పాకిస్తాన్‌కు అనుకూల పోస్టు

### వ్యక్తిని అరెస్టు చేసిన పోలీసులు

**లక్నో, (క్రైమ్ మిర్రర్):** సామాజిక మాధ్యమాల్లో పాకిస్థాన్ అనుకూల నినాదాలు పోస్టు చేసిన వ్యక్తిని ఉత్తరప్రదేశ్ పోలీసులు అరెస్టు చేశారు. యూపీలోని బరేలీలో ఉన్న నవాబ్‌గంజ్ ప్రాంతానికి చెందిన ఇమ్రాన్ అనే వ్యక్తి తన సోషల్ మీడియా అకౌంట్‌లో పాకిస్థాన్ జిందాబాద్ అని రాసి పోస్టు చేశాడు. అదికాస్తా వివాదానికి దారితీసింది. తమ మనోభావాలు దెబ్బతీసేలా పోస్టు చేశాడంతూ వినియోగదారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఆధారాలను సేకరించిన తర్వాత ఇమ్రాన్‌ను అదుపులోకి తీసుకున్నారు. ప్రజల మనోభావాలను కించపరిచేలా తన ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్‌లో పాకిస్థాన్ జిదాబాద్ అంటూ స్లోగన్‌ను పోస్టు చేసినందుకు అతడిని అరెస్టు చేశామని బరేలీ ఇన్‌స్పెక్టర్ రాజ్ కుమార్ శర్మ తెలిపారు. ఈ ఘటనలో దర్యాప్తు కొనసాగుతున్నదని వెల్లడించారు.

# 22న వినీలాకాశంలో అద్భుత దృశ్యం

### ఒకే వరుసలోకి ఆరు గ్రహాలు




**న్యూఢిల్లీ, (క్రైమ్ మిర్రర్):** వినీలాకాశంలో ఈ నెల 22న అద్భుత దృశ్యం ఆవిష్కృతం కాబోతున్నది. ఒకే వరుసలోకి ఆరు గ్రహాలు వచ్చి కనువిందు చేయనున్నాయి. ఆయా గ్రహాలు ఎలాంటి బైనాక్యులర్ల సహాయం లేకుండానే నేరుగా చూసేందుకు అవకాశం ఉంటుంది. ఈ నెల 22వ తేదీ నుంచి 31 వరకు గ్రహాలు ఒకో వరుసలోకి రాబోతున్నాయి. గ్రహాలు ఒకేవరుసలో చాలా అరుదుగా కనిపిస్తాయి. గ్రహాలు ఒకే వరుసలోకి రావడాన్ని ప్లానెటరీ అలైన్‌మెంట్‌గా ఖగోళ నిపుణులు పేర్కొంటున్నారు. శుక్రుడు, అంగారకుడు, బృహస్పతి, శని, యురేనస్, నెప్ట్యూన్ గ్రహాలు ఒకే వరుసలోకి రానున్నాయి. చాలా అరుదుగా గ్రహాలన్నీ ఒకే వరుసలోకి వస్తుంటాయి. ఈ దృగ్విషయాన్ని ప్లానెటరీ అలైన్‌మెంట్, పరేడ్ ఆఫ్ ప్లానెట్స్‌గా పిలుస్తుంటారు. వాస్తవానికి గ్రహాలకు మధ్య భారీగానే దూరం ఉంటాయి. గ్రహాలు ఏవీ అంతరిక్షంలో వరుస క్రమంలో ఉండవు. కానీ, మనకు భూమిపై నుంచి చూసిన సమయంలో ఒకే వరుసలో దర్శనమిస్తాయి. ఈ దృశ్యాన్ని బైనాక్యులర్స్ ద్వారా చూస్తే మాత్రం మరింత స్పష్టంగా కనిపిస్తాయి. శుక్రుడు, కుజుడు, బృహస్పతి, శని, యురేనస్, నెప్ట్యూన్‌లను చూసేందుకు ఫిబ్రవరి ప్రారంభం ఉత్తమమైన సమయంగా ఖగోళ నిపుణులు పేర్కొంటున్నారు. ఇక మార్చిలో అరుణగ్రహం, బృహస్పతి, యురేనస్, వీనస్, నెప్ట్యూన్, శని, మెర్క్యురీ గ్రహాలు ఒకేవరుసలోకి వచ్చి కనువిందు చేయనున్నాయి. దీన్ని గ్రేట్ ప్లానెటరీ అలైన్‌మెంట్‌గా పిలుస్తారు. ఈ ఖగోళవిందును టెలిస్కోప్ సహాయం లేకుండా చూడొచ్చు. కానీ, స్పష్టంగా నాలుగు గ్రహాలు మాత్రమే కనిపిస్తాయి. నెప్ట్యూన్, యురేనస్ గ్రహాలను చూసేందుకు టెలిస్కోప్ అవసరమవుతుంది. సూర్యాస్తమయం తర్వాత రాత్రి 8.30 గంటల నుంచి ఆకాశంలో ఈ అద్భుత దృశ్యం ఆవిష్కృతమవుతుంది. ఆ సమయంలోనే అన్ని గ్రహాలు ఒకేవరుసలో దర్శనమిస్తాయి. రాత్రి 11.30 గంటల తర్వాత మళ్లీ కనిపించవు. కానీ, బృహస్పతి, మార్స్, యురేనస్ గ్రహాలు కనిపిస్తాయి. ఆ తర్వాత మళ్లీ కనిపించకుండా పోతాయి. ఈ నెల 22 నుంచి 31 వరకు ఆయా గ్రహాలను భూమిపై నుంచి నేరుగా చూడొచ్చు. శని, బుధుడు, నెప్ట్యూన్ సూర్యాస్తమయం సమయంలో సూర్యుడికి దగ్గరగా వెళ్తాయి. మెర్క్యురీ, శని, నెప్ట్యూన్ సూర్యుడికి చాలా దగ్గరగా వెళ్లడంతో గ్రహాలు భూమిపైకి కనిపించడం తగ్గిపోతుంది. శు క్ర గ్రహం సైతం అంతగా కనిపించేందుకు ఛాన్స్ ఉండదు. బృహస్పతి, అంగారకుడు, యురేనస్ సైతం మాత్రమే కొద్దివారాల పాటు అలాగే ఉంటాయి.

# నదుల అనుసంధానంతోనే కరువు దూరం

### బనకచర్ల ద్వారా గోదావరి నీటిని తరలిస్తా

### ఎపికి పోలవరం ప్రాజెక్ట్ జీవనాడి

### ఎన్టీఆర్ రాజకీయంగా చరిత్ర సృష్టించారు

### మైదుకూరు పర్యటనలో సిఎం చంద్రబాబు




**కడప,(క్రైమ్ మిర్రర్):** నదుల అనుసంధానంతోనే కరవు రహిత రాష్ట్రం సాధ్యమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. పోలవరం ప్రాజెక్టు ఏపీ జీవనాడి అని చెప్పారు. గోదావరి నీటిని రాయలసీమకు తరలిస్తామని అన్నారు. కడప జిల్లా మైదుకూరులో శనివారం సీఎం చంద్రబాబు పర్యటించారు. 'స్వేచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్' కార్యక్రమంలో చంద్రబాబు పాల్గొన్నారు. రెండు సంవత్సరాల్లో పోలవరం పూర్తి చేస్తామని చెప్పారు. రాయలసీమ రైతులు మీసం తిప్పేలా చేస్తామని అన్నారు. బనకచర్లకు నీళ్లు తీసుకురావడం తన జీవితాశయమని ఉద్ఘాటించారు. వేంకటేశ్వరస్వామి పాదాల వరకు గోదావరి నీరు తీసుకువస్తామని సీఎం చంద్రబాబు చెప్పారు. ÷ూను కూడా రాయలసీమ బిడ్డనే అని గుర్తుచేశారు. నదుల అనుసంధానంతోనే కరవు రహిత రాష్ట్రం సాధ్యమని తెలిపారు.కడప స్టీల్‌ప÷-లాంట్ కూడా పూర్తి చేస్తామన్నారు. కొప్పర్తి ఇండస్ట్రియల్ కారిడార్ పూర్తిచేసి ఉపాధి కల్పిస్తామని చెప్పారు. ఈ నెల చివర్లోనే వాట్సాప్ గవరెన్స్ తీసుకొస్తామని అన్నారు. గండికోటను టూరిజం హబ్‌గా చేస్తామని చెప్పారు. వైసీపీ పాలనలో ఐదేళ్ల పాలనలో ఏం జరిగిందో అందరూ చూశారని చెప్పారు. డబుల్ ఇంజిన్ సర్కార్‌తో అభివృద్ధి పరుగులు పెడుతోందన్నారు. రెండేళ్లలో పోలవరం పూర్తి చేస్తామని సీఎం చంద్రబాబు అన్నారు. తెలుగు జాతి చరిత్ర ఉన్నంత వరకూ తెలుగువారి గుండెల్లో ఉండే ఏకైక వ్యక్తి ఎన్టీఆర్ అని ముఖ్యమంత్రి చంద్రబాబు కొనియాడారు. అనుక్షణం తెలుగువారి ఆత్మగౌరవం కోసం తపించిన నాయకుడు అని పేర్కొన్నారు. వైఎస్ఆర్ జిల్లా మైదుకూరులో నిర్వహించిన ఎన్టీఆర్ వర్ధంతి సభలో చంద్రబాబు పాల్గొన్నారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ప్రసంగించారు. 'ఎన్టీఆర్ అంటే మూడు అక్షరాలు కాదు.. తెలుగువారి ఆత్మగౌరవం. పేదవాడి గుండెల్లో తీపి జ్ఞాపకం. ప్రభుత్వం అంటే పాలకులు కాదు.. సేవకులని చెప్పిన ఏకైక నాయకుడు. పేదవాళ్లకు పక్కా ఇళ్లు నిర్మించింది ఎన్టీఆర్' అని చంద్రబాబు కొనియాడారు. 'ఈ నెలాఖరులో వాట్సాప్ గవర్నెన్స్ తీసుకొస్తాం. ఏ పని కావాలన్నా ఒక మెసేజ్ పెడితే చాలు. మీ సమస్యల పరిష్కారానికి ఆఫీసులకు వెళ్లే పని లేదు. మీ ముందుకే వచ్చి సమస్యలు పరిష్కరించే ఏర్పాట్లు చేస్తున్నాం' అని చంద్రబాబు తెలిపారు.

# ఆర్జీకర్ ఆస్పత్రి వైద్యురాలి హత్యాచార కేసు

### సంజయ్ రాయ్‌ను దోషిగా తేల్చిన కోర్టు

**కోల్‌కతా,(క్రైమ్ మిర్రర్):** దేశవ్యాప్తంగా పెను సంచలనం రేపిన ఆర్జీకర్ ఆస్పత్రి వైద్యురాలిపై హత్యాచారం కేసులో కోల్‌కతాలోని సీల్దా కోర్టు శనివారం తీర్పు వెలువరించింది. ప్రధాన నిందితుడు సంజయ్ రాయ్‌ను దోషిగా తేల్చింది. అతడికి జనవరి 20న శిక్ష ఖరారు చేయనుంది. గతఏడాది ఆగస్టు 9వ తేదీ రాత్రి ఆర్జీ కర్ ఆసుపత్రి సెమినార్ రూమ్‌లో ఒంటరిగా నిద్రిస్తున్న జూనియర్ వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటన తీవ్ర నిరసనలకు దారితీసింది. పశ్చిమ బెంగాల్ హైకోర్టు ఆదేశాల మేరకు ఈ కేసును కోల్‌కతా పోలీసుల నుంచి సీబీఐ స్వీకరించి, విచారిస్తోంది. దీనిలో భాగంగా ప్రత్యేక కోర్టుకు అభియోగాలు సమర్పించింది. ప్రధాన నిందితుడు సంజయ్ రాయ్ పేరును మాత్రమే ఛార్జ్‌షీట్‌లో చేర్చింది. సామూహిక అత్యాచారం విషయాన్ని అభియోగ పత్రంలో ప్రస్తావించలేదు. ఆసుపత్రి ఆవరణలోని సీసీటీవీలో నమోదైన దృశ్యాల ఆధారంగా సంజయ్‌ను ఆగస్టు 10న కోల్‌కతా పోలీసులు అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. ఇక ఈ కేసులో ఆర్జీకర్ మాజీ ప్రిన్సిపల్ సందీప్ ఘోష్,



తాలా పోలీస్ స్టేషన్ మాజీ ఆఫీసర్ ఇన్ ఛార్జి అభిజిత్ మండల్‌ను అరెస్టు చేసింది. సాక్ష్యాలు తారుమారుచేశారన్న ఆరోపణలపై వారు అరెస్టు కాగా.. తర్వాత వారికి ప్రత్యేక న్యాయస్థానంలో బెయిల్ లభించింది. వారు అరెస్టయిన దగ్గరినుంచి 90 రోజుల్లో అనుబంధ ఛార్జ్‌షీట్‌ను ఫైల్ చేయకపోవడంతో ఈ బెయిల్ లభించింది. ఇదిలా ఉంటే.. తీర్పు నేపథ్యంలో కోర్టు వద్ద భారీగా భద్రతాసిబ్బందిని మోహరించారు.

# తిరుమలలో అపచారాలకు ఎవరిది బాధ్యత

### మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్ ప్రశ్న

**తిరుపతి,(క్రైమ్ మిర్రర్):** తిరుమల విషయంలో గత ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేసిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి టిటిడికి అండగా ఉండగా జరుగుతున్నది ఏంటని టిటిడి మాజీ ఛైర్మన్ భూమన కరుణాకరరెడ్డి విమర్శించారు. శనివారం కరుణాకర రెడ్డి మీడియాతో మాట్లాడుతూ తిరుమలలో విజిలెన్స్ నిఘా పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. చంద్రబాబు పాలనలో మద్యం, మాంసం తిరుమలలో పట్టుబడుతున్నాయని ఆరోపించారు. శ్రీవారి ఆలయానికి సమీపంలో గుడ్డు బిర్యాని పట్టుబడింది అంటే టిటిడి వైఫల్యం మరోసారి బుట్టదాఖలైందని ధ్వజమెత్తారు. మారణాయుధాలతో వచ్చినా పట్టించుకోలేని పరిస్థితికి తీసుకువచ్చారని అన్నారు. ఎల్లో మీడియా ద్వారా అబద్ధపు ప్రచారాలు చేశారని ఆరోపించారు. టిడిపి నాయకుల సేవలో టిటిడి ఛైర్మన్ పనిచేస్తున్నారనీ, భక్తులను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. తిరుమల కొండపై ఎర్ర చందనాన్ని స్మగ్లింగ్ చేస్తూ 4 సార్లు పట్టుబడ్డారని అన్నారు. 40 సార్లు పట్టుబడకుండా తప్పించుకు తిరిగి ఉంటారు అని చెప్పారు. లడ్డు ప్రసాదం విషయంలో తమపై నింద మోపారనీ, తమపై నేరారోపణలు చేశారని ధ్వజమెత్తారు. వీటన్నిటిపై పవన్ కళ్యాణ్ , చంద్రబాబు ను ప్రశ్నించాలని కరుణాకర రెడ్డి కోరారు.


# ఢిల్లీలోని అద్దెవారికి తాగునీరు, విద్యుత్ ఉచితం : కేజ్రీవాల్

**న్యూఢిల్లీ, (క్రైమ్ మిర్రర్):** దేశ రాజధాని ఢిల్లీలో అధికారంలో ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) అధినేత అరవింద్ కేజ్రీవాల్ మరో ఎన్నికల హామీ ప్రకటించారు. ఢిల్లీలో నివసించే అద్దెదారులకు విద్యుత్, తాగు నీరు ఉచితంగా అందిస్తామని తెలిపారు. శనివారం మీడియా సమావేశంలో అరవింద్ కేజ్రీవాల్ మాట్లాడారు. 'మేం ఢిల్లీ నివాసితులకు ఉచిత విద్యుత్, ఉచిత తాగు నీరు అందించాం. అయితే అద్దెదారులకు ఈ ప్రయోజనాలు లభించకపోవడం దురదృష్టకరం. ఎన్నికల తర్వాత మా ప్రభుత్వం ఏర్పడితే, అద్దెదారులకు కూడా ఉచిత విద్యుత్, తాగు నీరు అందించే వ్యవస్థను ప్రవేశపెడతాం' అని అన్నారు. కాగా, ఢిల్లీలో నివసిస్తున్న చాలా మంది అద్దెదారులు పూర్వాంచల్‌కు చెందినవారని అరవింద్ కేజ్రీవాల్ తెలిపారు. వారిలో చాలా మంది చాలా పేదవారని చెప్పారు. వారు ఎలాంటి సబ్సిడీలు పొందలేక ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని అన్నారు. దీనిని పరిష్కరించడానికి తాము ప్రయత్నిస్తామని కేజ్రీవాల్ తెలిపారు.

# సొంత నిధులతో ఎన్టీఆర్ ఘాట్ నిర్వహణ

### మరమ్మత్తులు చేపట్టాలని మంత్రి లోకేశ్ ఆదేశం

### దివంగత నేత ఎన్టీఆర్‌కు కుటుంబ సభ్యుల నివాళి




**హైదరాబాద్,(క్రైమ్ మిర్రర్):** ఎన్టీఆర్ ఘాట్ నిర్వహణపై ఆంధ్రప్రదేశ్ విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. శనివారం ఎన్టీఆర్ 29వ వర్ధంతి సందర్భంగా హైదరాబాద్(లోని ఎన్టీఆర్ ఘాట్‌కు లోకేశ్ చేరుకున్నారు. దివంగత మహానేత, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ ఘాట్ వద్ద లోకేశ్ నివాళులు అర్పించారు. అయితే ఘాట్ నిర్వహణను చూసి ఆయన తీవ్ర ఆవేదనకు గురయ్యారు. ఘాట్ గోడలు, పైకప్పు పెచ్చులు ఊడిపోవడం, గా÷-డ్గ÷న్‌లో ఏర్పాటు చేసిన లైట్లు విరిగిపడి ఉండటాన్ని లోకేశ్ గమనించారు. ఘాట్ నిర్వహణ బాధ్యతలు చూడాల్సిన హెచ్ఎండీఏ తీరుపై అసహనం వ్యక్తం చేశారు. ఎన్టీఆర్ ఘాట్ మరమ్మతు పనులు తన సొంత నిధులతో వెంటనే చేపట్టాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. మరోవైపు ఎన్టీఆర్ ఘాట్ నిర్వహణను హెచ్ఎండీఏ అధికారులు పట్టించుకోవడం లేదంటూ అక్కడికి వచ్చిన ఎన్టీఆర్ అభిమానులు సైతం తీవ్ర ఆగ్రహానికి గురయ్యారు. ఇదేనా ఓ మహానేతకు ఇవ్వాల్సిన గౌరవం అంటూ మండిపడ్డారు. ఘాట్ నిర్వహణ తమకు అప్పగించాలని గతంలో పలుమార్లు తెలంగాణ ప్రభుత్వానికి ఎన్టీఆర్ ట్రస్ట్ విజ్ఞప్తి చేసింది. దీనిపై తెలంగాణ ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదు. తాజాగా ఎన్టీఆర్ ఘాట్ నిర్వహణను చూసి ఎంతో బాధపడిన మంత్రి లోకేశ్.. అవసరమైన అనుమతులు తీసుకొని వీలైనంత తొందరగా మరమత్తు పనులు పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. కాగా, శనివారం ఉదయం నుంచీ ఎన్టీఆర్ ఘాట్ వద్దకు నందమూరి, నారా కుటుంబసభ్యులు, బంధువులు, ఎన్టీఆర్ అభిమానులు పెద్దఎత్తున తరలివచ్చి దివంగత నేతకు నివాళి అర్పించారు. హిందూపురం ఎమ్మెల్యే, సినీ నటుడు బాలకృష్ణ, జూ.ఎన్టీఆర్, కల్యాణ్ రామ్, లక్ష్మీపార్వతి, ఏపీ ఉపసభాపతి రఘురామకృష్ణరాజు సహా పలువురు ప్రముఖులు వచ్చి ఎన్టీఆర్‌కు నివాళులు అర్పించారు.



# నాన్న అలా అంటాడనుకోలేదు : కీర్తిసురేష్

హీరోయిన్ కీర్తి సురేశ్ ఇటీవల తన చిరకాల మిత్రుడు ఆంటోనిని పెళ్లి చేసుకున్న సంగతి తెలిసిందే. హిందూ, క్రిస్టియన్ సంప్రదాయాల్లో వీరిద్దరి పెళ్లి జరిగింది. 15 ఏళ్ల ప్రేమకథను రోజుకో ఎపిసోడ్‌లాగా కీర్తి పంచుకుంటున్నారు. బేబీజాన్ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా ఓ ఇంటర్వ్యూలో పెళ్లి విశేషాలను పంచుకున్నారు. ముఖ్యంగా క్రిస్టియన్ పద్ధతి గురించి మాట్లాడుతూ.. ఆంటోనీ కుటుంబ ఆచారాలకు అనుగుణంగా ఆ సంప్రదాయం లో పెళ్లి చేసుకున్నామన్నారు. "క్రిస్టియన్ సంప్రదాయంలోనూ పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నాక మా నాన్నతో మాట్లాడాను. 'నాన్నా.. ఈ సంప్రదాయం ప్రకారం వధువును ఆమె తండ్రి పెళ్లి వేదిక పైకి తీసుకురావాలి. నా కోసం మీరు కూడా ఆ విధంగా చేస్తారా?' అని అడిగా. 'తప్పకుండా చేస్తాను. మనం రెండు సంప్రదాయాల్లో వివాహం జరుపుతున్నాం. కాబట్టి నేను కూడా ఆ పద్ధతులు పాటిస్తాను' అని ఆయన బదులిచ్చారు. ఆ మాట నాకెంతో సంతోషాన్ని ఇచ్చింది. నేను చెప్పిన దానికి ఆయన అంగీకరిస్తారని అసలు ఊహించలేదు. కానీ ఆయన నా కోసం ఆ విధంగా చేయడం ఎంతో ఆనందాన్ని ఇచ్చింది" అని కీర్తి సురేశ్ తెలిపారు. ఇటీవల బేబీజాన్ ఈవెంట్‌కు వెళ్లిన ఆమె పసుపుతాడు (మంగళసూత్రం)తో హాజరు కావడంపై ఆమె స్పందించారు. "దక్షిణాదిలో ఒక సంప్రదాయం ఉంది. పెళ్లి సమయంలో వధువు మెడలో వరుడు పసుపుతాడు కడతాడు. దానిని మేమెంతో పవిత్రంగా భావిస్తాం. పెళ్లైన కొన్ని రోజులకు ఒక మంచి ముహూర్తం చూసి మంగళ సూత్రాలను బంగారు చైన్‌లోకి మార్చుకుంటాం. జనవరి చివరివరకూ మంచి రోజులు లేవు. అప్పటివరకూ నేను ఎక్కడికి వెళ్లినా పసుపు తాడు తో కనిపిస్తాను" అని తెలిపారు. ఆంటోనీ, కీర్తి 15 ఏళ్లగా ప్రేమలో ఉన్నారు. కీర్తి కంటే అతను ఏడేళ్ల పెద్దవాడు. అందరిలాగే రిలేషన్‌లో ఉన్నప్పుడు ఎన్నో సమస్యలు ఎదుర్కొన్నామని కీర్తి చెప్పారు. కొవిడ్ సమయంలో కలిసి ఉన్నామని, 2022లో పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నామని కీర్తి అన్నారు. పెద్దల అంగీకారంతో ఈ జంట డిసెంబర్‌లో వివాహబంధంలోకి అడుగుపెట్టింది. కుటుంబసభ్యులు, అత్యంత సన్నిహితుల సమక్షంలో గోవాలో పెళ్లి జరిగింది.



# మగాళ్లు శృంగారం చేయకండి : చిన్మయి శ్రీపాద

చిన్మయి శ్రీపాద.. ఈ పేరు అంటేనే కొంతమందికి హడల్, మరికొందరికి కోపం, చిరాకు ఇంకొందరికి ప్రేమ, అభిమానం. ఈ అభిప్రాయాలన్ని కేవలం ఆమె కళ సృజనాత్మకత గురించి మాత్రమే కాదు. ఆమె తనకంటూ ఒక అభిప్రాయం, స్టాండ్, పర్సనాలీటీని క్రియేట్ చేసుకున్నాక చాలా మందికి కంటి మీద నిద్ర లేకుండా చేస్తోంది. బహిరంగంగాను, సోషల్ మీడియా ద్వారాను ఆమె సొసైటీలో మహిళలు పేస్ చేస్తున్న సమస్యలపై పోరాటం చేస్తుంటుంది. తాజాగా ఓ నెటిజన్ చేసిన ట్వీట్ కి దిమ్మదిరిగిపోయే కౌంటర్ ఇచ్చి మరోసారి వార్తల్లో నిలిచింది. ఇంతకీ ఏం జరిగిందంటే.. 2024 సంవత్సరం పూర్తికావడంతో చాలా సంస్థలు వాళ్ళ సేల్స్, అచీవ్ మెంట్స్ తదితర అంశాలని షేర్ చేశాయి. ఈ నేపథ్యంలోనే.. ప్రముఖ హెూమ్ డెలివరీ గ్రోసరీస్ సంస్థ బ్లింక్ ఇట్ సీఈఓ ఒక్క రోజులోనే తమ యాప్ ద్వారా లక్షకు పైగా కండోమ్స్ సేల్ చేసినట్లు ట్వీట్ చేశారు. ఈ క్రమంలోనే ఓ నెటిజెన్.. ఇలా అయితే వర్జిన్ అమ్మాయిలు భార్యలుగా దొరకడం కష్టమే.. అంటూ ట్వీట్ చేశాడు. దీనికి చిన్మయి స్పందిస్తూ.. "మగాళ్లు పెళ్ళికి ముందు అమ్మాయిలతో శృంగారం చేయడం ఆపండి. మీ అన్నదమ్ముల్ని, ఫ్రెండ్స్ ని పెళ్లి అయ్యేదాకా అలాంటి పని చేయొద్దని చెప్పండి" అంటూ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చింది. దీంతో ఈ వార్త తెగ వైరల్ అవుతోంది. మీటూ మూవ్‌మెంట్‌లో భాగంగా ప్రముఖ తమిళ గేయ రచయిత వైరముత్తు, పలువురు ఇండస్ట్రీకి చెందిన ప్రముఖులపై ఆమె సంచలన కామెంట్స్ చేశారు. ఎందరో మహిళలలకు ఆమె అండగా నిలుస్తూ పోరాటం చేస్తున్నారు.

# త్రివిక్రమ్ శ్రీనివాస్ వల్ల నా ఆనందం కోల్పోయాను.. నటి పూనమ్ కౌర్ సంచలన కామెంట్స్



[illegible] ఇండస్ట్రీ సమస్యలతోపాటు సామాజిక అంశాలపై ఎప్పటికప్పుడు తనదైన శైలిలో స్పందిస్తుంటుంది నటి పూనమ్ కౌర్ [illegible]. ఏదో ఒక ట్వీట్‌తో వార్తల్లో నిలుస్తుండే ఈ భామ తాజాగా ఎక్స్‌లో చేసిన పోస్ట్ హాట్ టాపిక్‌గా మారింది. త్రివిక్రమ్ [illegible]పై చాలా కాలం క్రితమే ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. అతని కారణంగా ఇబ్బందులు ఎదుర్కొన్నా, త్రివిక్రమ్ వల్ల నా జీవితంలో ఆనందం కోల్పోయాను. ఇప్పటివరకు త్రివిక్రమ్‌ను ఎవరూ ప్రశ్నించలేదు. త్రివిక్రమ్‌కు పెద్దల సపోర్ట్ ఉందని ట్వీట్ చేసింది పూనమ్ కౌర్. అయితే దీనిపై మా అసోసియేషన్ స్పందించింది. మా అసోసియేషన్ కోశాధికారి శివబాలాజీ [illegible]మాట్లాడుతూ.. మాకు పూనమ్‌కౌర్ నుంచి ఎలాంటి ఫిర్యాదు రాలేదన్నారు. ట్వీట్ చేయడం వల్ల ఎలాంటి ఉపయోగం ఉండదు. మా అసోసియేషన్, కోర్టును ఆశ్రయిస్తే పూనంకౌర్‌కు న్యాయం జరుగుతుందని స్పష్టం చేశాడు శివబాలాజీ. మరి ఈ వ్యవహారం ఎలాంటి మలుపులు తిరుగుతుందనేది సర్వత్రా ఆసక్తి నెలకొంది.

# 'మ్యాడ్'నెస్ రెండింతలు

'మ్యాడ్' సినిమా యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా ప్రేక్షకుల్ని మెప్పించింది. దీంతో సీక్వెల్‌గా రానున్న 'మ్యాడ్ స్క్వేర్' కోసం ప్రేక్షకుల్లో ఉత్సుకత పెరిగింది. సంగీత్ శోభన్, నార్నే నితిన్, రామ్ నితిన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి కల్యాణ్ శంకర్ దర్శకత్వం వహిస్తున్నారు. హారిక సూర్యదేవర, సాయిసౌజన్య నిర్మాతలు. ఈ సినిమాను మార్చి 29న విడుదల చేయబోతున్నట్టు మేకర్స్ ప్రకటించారు. ఈ సందర్భంగా కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. తొలిభాగం కంటే రెట్టింపు వినోదం, ఊహించిన దానికంటే ఎక్కువ మ్యాడ్‌నెస్‌తో ఈ సినిమా ఆకట్టుకుంటుందని, వినోదాన్ని మరో స్థాయికి తీసుకెళ్తుందని దర్శకుడు తెలిపారు. ఇప్పటికే విడుదలైన లడ్డుగాని పెళ్లి, స్వాతి రెడ్డి పాటలు శ్రోతల ఆదరణ పొందాయని, సంగీతానికి కూడా చాలా ప్రాధాన్యత ఉంటుందని మేకర్స్ పేర్కొన్నారు. ఈ చిత్రానికి సంగీతం: భీమ్స్ సిసిరోలియో, సమర్పణ: సూర్యదేవర నాగవంశీ, దర్శకత్వం: కల్యాణ్‌శంకర్.



# ఏడాదిలోనే మహేష్‌బాబు సినిమా



రాజమౌళితో సినిమా అంటే ఎంత పెద్ద స్టార్ అయినా సై అనాల్సిందే. ఆ కాంబినేషన్ ఫ్యాన్స్‌కు పండగ. అయితే హీరో మాత్రం మినిమం మూడేళ్లు మరో పని లేకుండా లాక్ అయిపోవాల్సిందే. జక్కన్నతో సినిమా అంటే మరో మూడేళ్లు అభిమాన హీరో తెరపై కనిపించడనే భయం అభిమానులకు ఉంటుంది. రాజమౌళితో సినిమా ఫిక్సయితే, మినిమం మూడు నాలుగేళ్లు ఆ సినిమాకే అంకితం అయిపోవాలి. పండగలకు, ఇతర సెలబ్రేషన్‌లకు ఫస్ట్ లుక్, టీజర్, గ్లింప్స్ అంటూ ఏ హడావిడి ఉండదు. హీరోలు కూడా జక్కన్న కండిషన్స్‌కు రెడీ అయిపోతారు. ప్రస్తుతం మహేష్ బాబు రాజమౌళితో ఓ సినిమా చేస్తున్నాడు. ఇది సూపర్‌స్టార్ ఫ్యాన్స్ అందరికీ సంబరమే. ఇప్పుడు మూడేళ్లు మహేశ్ జక్కన్న కాంపౌండ్‌లో లాక్ అయిపోయాడనే భయం వాళ్లలో ఉంటుంది. అయితే తాజాగా రామ్ చరణ్ మాటలు మహేష్ అభిమానుల చెవుల్లో అమృతం నింపినట్టయింది. 'అన్నీ అనుకొన్నట్టు కుదిరితే.. ఏడాదిన్నరలో మహేష్ సినిమా వచ్చేస్తుంది' అంటూ 'గేమ్ ఛేంజర్' ట్రైలర్ ఈవెంట్‌లో రామ్‌చరణ్ చెప్పారు. తను తెలిసి చెప్పాడో, తెలియక చెప్పాడో తెలీదు కానీ, 'చరణ్ మాటలు నిజమైతే సూపర్‌గా ఉంటుంది' అని ఫ్యాన్స్ దేవుళ్లను మొక్కేస్తున్నారు. అయితే చరణ్ మాటలను అంత లైట్ తీసుకోవాల్సిన పని లేదు. రాజమౌళి ప్లానింగ్ గురించి చరణ్‌కు బాగా తెలుసు. 'బాహుబలి', 'ఆర్.ఆర్.ఆర్' సినిమాల్లాగా మహేష్ సినిమా లేట్ కాకపోవొచ్చన్నది ఇన్ సైడ్ వర్గాల మాట. సినిమా థియేటర్లు ఈసారి రాజమౌళి ప్రీ ప్రొడక్షన్‌కి చాలా టైమ్ తీసుకున్నారు. ప్రొడక్షన్ మాత్రం చక చక పూర్తి చేయాలన్నది ఆయన ప్లాన్. నిజానికి లాక్ డౌన్ లేకపోతే 'ఆర్.ఆర్.ఆర్' కూడా చాలా త్వరగా పూర్తయ్యేది. కరోనా వల్ల ఆ సినిమా లేటయింది. 2026 చివర్లో మహేష్ ఎస్ఎస్ఎంబీ29 చిత్రాన్ని విడుదల చేయాలన్నది రాజమౌళి ప్లాన్. అయితే ఈ విషయాన్ని ఆయన బయటకు చెప్పడం లేదు. ఎందుకంటే ఓ రిలీజ్ డేట్ చెప్పడం, అది చేయి జారిపోవడం, మరో రిలీజ్ డేట్ ప్రకటించడం.. ఇలా కన్ఫ్యూజన్ సృష్టించడం జక్కన్నకు ఇష్టం లేదు. 'ఆర్.ఆర్.ఆర్'కు రిలీజ్ డేట్లు చాలా మారాయి.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.